


www.aksharamtelugudaily.com

# సుఖం అక్షరం

సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక

బుధవారం 24 జనవరి 2024 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా

పేజీలు : 12 సంపుటి : 06 సంచిక : 308 వెల : రూ.3/- కొత్తగూడెం తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, ASIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

## అమెరికాలో ఉద్యోగాల ఊచకోత



• 2లో

# రేవంత్‌ను కలిసిన నలుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

**సీఎం ఇంటికెళ్లిన సునీత, ప్రభాకర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, మాణిక్‌రావు పార్టీ మార్పుపై ఊహాగానాలు ఖండించిన ఎమ్మెల్యేలు.. ప్రొటోకాల్ కోసమేనని వివరణ**

**పట్నం మహేందర్‌రెడ్డి కాంగ్రెసలో చేరుతున్నారంటూ ప్రచారం**

**హైదరాబాద్, జనవరి 23 (అక్షరం న్యూస్):** బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి (నర్సాపూర్)బీ కొత్త ప్రభాకర్ రెడ్డి (దుబ్బాక)బీ గూడెం మహిపాల్ రెడ్డి (పటాన్‌చెరు)బీ మాణిక్ రావు (జహీరాబాద్) మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. సీఎం నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛాలు అందజేశారు. పార్లమెంటు ఎన్నికల తర్వాత బీఆర్ఎసను వంద మీటర్ల లోతున పాతిపెడతామని లండన్ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించడంబీ 30 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారని, తామే చేర్చుకోవడానికి సిద్ధంగా లేమని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యానించిన వెన్వెంటనే నలుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సీఎంలు కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. వారు పార్టీ మారుతున్నారంటూ పార్టీ వర్గాల్లో ప్రచారం జోరుగా ➤ మిగతా 2లో..



# తొలిరోజే 5లక్షల మంది!

అయోధ్య రాముడి దర్శనానికి పోటెత్తిన భక్తులు
సోమవారం అర్ధరాత్రి నుంచే క్యూలలోకి ప్రవేశం
కిక్కిరిసిన 13 కిలోమీటర్ల పొడవైన రామ్ పథ్
ప్రధాన ద్వారం వద్ద పతాక స్థాయికి చేరిన రద్దీ
అదుపు చేయలేక భద్రతా సిబ్బంది ఉక్కిరిబిక్కిరి
ఎనిమిది వేలమందికి పైగా పోలీసులతో బందోబస్తు
ఏర్పాట్లను పరిశీలించిన సీఎం యోగి ఆదిత్యనాథ్



అయోధ్య, జనవరి 23: అయోధ్య భక్తజన సంద్రంగా మారింది. బాలరాముడి దర్శనం కోసం దేశం నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులతో వీధులన్నీ కిటకిటలాడుతున్నాయి. మంగళవారం ఒక్కరోజే రామయ్యను దాదాపు 5లక్షల మంది దర్శించుకున్నారని అధికారులు అంచనా వేస్తున్నారు. సోమవారం ప్రాణప్రతిష్ఠ అనంతరం వీఐపీలు మాత్రమే స్వామివారిని దర్శించుకోగా, మంగళవారం ఉదయం నుంచి సామాన్య భక్తులకు దర్శనానికి ట్రస్ట్ అధికారులు గేట్లు తెరిచారు. ఈ విషయాన్ని ముందుగానే ప్రకటించడంతో సోమవారం అర్ధరాత్రి నుంచే క్యూలైన్లలోకి లక్షలాది మంది ప్రవేశించారు. ఉదయం నుంచి భక్తుల తాకిడి పెరుగుతూ పోయి, మధ్యాహ్నానికి మందిర ప్రధాన ద్వారం వద్ద రద్దీ పతాక స్థాయికి చేరుకుంది. ఆలయానికి చేరుకొనే ➤ మిగతా 2లో..

# రాహుల్‌పై కేసు

**అసోం సీఎం హిమంత ఆదేశాలతో నమోదు**
**రాహుల్ పాదయాత్ర మార్గంలో బారికేడ్లు**
**వాటిని ఛేదించుకుని వెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు**
**ఇది అసోం సంస్కృతి కాదని మండిపడ్డ సీఎం**


• 2లో

# త్వరలోనే నామినేటెడ్ పోస్టుల భర్తీ..!

## మొదటి విడతలో 20 మంది వరకు ఛాన్స్

**హైదరాబాద్, జనవరి 23 (అక్షరం న్యూస్):** నామినేటెడ్ పదవుల కోసం ఎప్పుడెప్పుడా..? అని ఎదురు చూస్తున్న ఆశావాహులకు త్వరలోనే తీపి కబురు అందనుందని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. 18 నుంచి 20 మంది పార్టీ కీలక నేతలకు మొదటి విడతలో అవకాశం దక్కుతుందని, రెండొ విడతలో ఈ నెలాఖరులో మరో 30 నుంచి 40 మందికి నామినేటెడ్ పదవులు కేటాయించాలని నిర్ణయం తీసుకున్నట్లుగా సమాచారం.


పదవులు పంపకంలో సామాజిక న్యాయాన్ని పరిగణలోకి తీసుకున్నట్లుగా తెలుస్తోంది. అన్ని వర్గాలకు ప్రాధాన్యత దక్కే విధంగా కసరత్తు పూర్తి చేశారని తెలిసింది. అందులో ఇటీవల జరిగిన అసెంబ్లి ఎన్నికల్లో టికెట్ దక్కని వారు, పార్టీ విజయం కోసం కీలకంగా పని చేసిన వారికి చోటు దక్కుతుందని ప్రచారం జరుగుతోంది. నామినేటెడ్ పదవులకు సంబంధించి పార్లమెంట్ నియోజక వర్గాల వారిగా ఒక్కో అసెంబ్లి నియోజక వర్గం నుంచి సుమారుగా నాలుగు నుంచి ఐదుగురి పేర్లను తెప్పించుకున్నట్లుగా సమాచారం.

త్వరలోనే వీటికి సంబంధించి ఉత్తర్వులు వచ్చే అవకాశ ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా వారి పేర్లకు ఆమోద ముద్ర వేయడంతో పాటు జాబితాను కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి పంపించినట్లు సమాచారం. ఇప్పటికే పార్టీకి చెందిన నలుగురు సీనియర్లకు ప్రభుత్వ సలహాదారులుగా నియమించిన సీఎం రేవంత్‌రెడ్డి కేబినెట్ హొదాను కూడా కల్పించారు. సీఎం సలహాదారుగా మాజీ ఎమ్మెల్యే ➤ మిగతా 2లో..



# మేడిగడ్డపై ఎఫ్ఐఆర్


త్వరలో ప్రభుత్వానికి విజిలెన్స్ నివేదిక



**హైదరాబాద్, జనవరి 23 (అక్షరం న్యూస్):** ఆది నుంచి కాళేశ్వరంపై అక్కసు వెళ్లగక్కుతున్న కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు అధికారం దక్కడంతో ఆ ప్రాజెక్టును అడ్డుపెట్టుకొని గత ప్రభుత్వంపై కక్ష సాధింపు చర్యలకు దిగే ప్రయత్నాలు చేస్తున్నది. కాళేశ్వరంలో పుష్కలంగా నీళ్లున్నప్పటికీ రైతులకు ప్రభుత్వం సాగునీళ్లు ఇవ్వడంలో విఫలమవుతున్నదనే ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో విమర్శల నుంచి తప్పించుకునేందుకు గత ప్రభుత్వంపై ప్రతీకార చర్యలకు ఒడిగడుతున్నట్టు తెలిసింది. ఇందులో భాగంగా మేడిగడ్డలో అనుకోనివిధంగా జరిగిన ప్రమాదాన్ని బూచిగా ➤ మిగతా 2లో..

# 5 వేల కోట్ల పెట్టుబడులు!

దేశంలోనే తొలి కాస్మెటిక్ హబ్.. హైదరాబాద్‌లో ఏర్పాటు..
దక్షిణ కొరియా కంపెనీ దూసన్ ప్రకటన
మంత్రి కోమటిరెడ్డితో కంపెనీ ప్రతినిధుల భేటీ


• 2లో

# రాష్ట్రంలో కొత్తగా 11 ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీలు..


• 2లో

# ఆదాయ మార్గాలను అన్వేషించండి

**ఆర్టీసీ ఖర్చులను తగ్గించే ప్రయత్నం చేయండి**
**ఆలయ పర్యాటకాన్ని అభివృద్ధి చేయాలి**
**అధికారులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**హైదరాబాద్, జనవరి 23 (అక్షరం న్యూస్):** మెట్రో రైలు తరహాలో ఆదాయం వచ్చే మార్గాలను పరిశీలించాలని ఆర్టీసీ అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. సంస్థ ఖర్చులను తగ్గించుకోవడానికి ప్రయత్నించాలని చెప్పారు. రవాణా, బీసీ సంక్షేమ శాఖల బడ్జెట్ ప్రతిపాదనలపై మంగళవారం ఆ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడారు. అదనపు ఆదాయ మార్గాలను అన్వేషించాలని రవాణా శాఖ అధికారులకు సూచించారు. వచ్చే ఆర్థిక సంవత్సరం(2024-25) బడ్జెట్‌లో కనీసం రూ.5,500 కోట్లు కేటాయించాలని ప్రభుత్వానికి ఆర్టీసీ ప్రతిపాదనలు సమర్పించినట్టు తెలిసింది. ➤ మిగతా 2లో..



# అవిశ్వాసాలపై వివరణ ఇవ్వండి

## ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

**హైదరాబాద్, జనవరి 23 (అక్షరం న్యూస్):** పలు మున్సిపాలిటీ చైర్మన్లకు జారీ అయిన అవిశ్వాస తీర్మానాలపై వివరణ ఇవ్వాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. తెలంగాణ మున్సిపల్ చట్టం-2019 సెక్షన్ 37లో అవిశ్వాస తీర్మానం ఆమోదించడానికి సంబంధించిన విధానం లేదనే అప్పీల్ పిటిషన్లపై ప్రభుత్వ వైఖరి తెలియజేయాలని ఆదేశించింది. ప్రతివాదులైన పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి, కమిషనర్లతో పాటు సంగారెడ్డి, మేడ్చల్, యాదాద్రి-భువనగిరి, జనగామ కలెక్టర్లకు నోటీసులు జారీ చేసింది. సదాశివపేట, ఆందోల్-జోగిపేట, జవహర్‌నగర్, జనగామ, ఆలేరు మున్సిపల్ కార్పొరేషన్ చైర్మన్లపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాలపై నోటీసులు జారీచేసింది. ఆయా మున్సిపల్ కార్పొరేషన్లల్లో జారీచేసిన అవిశ్వాస తీర్మానాల్లో సింగిల్ జడ్జి జోక్యం చేసుకోకపోవడంతో వాటి చైర్మన్లు అప్పీల్ పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టి స్ అలోక్ అరాధే, జస్టిస్ జే అనిల్‌కుమార్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. ప్రభుత్వ వాదనల తర్వాత ఉత్తర్వులు ఇస్తామని, విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది.



# అమెరికాలో ఉద్యోగాల ఊచకోత

**2022తో పోలిస్తే 2023లో 98% అధికం.. ఐటీ రంగంలో ఆ సంఖ్య 73శాతం ఎక్కువ**
**రిటైల్ రంగంలో ఏకంగా 274శాతం అధికం.. జాబ్ మార్కెట్‌పై వడ్డీరేట్లు, ద్రవ్యోల్బణ ప్రభావం**
**చాలెంజర్ గ్రే అండ్ క్రిస్మస్ నివేదికలో వెల్లడి.. ఈ ఏడాదీ భారీ కోతలుండొచ్చని అంచనా**
**2022 చివరి త్రైమాసికంలో రెండు లక్షల మందిని తొలగించిన అమెరికా ఐటీ సంస్థలు**
**వారిలో దాదాపు 80 వేల మంది భారతీయులే.. వారు ఇక్కడికి వచ్చినా దొరకని అవకాశాలు**

న్యూయార్క్, జనవరి 23: అగ్రరాజ్యం అమెరికాలో ఉద్యోగ మార్కెట్‌ను అధిక వడ్డీ రేట్లు, ద్రవ్యోల్బణం దారుణంగా దెబ్బతీస్తున్నాయి! ఈ రెండింటి దెబ్బకూ కంపెనీలు భారీగా ఉద్యోగులను తొలగిస్తున్నాయి!! గణాంకాల్లో చెప్పాలంటే.. 2022తో పోలిస్తే 2023లో అమెరికాలో ఉద్యోగాల కోత 98% పెరిగింది. ద్రవ్యోల్బణం, ఫెడరల్ వడ్డీ రేట్ల పెంపు పరిస్థితుల్లో ఏ మాత్రం మార్పు లేని నేపథ్యంలో.. ఈ ఏడాది కూడా ఉద్యోగాల ఊచకోత కొనసాగే ప్రమాదం ఉందని అమెరికాకు చెందిన ప్రముఖ స్టాఫింగ్ సంస్థ చాలెంజర్, గ్రే అండ్ క్రిస్మస్ ఒక నివేదికలో హెచ్చరించింది. దాని ప్రకారం.. 2022లో అమెరికా కంపెనీలు 3,63,832 మంది ఉద్యోగులను తొలగించగా.. 2023లో ఆ సంఖ్య ఏకంగా 7,21,677కు చేరింది. గత ఏడాది ఉద్యోగాలు కోల్పోయిన ఏడు లక్షల మందిలో 1,68,032 మంది.. అమెజాన్, గూగుల్, మెటా వంటి దిగ్గజ సంస్థల ఉద్యోగులే కావడం గమనార్హం. అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఈ సంఖ్య 73 శాతం అధికం కావడం ఆందోళనకరం.

2023లో అమెజాన్ 16 వేల మందికిపైగా.. అల్ఫాబెట్ (గూగుల్ మాతృసంస్థ) 12 వేల మందిని.. మైక్రోసాఫ్ట్ 11 వేల మందికి పైగా.. మెటా 10 వేలమందిని ఉద్యోగాల నుంచి తొలగించాయి. 2001అలో అమెరికా టెక్ కంపెనీలు అత్యధికంగా 1,68,395 మందిని ఉద్యోగాల నుంచి తొలగించాయి (వై2కే సమస్య పరిష్కారం కోసం అంతకు ముందు లెక్కకు మిక్కిలిగా చేర్చుకున్న వారందరినీ 2001లో తొలగించుకున్నాయి). మళ్లీ ఆ తర్వాత.. అంటే 22 సంవత్సరాల తర్వాత ఒకే ఏడాది 1.6 లక్షల మంది ఉద్యోగాలకు కోత పెట్టడం ఇదే. అలాగే అమెరికా రిటైల్ రంగంలో గత ఏడాది 78,840 మంది ఉద్యోగాలు కోల్పోయారు. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే.. ఇది 274 శాతం అధికం. కృత్రిమ మేధ ప్రభావం నానాటికీ పెరుగుతున్నందున టెక్నాలజీ రంగంలో గణనీయమైన మార్పులు చోటు చేసుకుంటాయని.. ఫలితంగా పలు కంపెనీలు తమ వనరులను పునర్వ్యవస్థీకరించుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడి, ఉద్యోగాలు పోతాయని చాలెంజర్ గ్రే అండ్ క్రిస్మస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆండీ చాలెంజర్ అభిప్రాయపడ్డారు. ఉద్యోగాల కోతకు ఆర్థిక మాంద్యం, ద్రవ్యోల్బణం, వడ్డీరేట్ల పెంపు వంటి కారణాలే కాదు.. 2019-2022 నడుమ వేగంగా జరిగిన వృద్ధి నేపథ్యంలో పలు కంపెనీలు విస్తృతంగా నియామకాలు చేపట్టాయి. ఈ-కామర్స్ కంపెనీలు కొవిడ్ సమయంలో వినియోగదారుల డిమాండ్‌ను తట్టుకోవడానికి భారీగా ఉద్యోగులను నియమించుకున్నాయి. కానీ, 2022 ద్వితీయ త్రైమాసికం నుంచి మళ్లీ మునుపటి పరిస్థితులు ఏర్పడడంతో ఆర్థిక భారాన్ని తగ్గించుకోవడానికి ఉద్యోగులను తొలగిస్తున్నాయి.

ఇక్కడికొస్తే మరీ ఘోరం

ఉద్యోగ వీసాలతో అమెరికాకు వెళ్లి.. అక్కడ కొలువులు కోల్పోయి భారత్‌కు తిరిగి వస్తున్నవారి పరిస్థితి దారుణంగా ఉంటోంది. ఉదాహరణకు.. దీపక్ అనే వ్యక్తి ఇక్కడే ఆరేళ్లపాటు అమెజాన్‌లో ఉద్యోగం చేసి 2022 జూన్‌లో అంతర్గత బదిలీల్లో భాగంగా అమెరికాకు వెళ్లాడు. కంపెనీ అక్కడ అతడికి ఏడాదికి 1.6 లక్షల డాలర్ల వార్షిక వేతనం (మన కరెన్సీల్లో దాదాపు రూ.1.3 కోట్లు), షేర్లు కూడా ఇచ్చేది. కానీ, 2023 జనవరిలో అమెజాన్ చేపట్టిన భారీ కోతలో 18 వేల మంది ఉద్యోగాలు కోల్పోయారు. ఆ 18 వేల మందిలో దీపక్ కూడా ఒకరు. చేసేది లేక భారత్‌కు తిరిగి వచ్చేసిన అతడు.. రెండు నెలలపాటు ఉద్యోగం లేకుండా ఖాళీగా ఉండాల్సి వచ్చింది. ఎట్టకేలకు అతడు రూ.30 లక్షల వార్షిక వేతనానికే ఓ కంపెనీలో ఉద్యోగంలో చేరాడు. బ్లూమ్‌బెర్గ్ నివేదిక ప్రకారం.. 2022 నవంబరు నుంచి 2023 జనవరి నడుమ అమెరికాలో 2 లక్షల మంది ఉద్యోగులపై వేటు పడింది. అందులో 80 వేల మంది భారతీయ ఐటీ ఉద్యోగులే. కాగా, భారత్‌లో పరిస్థితి కూడా అంత బాగోలేదు. భారతదేశంలోని టెక్ కంపెనీలు 2022లో 30 వేల మంది, 2023లో 28 వేల మంది ఉద్యోగులను తొలగించాయి. 2021లో మనదేశంలోని టెక్ కంపెనీలు తొలగించిన ఉద్యోగుల సంఖ్య కేవలం 4,080 కావడం గమనార్హం.

# రేవంత్‌ను కలిసిన నలుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

సాగుతోంది. వీరిలో కొందరికి గతంలో కాంగ్రెసతో అనుబంధం ఉండడం ఇందుకు బలం చేకూర్చింది. అయితే, తాము మర్యాదపూర్వకంగానే కలిశామని, ఇందులో రాజకీయ పరమైన అంశాలేవీ లేవని వారు చెబుతున్నారు. నియోజకవర్గాల అభివృద్ధి, ఎమ్మెల్యేల సెక్యూరిటీ, ప్రొటోకాల్ సమస్యలు వంటి అంశాలపై చర్చించామని వివరణ ఇచ్చారు. వారు పార్టీ మారుతున్నారంటూ ఊహాగానాలు చెలరేగడంతో నలుగురూ వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. జిల్లాల్లో తమకు ఎదురవుతున్న ప్రొటోకాల్ సమస్యను వివరించేందుకే సీఎం రేవంత్‌రెడ్డిని కలిశామని, ఇందులో రాజకీయ ప్రాధాన్యం ఏమీ లేదని పేర్కొన్నారు. ఇదే విషయమై ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్‌రెడ్డికి కూడా వినతి పత్రం ఇచ్చామన్నారు. ఈ అంశంపై అనవసర ఊహాగానాలు సృష్టించొద్దని కోరారు. ప్రధాని మోదీని సీఎం రేవంత్ రెడ్డి ఎలా కలిశారో.. తామూ అలాగే ఆయనను కలిశామని పేర్కొన్నారు. అయినా, ప్రస్తుత రాజకీయ పరిణామాల్లో వారు ముఖ్యమంత్రిని కలవడంతో పార్టీ మార్పు ఊహాగానాలు కొనసాగుతున్నాయి.

కేసీఆర్‌ను అడిగే వెళ్లారా..?
నలుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌ను కలిసే ముందు.. పార్టీ అధినేత కేసీఆర్‌ను గానీ.. ముఖ్య నాయకులను అడిగారా? అనుమతి తీసుకోకుండానే వెళ్లి ఉంటారా..? అన్న దానిపై అటు కాంగ్రెస్, ఇటు బీఆర్ఎస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ పార్టీ ఎమ్మెల్యేలు సీఎంను కలవడం పార్టీకి ఇబ్బంది కలిగించే అంశమని బీఆర్ఎస్ నాయకులు అభిప్రాయపడుతున్నారు. గత ప్రభుత్వం చేసిన అవినీతిపై కాంగ్రెస్ సర్కారు కఠినంగా వ్యవహరించనుందనే ఉద్దేశంతో ముందుగానే ఆ పార్టీ టచ్‌లోకి వెళ్లేందుకు బీఆర్ఎస్ నాయకులు ప్రయత్నిస్తున్నారా? అని రాజకీయ వర్గాలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి.

కాంగ్రెస్‌లోకి పట్నం..?
బీఆర్ఎసకు చెందిన మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారంటూ రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ మేరకు ఆయన టచ్‌లో ఉన్నారని, పార్టీలో చేరగానే ఆయనకు చేవెళ్ల ఎంపీ టికెట్ కట్టబెట్టే అవకాశం ఉందని చర్చ జరుగుతోంది. నిజానికి, అసెంబ్లీ ఎన్నికలకు ముందే మహేందర్ రెడ్డి కాంగ్రెసలో చేరతారని తెలుసుకొని పార్టీ అధిష్ఠానం పిలిపించుకొని ఆయనకు మంత్రి పదవి కట్టబెట్టింది. ఇప్పుడు అధికారం కోల్పోయిన నేపథ్యంలో మళ్లీ కాంగ్రెస్ వైపు దృష్టి సారించారని సొంత పార్టీ నేతలే అభిప్రాయపడుతున్నారు.

# 5 వేల కోట్ల పెట్టుబడులు!

**హైదరాబాద్, జనవరి 23 (అక్షరం న్యూస్):**
దక్షిణ కొరియాకు చెందిన ప్రఖ్యాత కాస్మెటిక్ తయారీ సంస్థ దూసన్ హైదరాబాద్‌లో రూ.5 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమైంది. దేశంలోనే తొలి కాస్మెటిక్ తయారీ హబ్‌ను ఏర్పాటు చేస్తామని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. దూసన్ కంపెనీ ప్రతినిధి మూన్ కీ జూ నేతృత్వంలోని బృందం మంగళవారం రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో సచివాలయంలో సమావేశమైంది. తమ సంస్థ పెట్టుబడుల గురించి ప్రభుత్వానికి డీపీఆర్ అందించారు. తాము కల్పించే ఉద్యోగాలు, పెట్టుబడుల ద్వారా స్థానికులకు కలిగే ప్రయోజనాల గురించి మంత్రికి వివరించారు. తమ సంస్థ చైనా, వియత్నాం, కాంబోడియా తదితర దేశాల్లో 460 మిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టిందని, తమ ఉత్పత్తులు ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. హైదరాబాద్‌లో నెలకొల్పబోయే కాస్మెటిక్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్ భారతదేశంలోనే మొదటిదని మంత్రికి చెప్పారు. తమ సంస్థ ఏర్పాటుకు కావాల్సిన అనుమతులు, భూమి, రాయితీల గురించి దూసన్ ప్రతినిధులు మంత్రితో చర్చలు జరిపారు.

రైతుల నుంచి ఉత్పత్తుల కొనుగోలు..

ఈ పెట్టుబడుల ద్వారా తెలంగాణకు వచ్చే ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాల గురించి మంత్రి కోమటిరెడ్డి.. దూసన్ ప్రతినిధులను ఆరా తీశారు. కంపెనీ ప్రతినిధి మూన్ కీ జూ మాట్లాడుతూ.. తమ సంస్థ హైదరాబాద్‌లో ఏర్పాటు చేయబోయే కాస్మెటిక్ హబ్ ద్వారా దాదాపు రూ.5 వేల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రత్యక్షంగా దాదాపు 3 వేల మందికి, పరోక్షంగా మరో 4 వేల మందికి ఉపాధి కల్పిస్తామని చెప్పారు. సుగంధ ద్రవ్యాలు, ఔషధ మొక్కలను ఉత్పత్తి చేసే రైతుల నుంచే నేరుగా కొనుగోళ్లు చేస్తామని తద్వారా వారికి మరింత లబ్ధి చేకూరుతుందని మంత్రికి తెలిపారు. ఇక్కడ ఉత్పత్తి చేసిన వాటిని స్థానికంగా విక్రయించడంతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఎగుమతులూ చేస్తామని వివరించారు.

కంపెనీకి పూర్తి సహకారం..

సులభతర వాణిజ్య విధానాల్లో తెలంగాణ దేశంలోనే నంబర్ 1గా ఉందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. పరిశ్రమలకు సింగిల్ విండో విధానంలో అనుమతులు మంజూరు చేస్తున్నామన్నారు. ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టాయని గుర్తుచేశారు. హైదరాబాద్‌లోని పారిశ్రామిక వాతావరణం, ఇండస్ట్రియల్ పాలసీ.. ఇతర దేశాలు, వ్యాపార సంస్థలకు స్వర్గధామంగా ఉన్నాయని దూసన్ ప్రతినిధులకు వివరించారు. కంపెనీకి కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో సమావేశం ఏర్పాటు చేసి కంపెనీ ఏర్పాటుకు కావాల్సిన అనుమతులు సత్వరమే ఇస్తామని మంత్రి కోమటిరెడ్డి హామీ ఇచ్చారు.

ఫిబ్రవరి నుంచే ఉచిత విద్యుత్

గృహజ్యోతి పథకం కింద ఇచ్చిన 200 యూనిట్ల ఉచిత విద్యుత్ హామీని ఫిబ్రవరి నుంచి అమలు చేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడించారు. కేసీఆర్ నిర్వాకం వల్ల రాష్ట్రం అప్పుల పాలైందని, అందుకే ఆరు గ్యారంటీల్లోని కొన్ని హామీల అమలులో జాప్యం ఏర్పడిందన్నారు. ఈ మేరకు గాంధీభవన్ ఆవరణలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆరు గ్యారంటీల్లో భాగంగా ఇచ్చిన హామీలన్నింటినీ వంద రోజుల్లో అమలు చేసి తీరుతామని స్పష్టం చేశారు. నిరుద్యోగ భృతి, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు సహా ఇచ్చిన ఏ హామీని బీఆర్ఎస్ అమలు చేయలేదని ఈ సందర్భంగా గుర్తు చేశారు. బీఆర్ఎస్ నేతల్లా తాము ప్రజలను నాడు రెచ్చగొట్టి ఉంటే కేసీఆర్ ఫామ్‌హౌస్ దాటలేకపోయేవారని అన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు చివరకు సర్పంచ్‌లను కొనుగోలు చేసే దరిద్రపు అలవాటు బీఆర్ఎసకు ఉందని తెలిపారు. తాము అదే విధానాన్ని పాటిస్తే బీఆర్ఎసలో కేటీఆర్, హరీశ్‌రావు తప్ప ఎవరూ మిగలరని పేర్కొన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఒక్క సీటూ రాదని తేల్చిచెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెసకు పార్టీకి 13 నుంచి 14 సీట్లు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. మాజీ మంత్రి జైలుకు పోవడం ఖాయమని పునరుద్ఘాటించారు. కాళేశ్వరంతో పాటు అన్ని అక్రమాలపైనా విచారణ కొనసాగుతుందని తెలిపారు.

# తొలిరోజే 5లక్షల మంది!

ప్రధాన మార్గమైన 13 కిలోమీటర్ల రామ్ పథ్‌లో యాత్రికులు పోటెత్తారు. ఉదయం 6గంటలకు ఆలయ సముదాయంలోకి భక్తుల ప్రవేశం మొదలైందని, మధ్యాహ్నం 2గంటల వరకూ 2.5లక్షల నుంచి 3 లక్షల మంది స్వామివారిని దర్శించి ఉంటారని అయోధ్య డివిజనల్ కమిషనర్ గౌరవ్ దయాళ్ ప్రకటించారు. క్యూలు, బ్యారికేడ్లు ఏర్పాటు చేసి భక్తులను క్రమబద్ధీకరించడానికి యంత్రాంగం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. రాత్రి ఆలయం మూసివేసే సమయానికి దాదాపు 5లక్షల మంది భక్తులు స్వామివారిని దర్శించుకొంటారని అంచనా వేస్తున్నట్లు మరో అధికారి వెల్లడించారు. రాముడి దర్శనం కోసం భక్తులు భారీగా తరలి రావడంతో వారిని అదుపుచేసేందుకు భద్రతా సిబ్బంది నానా తంటాలు పడ్డారు. ఆలయం వద్ద 8వేల మందికి పైగా పోలీసులను మోహరించామని, పరిస్థితి అదుపులోనే ఉందని యూపీ ఇన్ఫర్మేషన్ డైరెక్టర్ శిశిర్ పేర్కొన్నారు. భారీ రద్దీ కారణంగా ఆలయాన్ని తాత్కాలికంగా మూసివేసినట్లు వచ్చిన వదంతులను అయోధ్య పోలీసులు ఖండించారు. కాగా, రామమందిరంలో ఏర్పాట్లను యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ మంగళవారం పరిశీలించారు. . కాగా, బాల రాముడిని దర్శించుకోవడానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలిరావడంపై ట్రస్టు ప్రధాన పూజారి సత్యేంద్ర దాస్ హర్షం వ్యక్తం చేశారు. ఎక్కడ చూసినా 'జై శ్రీరాం' నినాదాలు ప్రతిధ్వనిస్తున్నాయని, మనమంతా త్రేతాయుగం నాటి అయోధ్యలో ఉన్నట్లుగా అనిపిస్తోందని పేర్కొన్నారు. వనవాసం తర్వాత రాముడు తిరిగి వచ్చినప్పటి దృశ్యాలు మళ్లీ ఇప్పుడు కనిపిస్తున్నాయన్నారు.

బాల రాముడు ఇకపై'బాలక్ రామ్'

అయోధ్యలో నిర్మితమైన దివ్య, భవ్య రామమందిరంలో ప్రతిష్ఠించిన నూతన రామ్‌లల్లా విగ్రహానికి 'బాలక్ రామ్'గా నామకరణం చేశారు. ఈ విగ్రహంలో రాముడు ఐదేళ్ల బాలుడిని పోలి ఉండటమే దీనికి కారణమని ఆలయ పూజారి అరుణ్ దీక్షిత్ తెలిపారు. మొదటిసారి విగ్రహాన్ని చూసినప్పుడు తానెంతో ఉద్వేగానికి గురయ్యాయని, తన ముఖమంతా కన్నీటితో తడిసిపోయిందన్నారు. ఇప్పటివరకూ దాదాపు 50-60 విగ్రహాలకు ప్రాణప్రతిష్ఠలు నిర్వహించానని, వాటన్నింటిలోకీ ఇదే తనకు అత్యంత అలౌకిక ఆనందాన్ని కలిగించిందని చెప్పారు. కాగా, రామాయణం, రామచరిత్ మానస్ లాంటి గ్రంథాలను విస్తృతంగా అధ్యయనం చేసిన తర్వాతే బాల రాముడి విగ్రహానికి ఆభరణాలను సిద్ధం చేసినట్లు శ్రీరామ జన్మభూమి ట్రస్ట్ పేర్కొంది.

అయోధ్య రామయ్యకు కంచి కామకోటి పీఠం ఆభరణాలు

హైదరాబాద్, జనవరి 23: అయోధ్యలో కొలువుదీరిన శ్రీరాముడికి కంచి కామకోటీ పీఠం నుంచి ప్రత్యేక ఆభరణాలు అందాయి. కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి ఈ ఆభరణాలను స్వయంగా స్వామివారికి సమర్పించారు. విజయేంద్ర సరస్వతికి ఆదివారం రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు పూర్ణ కుంభంతో స్వాగతించారు. అనంతరం ఆలయాన్ని సందర్శించిన విజయేంద్ర సరస్వతి ప్రాణ ప్రతిష్ఠకు సంబంధించిన క్రతువులను పరిశీలించి పలు సూచనలు చేశారు.

# రాహుల్‌పై కేసు

గువాహటి, జనవరి 23: కాంగ్రెస్ యువరాజు రాహుల్ గాంధీపై అసోం పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. భారత్ జోడో న్యాయ యాత్ర పేరిట రాహుల్ నిర్వహిస్తున్న పాదయాత్రను మంగళవారం ఉదయం వారు అడ్డుకున్నారు. రాజధాని గువాహటి నగరంలోకి ఆయన పాదయాత్ర ప్రవేశించకుండా పోలీసులు బారికేడ్లు అడ్డం పెట్టగా.. కాంగ్రెస్ శ్రేణులు వాటిని ఛేదించుకుని నగరంలోని ప్రధాన రహదారిపైకి అడుగుపెట్టాయి. ఈ నేపథ్యంలో.. ప్రభుత్వం ఏర్పాటు చేసిన బారికేడ్లను తొలగించాలంటూ ప్రజలను రెచ్చగొట్టిన రాహుల్ గాంధీపై కేసు నమోదు చేయాలని అసోం సీఎం హిమంత విశ్వశర్మ ఆ రాష్ట్ర డీజీపీని ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు ఆ రాష్ట్ర పోలీసులు రాహుల్ గాంధీపైన, ఆయనతోపాటు ఉన్న కాంగ్రెస్ నేతలు కేసీ వేణుగోపాల్, కన్హయ్యకుమార్‌పైన.. హింసకు ప్రేరేపించడం, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం సహా పలు సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. బారికేడ్లను ఛేదించే క్రమంలో పోలీసు సిబ్బందితో జరిగిన ఘర్షణలో అసోం రాష్ట్ర కాంగ్రెస్ ప్రెసిడెంట్ భూపేంద్ర బోరాకు, అసోం అసెంబ్లీలో విపక్ష నేత దేవవ్రత సైకియాకు గాయాలయ్యాయి. అలాగే పలువురు పోలీసులకు గాయాలైనట్టు డీజీపీ డీజీ సింగ్ తెలిపారు. ఈ ఘర్షణకు ముందు.. మేఘాలయ నుంచి అసోంలోకి అడుగుపెట్టిన రాహుల్‌గాంధీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా అదే మార్గంలో ప్రయాణించడానికి అనుమతించిన హిమంత సర్కారు ఇప్పుడు కాంగ్రెసకు అనుమతి ఇవ్వడం లేదని మండిపడ్డారు. బారికేడ్లను విరగ్గొట్టిన కాంగ్రెస్ కార్యకర్తలను ఆయన సింహాలుగా అభివర్ణించారు. అయితే.. ఇలాంటి హింసాత్మక ప్రవర్తన అసోం సంస్కృతి కాదని.. తమది శాంతియుత రాష్ట్రమని హిమంత వ్యాఖ్యానించారు.

# రాష్ట్రంలో కొత్తగా 11 ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీలు..

**హైదరాబాద్, జనవరి 23 (అక్షరం న్యూస్):**
రాష్ట్రంలో కొత్తగా 11 ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీలు ఏర్పాటు కాబోతున్నాయి. దీంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇంజనీరింగ్ విద్య మరింత చేరువకానుంది. ఇప్పటి వరకు ఇంజనీరింగ్ విద్యను అందించే వాటిలో యూనివర్శిటీలు, అనుబంధ, ప్రైవేట్ విద్యాసంస్థలే ఉండేవి. ఇకపై కొత్తగా 11 ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీలు అందుబాటులోకి రానున్నాయి. పదకొండింటిలో ఇప్పటికే ఒక కాలేజీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయగా, మరో 10 ఇంజనీరింగ్ కాలేజీల ఏర్పాటు ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి.

దీనిపై ప్రభుత్వ త్వరలోనే నిర్ణయం తీసుకోనుంది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలను ఇంజనీరింగ్ కాలేజీలుగా అప్‌గ్రేడ్ చేస్తున్నారు. ఈమేరకు అధికారులు పంపిన ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి. ఇంజనీరింగ్ కాలేజీల ఏర్పాటు-తో ఇన్నాళ్లు ప్రభుత్వ పాలిటెక్నిక్‌ల నిర్వహణ బాధ్యతల్లో తలమునకలైన సాంకేతిక విద్యాశాఖ అధికారులు ఇక నుంచి ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీల నిర్వహణను పర్యవేక్షించాల్సి ఉంటుంది. అయితే ప్రతిపాదిత కాలేజీలన్నీ గతంలో సెకండ్‌షిఫ్ట్%అ% పాలిటెక్నిక్ కాలేజీలే కావడం గమనార్హం.

ఈ కాలేజీల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలూ పాలిటెక్నిక్ తరగతులు నిర్వహించే వారు. అడ్మిషన్లు కూడా వేర్వేరుగా ఉండేవి. అయితే ఈ కాలేజీల్లో రెండోషిఫ్ట్‌ను రద్దుచేసి, ఈ కాలేజీలను రోజంతా నిర్వహిస్తున్నారు. దీంతో ఆయా కాలేజీల్లో ఇన్‌టెక్ అలాగే ఉండగా, ఫ్యాకల్టీ ఆయా కాలేజీల్లోనే పనిచేస్తున్నారు. ఈ కాలేజీల్లో అదునాతన ల్యాబ్‌లున్నాయి. పీహెచ్‌డీ అర్హత గల ఫ్యాకల్టీ పనిచేస్తున్నారు.

ఇవి పూర్తి స్థాయిలో అందుబాటులోకి రావాలంటే కేవలం ఒక్క ఇంజనీరింగ్ కాలేజీకి సరిపోయే భవనాలను కట్టాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలోనే ఇంజనీరింగ్ కాలేజీలుగా అప్‌గ్రేడ్‌చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. వీటిల్లో పాలిటెక్నిక్ కోర్సులతో పాటు, ఇంజనీరింగ్ కోర్సులను నిర్వహిస్తారు. కొత్తగా ఏర్పాటయ్యే ఇంజనీరింగ్ కాలేజీల్లో 4 హైదరాబాద్‌లో, 7 మిగతా జిల్లాల్లో అందుబాటులోకి రానున్నాయి.

కూలికుతుబ్‌షా ప్రభుత్వ పాలిటెక్నిక్ చందులాల్ బరాదరి-హైదరాబాద్. గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ మారేడుపల్లి, ప్రభుత్వ పాలిటెక్నిక్ మాసాబ్‌ట్యాంక్, గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీ గచ్చిబౌలి, ప్రభుత్వ పాలిటెక్నిక్ మహబూబ్‌నగర్, ప్రభుత్వ పాలిటెక్నిక్ నల్గొండ, ప్రభుత్వ పాలిటెక్నిక్ వరంగల్, ప్రభుత్వ పాలిటెక్నిక్ నిజామాబాద్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కొత్తగూడెం, ఎస్‌జీ గవర్నమెంట్ పాలిటెక్నిక్ ఆదిలాబాద్‌లో ఏర్పాటు కానున్నాయి.

ఇక కోస్గిలో మహిళా ఇంజనీరింగ్ కాలేజీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కోడంగల్ నియోజకవర్గంలోని కోస్గికి ప్రభుత్వ మహిళా ఇంజనీరింగ్ కాలేజీ మంజూరయ్యింది. కోస్గిలో ప్రస్తుతం నడుస్తున్న ప్రభుత్వ పాలిటెక్నిక్‌ను ఇంజనీరింగ్ కాలేజీగా అప్‌గ్రేడ్‌చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇది రాష్ట్రంలోని తొలి మహిళా ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీగా ఏర్పాటైంది. 2024-25 విద్యాసంవత్సరం నుంచి ఈ కాలేజీలో అడ్మిషన్లను చేపట్టనుండగా, మిగతా కాలేజీలు వచ్చే విద్యాసంవత్సరం నుంచి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

కోస్గి కాలేజీలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ (ఏఐఎంఎల్), కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ (డేటాసైన్స్) కోర్సులను ప్రవేశపెట్టేందుకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం అనుమతినిస్తూ ఈమేరకు ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్రంలో కొత్తగా 11 ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీలు అందుబాటులోకి రానుండడంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇంజనీరింగ్, సాంకేతిక విద్య మరింత చేరువ కానుంది. ఇవి అందుబాటులోకి వస్తే ఇంజనీరింగ్ సీట్లు కూడా రాష్ట్రంలో భారీగా పెరగనున్నాయి.

# ఆదాయ మార్గాలను అన్వేషించండి

కొత్త బస్సుల కొనుగోళ్లకు రూ.వెయ్యి కోట్లు, ఉద్యోగుల బకాయిల చెల్లింపులకు రూ.1,500 కోట్లు అవసరమని విన్నవించినట్టు తెలిసింది. బీసీ గురుకులాలకు సొంత భవనాలను నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని పొన్నం కోరారు.

దేవాదాయ, అటవీ శాఖలపై సమీక్ష..
రాష్ట్రంలో ఆలయ పర్యాటక అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని భట్టి విక్రమార్క అధికారులకు సూచించారు. దేవాలయ భూముల్లో భక్తుల కోసం కాటేజీలు నిర్మించాలని చెప్పారు. దేవాదాయ, అటవీ పర్యావరణ శాఖల బడ్జెట్ ప్రతిపాదనలపై మంగళవారం సచివాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడారు. ప్రముఖ దేవాలయాలు, ప్రార్థనాలయాలు ఉన్న రాష్ట్రంలో టెంపుల్ టూరిజం అభివృద్ధికి విస్తృత అవకాశాలున్నాయని పేర్కొన్నారు. అటవీ ప్రాంతాల్లో సఫారీ, ఎకో టూరిజానికి ఆదరణ ఉందని, ఇలాంటి పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. దేవాదాయ, అటవీ శాఖలకు ఈ బడ్జెట్‌లో నిధులను ఎక్కువగా కేటాయించాలని కొండా సురేఖ విజ్ఞప్తి చేశారు.
పొన్నం, జూపల్లికి సన్మానం..
ఆరాంఘర్‌లోని దుర్గా కన్వెన్షన్‌లో గౌడ సామాజిక వర్గం నుంచి ఎన్నికైన ఎమ్మెల్యేలను హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి గౌడ సంఘాల ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌లను సత్కరించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నేత వినోభాగౌడ్ తదితరులుపాల్గొన్నారు.

# త్వరలోనే నామినేటెడ్ పోస్టుల భర్తీ..!

వేం నరేందర్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖకు సలహాదారుగా మాజీ మంత్రి షబ్బీర్‌అలీ, ప్రొటోకాల్, పబ్లిక్ రిలేషన్ సలహాదారుగా హర్కర వేణుగోపాల్, ఢిల్లీలో ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా మాజీ ఎంపీ మల్లు రవికి సీఎం రేవంత్‌రెడ్డి అవకాశం కల్పించారు.

వీరిలో ఒక షబ్బీర్‌అలీ తప్పా మిగతా ముగ్గురు నాయకులు ఇటీవల జరిగిన అసెంబ్లి%ఎ% ఎన్నికల్లో పోటికి దూరంగా ఉన్నారు. ఇక ఎమ్మెల్యే కోటాలోని ఎమ్మెల్సీలుగా పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్‌కు అవకాశం ఇచ్చారు. ఈ ఇద్దరు నేతలకు కూడా పార్టీ అధిష్టానం టికెట్ ఇవ్వలేదు. అయినప్పటికి పార్టీ విజయం కోసం చాలా మంది నాయకులు పని చేశారు.

కాగా, అసెంబ్లి ఎన్నికల్లో టికెట్ కోసం ఒక్కో నియోజక వర్గం నుంచి పదుల సంఖ్యలో పోటీ పడ్డారు. నియోజక వర్గంలో ప్రజా బలం ఉన్న నాయకులను పార్టీ పెద్దలు బుజ్జగించి.. అధికారంలోకి వచ్చాక నామినేటెడ్ పదవులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. పార్టీ అనుబంధ సంఘాల నేతలు కూడా డజన్ మంది వరకు టికెట్ ఆశించినా.. ఒక మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలికి తప్ప.. మిగతా వారికి ఎవరికి కూడా టికెట్ ఇవ్వలేదు. నామినేటెడ్ పోస్టుల్లో పార్టీ అనుబంధ విభాగాలకు చెందిన కొందరికి అవకాశం వస్తుందని ప్రచారం జరుగుతోంది. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్‌కు ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వడంతో మిగతా నాయకుతు కూడా పదవులు వస్తాయనే ఆశతో ఎదురు చూస్తున్నారు.

# మేడిగడ్డపై ఎఫ్ఐఆర్

చూపుతూ మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టు ప్రతిష్ఠనే దెబ్బతీసేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్టు సమాచారం. కాళేశ్వరంపై విజిలెన్స్ తనిఖీల పేరుతో కొన్ని రోజులుగా హంగామా సృష్టించిన విషయం తెలిసిందే. ఈ విజిలెన్స్ నివేదికను త్వరలోనే ప్రభుత్వానికి అందించనున్నట్టు ఓ పోలీస్ ఉన్నతాధికారి తెలిపారు. నివేదిక ఆధారంగా త్వరలోనే మేడిగడ్డపై ఎఫ్ఐఆర్ నమోదు చేసే అవకాశం ఉన్నదని సదరు అధికారి వెల్లడించారు. అయితే నివేదిక ప్రభుత్వానికి అందకముందే తన అనుకూల మీడియాకు లీకులిస్తూ.. కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం డ్యామేజీ అయినట్టు ప్రచార మొదలుపెట్టింది. తద్వారా ప్రాజెక్టుపై, గత ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేక భావన కల్పించేందుకు ప్రయత్నిస్తున్నదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# ఘనంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి.



**కరీంనగర్/సైదాపూర్,జనవరి23(అక్షరం న్యూస్):**
నేతాజీ సుభాష్ చంద్రబోస్ 128వ జయంతి వేడుకలను మండల కేంద్రంలోని స్థానిక కొత్త బస్టాండ్ లో నేతాజీ అభిమానులు మొలుగూరి హరికృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సైదాపూర్ ఎస్ ఐ జన్ను ఆరోగ్యం సైదాపూర్ సర్పంచ్ ల ఫోరమ్ మండల అధ్యక్షులు కొండా గణేష్,వెన్కేపల్లి ఎంపిటిసి జంపాల సంతోష్,సైదాపూర్ ఎంపీటీసీ తొంట ఓదెలు,ఆరెపల్లి సర్పంచ్ ఆవునూరి పాపయ్య, ఎక్లాస్పూర్ సర్పంచ్ కొత్త రాజిరెడ్డి,నల్లరామయ్యపల్లి సర్పంచ్ మిడిదొడ్డి సరిత రమేష్,ఎలబోతారం సర్పంచ్ శిరీష ముకుంద రెడ్డి,సోమారం ఉపసర్పంచ్ అనగోని శ్రీనివాస్,సైదాపూర్ మాజీ సర్పంచ్ కూతురు విద్వాన్ రెడ్డి,తోంట రజినీకాంత్,కొత్త ప్రభాకర్ రెడ్డి,సోమారం మాజీ సర్పంచ్ కందుల సంపత్, పలువురు హాజరయి నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసారు.ఈ సందర్భంగా ఎస్ఐ జన్ను ఆరోగ్యం,హరికృష్ణ మాట్లాడుతూ దేశం కోసం ప్రాణ త్యాగానికి వెనుకాడకుండా భారత సైన్యాన్ని స్ఫూర్తి,ధైర్యం, ఇస్తూ,న్యాయం కోసం,దేశం కోసం,ఆరోగ్యం ను కూడా లెక్కచేయకుండా బ్రిటిష్ వారిని ఎదిరించిన మహా నేత అని ఒక పక్క గాంధీ ఇతర నేతలంతా శాంతితో స్వాతంత్ర్యం వస్తుందని నమ్మితే,నేతాజీ యుద్ధం చేసి స్వాతంత్రం తెచ్చుకోవాలని సైన్యాన్ని ఏకం చేసి మీరు నాకు రక్తాన్ని ఇవ్వండి నేను మీకు స్వేచ్ఛనిస్తానని పోరాటం చేసి
జననమే తప్ప మరణం లేని ఏకైక హీరో అని అన్నారు. అలాంటి మహనీయుని జయంతిని కేంద్రం,రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించకపోవడం చాలా బాధాకరమణి అన్నారు.వచ్చే జయంతి వరకైనా అధికారికంగా నిర్వహించి సెలవు దినంగా ప్రకటించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పొడిశెట్టి అరుణ్,సైదాపూర్,వెంకెపల్లి వార్డు సభ్యులు పోడిశెట్టి అజయ్,అనిల్,గడ్డం శేఖర్,కుమార్,గొల్లపల్లి యాదగిరి,గోపగాని నవీన్,మాడేపు రాహుల్,వేముల సాయి,శరత్,అశోక్,కిషోర్, నీర్ల సతీష్,కనకం అజయ్,సాయి,వేణు,భాస్కర్,తదితరులు పాల్గొన్నారు.

## బ్రిటీష్ పాలకుల గుండెల్లో నిద్రించిన నేతాజీ సుభాష్ చంద్రబోస్

-యువత దేశభక్తిని పెంచుకోవాలి
-ఏబివిపి పెద్దపల్లి జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్



**పెద్దపల్లి టౌన్ జనవరి 23 అక్షరం న్యూస్**
మరణం లేని మహావీరుడు భరత మాత ముద్దుబిడ్డ నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్ఫూర్తిగా దేశంకోసం యువత తెగించి పోరాడాలని అఖిల భారతీయ విధ్యార్థి పరిషత్ పెద్దపల్లి జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్ పిలుపునిచ్చారు నేతాజి 127వ జయంతిని పురస్కరించుకొని మంగళవారం ఏబివిపి పెద్దపల్లి నగర శాఖ ఆద్వర్యంలో పరాక్రమ దివస్ ఉత్సవాలు నిర్వహించారు ఈ సందర్భంగా నేతాజీ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు అనంతరం ఆయన మాట్లాడుతూ భారత స్వాత్రంత్ర్య ఉధ్యమంలో బ్రిటీష్ పాలకుల గుండెల్లో సింహం వలే నిద్రించారని తెలిపారు నాకు రక్తాన్నివ్వండి మీకు దేశాన్నిస్తాను అంటూ యువతలో స్వతంత్ర్య కాంక్షను రగిలించిన స్ఫూర్తిప్రధాతగా అభివర్ణించారు జైహింద్ నినాదంతో నరనరాన దేశభక్తిని నింపి అజాద్ హింద్ ఫౌజును స్తాపించిన నేతాజీ చరిత్రను ప్రతీ ఒక్కరు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు ఈకార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్ నగర కార్యదర్శి అజయ్ జోనల్ ఇన్చార్జ్ అరవింద్ నాయకులు సాయి తేజ శ్రీ దత్త గణేష్ మధుకర్ బన్నీ అభిరామ్ నరేష్ తదితరులు పాల్గొన్నారు

## బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షుడిని సన్మానించిన డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్.

**హనుమకొండ, పరకాల, జనవరి 23,అక్షరం న్యూస్.**
భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులుగా నియమితులైన గంట రవి కుమార్ మంగళవారం రోజు బాధ్యతలు స్వీకరణ కార్యక్రమంలో పాల్గొని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పరకాల ప్రముఖ వైద్యులు డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్. ఆయనతోపాటు పరకాల నియోజకవర్గ బిజెపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## సర్పంచులకే పర్సన్ ఇన్చార్జీలుగా అవకాశం కల్పించాలని వినతి



**కరీంనగర్/సైదాపూర్,జనవరి23(అక్షరం న్యూస్):**
ప్రస్తుత సర్పంచుల పదవి కాలం ముగుస్తున్నందున ఎన్నికల జరిగేంతవరకు ప్రస్తుత సర్పంచులకే పర్సన్ ఇన్చార్జిలుగా అవకాశం కల్పించాలని మండల సర్పంచులు సూపరిడెంట్ ,ఎంపీఓ లకు మంగళవారం వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ... తాము సర్పంచులుగా ఎన్నికైనప్పటికీ ఎనిమిది నెలలుగా చెక్ పవర్ కల్పించలేదని అలాగే రెండేళ్ల కరోనా కాలంలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్ట లేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు.సర్పంచులు గ్రామాల్లో నిధులు లేకున్నా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని వాటికి సంబంధించిన బిల్లులు రావాల్సి ఉందని పేర్కొన్నారు. గత రెండేళ్లుగా స్టేట్ ఫైనాన్స్, సెంట్రల్ ఫైనాన్స్ నిధులు రాక ఇబ్బందులు పడ్డామని అన్నారు.ఇన్ని రకాల ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రస్తుత సర్పంచులకే పర్సన్ ఇన్చార్జీలుగా అవకాశం కల్పిస్తే వారు చేసిన పనులకు నిధులు తీసుకొని అప్పుల ఊబి నుంచి బయట పడతారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచు ల ఫోరం అధ్యక్షులు కొండ గణేష్,సర్పంచులు కొత్త రాజిరెడ్డి,కాయిత రాములు,ఆవునూరు పాపయ్య,అబిడి పద్మా రవీందర్ రెడ్డి,మేకల శిరీష ముకుంద రెడ్డి,రేగుల సుమలత అశోక్,బత్తుల కొమరయ్య,బొడిగ పద్మజా కొమురయ్య తొంట రజనీకాంత్, కేతిరి విజయ నారాయణరెడ్డి,సరిత రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## విశ్వభారతిలో నేతాజీ జయంతి ఉత్సవాలు

**జ్యోతి నగర్ జనవరి 23 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్**
నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని నేషనల్ యూత్ ప్రాజెక్ట్ వారి ఆధ్వర్యంలో విశ్వభారత్ హై స్కూల్లో మంగళవారం జయంతి వేడుకలు జరిగాయి. గత వారం రోజులుగా వివేకానంద జయంతి నుండి ఈరోజు నేతాజీ జయంతి వరకు నేషనల్ యూత్ ప్రాజెక్టు రాష్ట్ర అధ్యక్షులు యాదవ రాజు ఆధ్వర్యంలో అన్ని ప్రాంతాల్లో యువజన కార్యక్రమాలు జరిగాయి, అందులో భాగంగా ఈరోజు విశ్వభారతి హై స్కూల్లో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ప్రముఖ లాయర్ అమరేందర్ రావు హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. నేటి యువత రేపు భావి భారత తరానికి ఉపయోగపడాలి అని చదువుతోపాటు విజ్ఞానం, సంస్కారం నేర్చుకోవాలని సందేశం ఇచ్చారు. యాదవ రాజు మాట్లాడుతూ కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు యువజన ప్రాజెక్టు తరఫున పర్యటించి నట్లు తెలిపారు జాతీయ భావాన్ని జాతీయ స్ఫూర్తిని నేటి యువతలో నింపాలని విద్యార్థులకు బోధించారు. జాతీయ భావం గురించి సరైన సమాధానం చెప్పిన వారికి స్వామి వివేకానంద బుక్స్ ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి విశ్వభారతి విద్యాసంస్థల చైర్మన్ బందారపు యాదగిరిగౌడ్ అధ్యక్షత వహించగా ప్రిన్సిపల్ ప్రవీణ్ కుమార్ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు



## గని ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలించిన గుర్తింపు సంఘం నాయకులు,అధికారులు

భవిష్యత్తులో ప్రమాదాలు జరుగకుండా తగు రక్షణ చర్యలు తీసుకోవాలి.





**గోదావరిఖని ప్రతినిధి/పెద్దపల్లి/జనవరి 23/అక్షరం న్యూస్:**
సింగరేణి ఆర్జీ వన్ ఏరియాలోని జిడికే 2ఏ.ఇంక్లయిన్ లో సోమవారం మొదటి షిఫ్ట్ లో జరిగిన గని ప్రమాదం లో మైనింగ్ సర్దార్ మందల సమ్మిరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు.దీనపై మంగళవారం సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటీయుసి నాయకులు ఆరెల్లి పోషం,ఎస్ వెంకట్ రెడ్డి,పర్లపెల్లి రామస్వామి,పి.నాగేందర్,మైనింగ్ ఇన్స్పెక్టర్ వెంకన్న,గని అధికారులతో కలిసి గని లోకి దిగి ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలించారు.సరైన రక్షణ చేపట్టక పోవడం వల్ల ఈ ప్రమాదం జరిగిందని వారు గుర్తించారు.ఈ సందర్భంగా గుర్తింపు సంఘం ఏఐటీయుసి బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం మాట్లాడుతూ భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరుగకుండా యాజమాన్యం సరైన రక్షణ చర్యలు చేపట్టి కార్మికుల ప్రాణాలు కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు.

## విద్యతో పాటు క్రీడారంగంలో విద్యార్థులు ప్రతిభను చాటాలి

ఆకునూరు ఉన్నత పాఠశాలలో క్రీడా పోటీలు.



**కరీంనగర్/సైదాపూర్,జనవరి23(అక్షరం న్యూస్):**
మండలంలోని ఆకునూరు గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆకునూర్ ఉన్నత పాఠశాలలో మంగళవారం క్రీడా పోటీలు నిర్వహించారు.వాలీబాల్ బాలుర బాలికల విభాగం ఆటలు పూర్తయ్యాయి బాల బాలికలకు ఖో ఖో పోటీలు నిర్వహించారు.ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు శాంత కుమార్ సింగ్ మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని అన్నారు. విద్యార్థిని విద్యార్థులు విద్యతో పాటు క్రీడారంగంలో కూడా ముందంజలో ఉండాలనీ క్రీడల పట్ల విద్యార్థినీ విద్యార్థులు చురుగ్గా ఆడడం జరుగుతుందని గెలుపొందిన వారికి ప్రధమ ద్వితీయ తృతీయ బహుమతులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు శాంత కుమార్ సింగ్,ఉపాధ్యాయులు హన్మండ్ల భాస్కర్,బైరి సుధాకర్,గూడూరి రవీందర్ రెడ్డి,గోదారి సమ్మయ్య,కోట సమ్మయ్యభక్తు రాజకుమార్, పోగుల విజయకుమార్, అంబిక చిగుర్లరామలక్ష్మి,భక్తు కృష్ణవేణితదితరులు పాల్గొన్నా

## ఘనంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి

**- భారత స్వాతంత్ర్య సమరంలోనేతాజీ అద్వితీయపాత్ర పోషించారు...**
**-ప్రధానోపాధ్యాయులు బట్టు మధు**

**సూర్యాపేట/ నేరేడుచర్ల/జనవరి 23(అక్షరం న్యూస్):-**
జాతీయ పరాక్రమ దినోత్సవం నేతాజీ సుభాష్ చంద్రబోస్ 127వ జన్మదినోత్సవాన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నేరేడుచర్లలో మంగళ వారం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థులు నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయులు బట్టు మధు విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ మహోజ్వల భారత స్వాతంత్ర్య సమరంలోనేతాజీ అద్వితీయపాత్ర పోషించారని అని,"ఆజాద్ హింద్ ఫౌజ్"ద్వారా సైన్యాన్ని ఏర్పాటుచేసి నాటి బ్రిటిష్ ప్రభుత్వాన్ని గ డగడలాడించిన పరాక్రమవంతుడని కొనియాడారు కార్యక్రమంలో ఉపాధ్యాయని ఉపాధ్యాయులు వై నరస కుమారి పి పద్మావతి ఎం సైదులు కట్ట వెంకటేశ్వరావు చల్లా ప్రభాకర్ రెడ్డి నరసింహారావు మాధవి అన్నపూర్ణ భవాని స్రవంతి రవి కట్ట శ్రీనివాస్ రెడ్డి కృష్ణ ప్రసాద్ కల్పన నగేష్ లాల్ సాహెబ్ సరస్వతి పాల్గొన్నారు



## భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సంక్షేమ పథకాలను వివరించిన బిజెపి నేత ఎస్ కుమార్.





**గోదావరిఖని ప్రతినిధి/పెద్దపల్లి/జనవరి 23/అక్షరం న్యూస్:**
వికసిత భారత్ సంకల్ప యాత్రలో భాగంగా మంగళవారం గోదావరిఖని విట్టల్ నగర్ లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో భారత ప్రధాని నరేంద్రమోదీ చేస్తున్న సంక్షేమ పతకాలపై ప్రజలకు వివరించడం జరిగింది.ఈ కార్యక్రమనికి బీజేపీ దళిత మోర్చా జాతీయ కార్యదర్శి యస్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు వారు మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్రమోదీ పేద ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టారని మహిళల కోసం ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు ప్రతి ఒక్కరికి వైద్యం అందాలని 55 కోట్ల మందికి ఆయుష్మాన్ భవ పేరులో పేద ప్రజల కోసం ఐదు లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తున్నారని తెలిపారు.నాలుగు కోట్ల పక్క గృహాల నిర్మాణం దేశంలో 88 కోట్ల మందికి ఉచిత ఆహార ధాన్యాలు ఇస్తున్నారని తెలిపారు.రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అత్యధిక స్థానాలు గెలుస్తుందని నరేంద్రమోదీ సారథ్యంలో మూడవసారి బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందని పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో బీజేపీ పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడి రాజేష్,ఉపాధ్యక్షులు మాతంగి రేణుక,బీజేపీ విట్ఠల్ నగర్ మండల అధ్యక్షులు అడ్డురి రాజేష్ తోపాటు ఏ ఎన్ యం లు అర్పిలు బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

## ప్రకృతి విపత్తులు, అనుకోని ప్రమాదాలపై మాక్ డ్రిల్.

ప్రజల ప్రాణాలను కాపాడటంలో ఎన్డీఆర్ఎఫ్ సేవలు ఎంతో గొప్పవి.
హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్ జీ.








**హనుమకొండ, జనవరి 23, అక్షరం న్యూస్.**
హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ఆవరణలో జాతీయ విపత్తు స్పందన దళం ( నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) హైదరాబాద్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం మాక్ డ్రిల్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా రేడియేషన్ ప్రమాదాలు సంభవించినప్పుడు ఎన్ డి ఆర్ ఎఫ్ బృందం ఏ విధంగా రక్షిస్తారనే వివరాలను ఎన్డీఆర్ఎఫ్ ఇన్స్పెక్టర్ గౌతమ్ కుమార్ వివరించారు. రేడియేషన్ ప్రమాదం సంభవించిన ప్రాంతంలో వ్యాప్తిని అరికట్టేందుకు ఎన్టీఆర్ఎఫ్ బృందం ప్రత్యేకమైన దుస్తులు, మాస్కులు ధరించి రక్షణ చర్యలు చేపడతారనే విషయాలను ప్రత్యక్షంగా ఎన్టీఆర్ఎఫ్ బృందం మాక్ డ్రిల్ ద్వారా వివరించారు. రేడియేషన్ ప్రమాదం సంభవించిన ప్రాంతంలో బాధితులను అంబులెన్స్ ద్వారా ఏ విధంగా తరలిస్తారో ప్రత్యేకంగా ప్రదర్శన చేశారు. ఫైరింజన్ ద్వారా ప్రమాద ప్రాంతంలో ఏ విధమైన చర్యలు చేపడతారనే విషయాన్ని డెమో ద్వారా తెలియజేశారు. అనంతరం హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్ జీ మాట్లాడుతూ విపత్తుల సంభవించిన ప్రాంతంలో తక్కువ సమయంలో విపత్కర పరిస్థితులను అదుపులోకి తెచ్చేందుకు, ప్రజల ప్రాణాలను కాపాడటంలో ఎన్డీఆర్ఎఫ్ బృందం సేవలు ఉన్నతమైనవని అన్నారు. భూకంపాలు, తుఫానులు, ఇతర విపత్తులు సంభవించినప్పుడు ఎన్డీఆర్ఎఫ్ బృందం ఏ విధంగా స్పందిస్తుందనే విషయాన్ని కళ్లకు కట్టినట్లు చూపించారని అన్నారు. ఈ సందర్భంగా ఎన్డిఆర్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ దామోదర్ సింగ్ మాట్లాడుతూ కెమికల్ రేడియేషన్ ప్రమాదాలు సంభవించినప్పుడు ఎన్డీఆర్ఎఫ్ బృందం ఏ విధంగా రక్షణ చర్యలు చేపడుతుందనే విషయాన్ని మాక్ డ్రిల్ ద్వారా వివరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ వై.వి గణేష్, డి ఎం హెచ్ ఓ డాక్టర్ సాంబశివరావు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఎం.భగవాన్ రెడ్డి, సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి కె. జయపాల్ రెడ్డి, ఫైర్ ఆఫీసర్ ఎ. నాగరాజు, మెడికల్ సిబ్బంది, పాల్గొన్నారు.

## యువతకు స్ఫూర్తి సుభాష్ చంద్రబోస్

మానుకోట సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్

**మహబూబాబాద్ బ్యూరో అక్షరం న్యూస్ జనవరి 23.**
యువతకు స్ఫూర్తి సుభాష్ చంద్రబోస్ అని మానుకోట సబ్ రిజిస్ట్రార్ తస్లిమ అహ్మద్ అన్నారు. మంగళవారం మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ 127 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ రిజిస్ట్రార్ మాట్లాడుతూ జయంతే తప్ప వర్ధంతి లేని ఏకైక



నాయకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అన్నారు. భారతదేశ స్వాతంత్ర్యం కోసం అలుపెరుగని పోరాటంతో మాతృ భూమి సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు,ప్రతి ఒక్కరికీ జనన మరణాలు ఉంటాయి, కానీ జయంతే తప్ప వర్ధంతి లేని ఏకైక నాయకుడు సుభాష్ చంద్రబోస్ అని, భారతదేశాన్ని బంధీలుగా ఉంచే శక్తి ఈ భూమి మీద లేదని, నాకు రక్తాన్ని ఇవ్వండి నేను దేశానికి స్వాతంత్ర్యం తెస్తానాన్న సుభాష్ చంద్రబోస్ మాటలను యువత ఆదర్శంగా తీసుకోవాలని తస్లీమా అన్నారు,నేతాజీ స్థాపించిన భారత సైన్యంతో విముక్తి పొంది మనమందరం స్వేచ్ఛగా ఉండగలుగుతున్నామని, ఆయన నేటిసమాజానికి మార్గదర్శకమని అన్నారు,ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, యువకులు, రిజిస్ట్రేషన్ దారులు తదితరులు ఉన్నారు.

# జననం తప్ప మరణం లేని మహా యోధుడు.. నేతాజీ సుభాష్ చంద్రబోస్

**సూర్యాపేట/ నేరేడుచర్ల /జనవరి 23(అక్షరం న్యూస్):-**

జననం తప్ప మరణం లేని మహా యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు అన్నారుమంగళవారం నాడు నేరేడుచర్లలో జరిగిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి కార్యక్రమానికి హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ...బ్రిటిష్ సామ్రాజ్యవాదుల గుండెల్లో దడ పుట్టించిన వీర యోధుడని, రెండుసార్లు భారత జాతీయ కాంగ్రెస్ పార్టీకి అధ్యక్షుడిగా ఎన్నికైనప్పటికీ గాంధీజీతో వచ్చిన సిద్ధాంతా విభేదాలతో రాజీనామా చేసి, సాయుధ పోరాటం ద్వారా మాత్రమే బ్రిటిష్ వాళ్ళని ఈ దేశంలోకి వెళ్ళగొట్టాలని అజాద్ హింద్ పౌజ్ నిర్మించి, ప్రపంచ దేశాలను చుట్టిబుట్టి సైన్యాన్ని నిర్మించుకొని బ్రిటిష్ వారిపై యుద్ధాన్ని ప్రకటించి అనుమానాస్పద స్థితిలో తైవాన్ లో విమాన ప్రమాదంలో మరణించిన అసమాన ధీశాలి, అని ఆయన గుర్తు చేశారు.

బ్రిటిష్ ప్రభుత్వ వ్యతిరేక పోరాట%శీ% లో జలాంతర్గావి ద్వారా సింగపూర్ చేరుకొని భారత ప్రజలను తమతో చేరమని పిలుపునిచ్చిన సాయుధ పోరాట వీరుడు అని అజాద్ హింద స్థాపించి ప్రజలను ఏకం చేసి భారతదేశాన్ని దాస్య శృంఖలాల నుండి విముక్తి చేయడానికి అవిశ్రాంతంగా పోరాడిన అలుపెరుగని కిరణమని, తాను దేశ స్వాతంత్రంలో పాల్గొని ఎందరో యువకులకు ఆదర్శంగా నిలిచాడని, ఆనాడు వారు చేసిన త్యాగాల వల్లనే దేశానికి స్వాతంత్రం సిద్ధించిందని, కానీ నేడు ఆ స్వాతంత్ర ఫలాలను పేదల దరిచేర కుండా అంబానీ అథాని లాంటి కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను అప్పనంగా కట్టబెడుతూ... దేశ ప్రజల దృష్టి మరలచేందుకు ప్రజల మధ్య మత వైశమ్యాలు రెచ్చగొడుతూ అధికారాన్ని అనుభవిస్తున్నారని ఆయన



దుయ్యబట్టారు.చైతన్యవంతమైన యువకులు పాలకుల దుర్నీతిని ఎండ కట్టాలని నాటి సమరయోధుల త్యాగాలను గుర్తుకు చేసుకొని వారి ఆశయ సాధనకై ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు

కార్యక్రమంలో మండల సిపిఐ కార్యదర్శి యల్లబోయిన సింహాద్రి, పట్టణ సిపిఐ కార్యదర్శి కత్తి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రావుల సత్యం, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలక రాజు శ్రీను మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ లక్ష్మి మహిళా సమైక్య నాయకురాలు నూతన గంటి నరసమ్మ పాల్గొన్నారు

# అయోధ్య రాముని దర్శించుకోవడం మా జన్మ సుకృతమైంది..

**అయోధ్యపురిలో నంబూరు కుటుంబ సభ్యులు..**

**రామమందిర నిర్మాణ రూపకర్తకు శ్రీ శ్రీరామాభద్రాచార్యులకు రామానుజ విగ్రహం బహుకరణ..**



**ఖమ్మం/ వైరా జనవరి 23 (అక్షరంన్యూస్)**



ప్రపంచంలోనే ప్రఖ్యాతగాంచిన అయోధ్యపూరి రాముని ప్రాణ ప్రతిష్టకు హాజరై ఆ స్వామివారిని దర్శించుకోవడంతో మా జన్మ సుకృతమైనదని నంబూరు కుటుంబ సభ్యులు తెలిపారు. గత వారం రోజులు నుండి అయోధ్య రాముని ప్రాణ ప్రతిష్టకు వైరా నుండి నంబూరు కుటుంబ సభ్యులు కుటుంబసమేతంగా బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా మార్గమధ్యలో ఉన్న పలు ప్రముఖ దేవాలయాలను సైతం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అయోధ్యపురికి చేరుకొని అక్కడ అంకురార్పరమైన అయోధ్య రామునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అయోధ్య శ్రీరాముని జన్మభూమి అని, ప్రపంచంలో న్యాయస్థానానికి సాక్ష్యాలను చూపించి రామయ్యకు రామమందిరం నిర్మించుకోవడానికి ముఖ్యకారకు డైన రూపకర్త శ్రీ శ్రీ రామభద్ర చార్యుల వారిని దర్శించుకుని, ప్రపంచానికి వైష్ణవ సాంప్రదాయానికి ఆది గురువైన ఆయనకు శ్రీశ్రీ రామానుజస్వామి విగ్రహాన్ని అందించారు. ఇంతటి మహోన్నతవరం కలగటంతో తమ జన్మ ధన్యమైందన్నారు. దేశవ్యాప్తంగా అయోధ్య రాముని దర్శించుకునేందుకు కోట్లాదిగా భక్తులు వచ్చారని, తమకు ఇంతటి ధన్యత దక్కటం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నంబూరు కుటుంబ సభ్యులు నంబూరు రామలింగేశ్వరరావు, నంబూరు శ్రీనివాసరావు, నంబూరు వెంకటేశ్వరరావు, నంబూరు ఓంకార్ కార్తీక్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలి

**మద్యం సేవించి వాహనాలు నడపవద్దు..**

**ఖమ్మం రవాణా శాఖ అధికారి ఎండి గౌష్ పాషా**

**ఖమ్మం/ తల్లాడ జనవరి 23 (అక్షరంన్యూస్)**

ద్వీచక్ర వాహనదారులు, కారు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని ఖమ్మం రవాణా శాఖ అధికారి ఎండి గౌస్ పాషా పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రయాణాలు చేసేటప్పుడు కచ్చితంగా జాగ్రత్తలను పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనాలపై వెళ్లేటప్పుడు డ్రైవర్ తో పాటు వెనుక కూర్చున్న వ్యక్తికి కూడా హెల్మెట్ ఎంతో అవసరమన్నారు. కారులో వెళ్లేటప్పుడు తప్పకుండా సీటు బెల్టును వాడాలన్నారు. ముఖ్యంగా మద్యం సేవించినప్పుడు ఏమాత్రం కూడా వాహనాల జోలికి వెళ్ళకూడదన్నారు. మద్యం మానవుల్లోని నరాల్లోకి వెళ్లి నిద్రావస్థకు వెళ్తామని, అలాంటప్పుడు నిద్రతో పాటు రాత్రి వాహనాలు వెలుగుల డబుల్ గా కనిపించడంతో ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా రోడ్డుపక్కన ఉన్న సిగ్నల్స్ ను వాటి విలువను తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. సిగ్నల్స్, సూచిక బోర్డుల ద్వారా ప్రమాదాలను అరికట్టవచ్చునన్నారు. మూల మలుపులు వద్ద ఓవర్టేక్ చేయవద్దని, పూర్తిగా ఎడమవైపు వెళ్ళాలని సూచించారు. అదేవిధంగా ఎక్కడైనా ప్రమాదాలు జరిగి ఎవరైనా ప్రాణాపాయ స్థితిలో ఉంటే వారికి వెంటనే ప్రధమచికిత్సతో పాటు 108, 101, 104లకు సమాచారం అందించి వారి ప్రాణాలను కాపాడిన వారమవుతాయన్నారు. ఎంతో ఖర్చుపెట్టి వ్యయ ప్రయాసాలు ఓర్చి ఇంజనీర్, డాక్టర్ ను తయారుచేస్తే వారు రోడ్డు ప్రమాదాలు వల్ల బలైతే ప్రభుత్వ ఖజానాకు భారీగా నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. అంతేకాకుండా ఆ కుటుంబాలు వీధిన



పడతాయని, వీటన్నిటిని గమనించి వాహనాలు నడపాలని సూచించారు. మన ప్రాణాలలో కాపాడటంతో పాటు ఎదుటి వచ్చే వారి ప్రాణాలను కాపాడటానికి సహకరించాలన్నారు. ఈ మాస ఉత్సవాలు ఇప్పటినుండి ఫిబ్రవరి 14 వరకు నెల రోజులు పాటు స్కూల్స్, కాలేజీలు, యువతకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సూచనలపై వాహనదారులు అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు.

# సేఫ్టీ మోకులు అందించి గీత కార్మికుల ప్రాణాలను కాపాడండి.

**బెల్టు షాపులను తక్షణమే తొలగించాలి.**

**కల్లుగీత కార్మిక సంఘం వినతి.**

**కల్లుగీత కార్మిక సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ.**

**హనుమకొండ, జనవరి 23, అక్షరం న్యూస్.**

గ్రామాలలో బెల్ట్ షాపులు విపరీతంగా పెట్టడం వలన లిక్కర్ తో ప్రజల ఆరోగ్యాలు దెబ్బ తినడం, ఆర్థికంగా కృంగిపోవడం తో పాటు కల్లు అమ్మకాలు పడిపోతున్నాయని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ప్రకటించిన విధంగా బెల్టు షాపులను పూర్తిగా తొలగించాలని, ప్రకృతి పానీయం కల్లును ప్రోత్సహించాలని కల్లుగీత కార్మిక సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. న్యూశాయంపేట హంటర్ రోడ్ లోని గోపా కార్యాలయంలో మంగళవారం జరిగిన రాష్ట్ర, హనుమకొండ జిల్లా కల్లుగీత కార్మిక సంఘం క్యాలెండర్ లను ఆవిష్కరణ జిల్లా అధ్యక్షుడు గౌని సాంబయ్య గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొనగాని యాదగిరి గౌడ్, ఉమ్మడి వరంగల్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వడ్లకొండ వేణు గోపాల్ గౌడ్, హనుమకొండ జిల్లా గోపా అధ్యక్షుడు చిర్రా రాజు గౌడ్, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్ లు హాజరై క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రకటించిన మేనిఫెస్టోలో బెల్ట్ షాపులను పూర్తిగా ఎత్తివేయాలని, తెలంగాణ రాష్ట్రంలో ప్రతిరోజు ఎక్కడో ఒక దగ్గర తాటిచెట్టుపై నుండి పడి చనిపోవడం లేదా గాయపడడం జరుగుతుందని, గీత కార్మికులకు సేఫ్టీ మోకులను ఇచ్చి వారి ప్రాణాలను కాపాడాలని ప్రభుత్వాన్ని వారు కోరారు. ప్రతి సొసైటికి చెట్ల పెంపకానికి 5 ఎకరాలు



ప్రభుత్వ భూమి ఇవ్వాలని, 560 జివో అమలు చేయాలి, టిడిపి ప్రభుత్వం హయాంలో ఇచ్చిన 439 సొసైటీల భూములకు పెన్సింగ్ చేయించి తాటి, ఈత, జీనుగు, ఖర్జూర తదితర కల్లునిచ్చే పొట్టి చెట్లు నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు బుర్ర సుధాకర్ గౌడ్, వల్లాల గంగాధర్ గౌడ్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి నర్సయ్య, జిల్లా గౌరవ సలహాదారుడు మోడం రాజేందర్ గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం నగరాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలి

**మంత్రి తుమ్మల నాగేశ్వరావు**

**ఖమ్మం/ తల్లాడ జనవరి 23 (అక్షరంన్యూస్ )**



ఖమ్మం నగరాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం నగర పాలక సంస్థ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్లో, నగర పాలక సంస్థ కమీషనర్ ఆదర్శ్ సురభి తో కలిసి, అధికారులతో నగర అభివృద్ధి పై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఖమ్మం నగరాన్ని సానిటేషన్, ప్లానింగ్, టౌన్ ప్లానింగ్ తదితర అన్ని విభాగాల్లో మోడల్ గా వుండేలా అధికారులు కృషి చేయాలన్నారు. ప్రస్తుతం నగర జనాభా 4 లక్షల 23 వేలకు చేరుకున్నట్లు, 69.50 ఎంఎల్డి త్రాగునీటి సరఫరా చేస్తున్నట్లు, వేసవిలో నగరంలోని ఏ ప్రాంతంలో నీటి సమస్య తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. పరిశుభ్ర నగరంగా ఖమ్మం కు పేరు రావాలని,ఈ దిశగా కార్పొరేషన్ ప్రతి విభాగ సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. పారిశుద్ధ్య సమస్యలను వెంట వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ సంవత్సరం వివిధ గ్రాంట్ల క్రింద రూ. 113 కోట్ల 24 లక్షలతో 574 పనులు చేపట్టినట్లు, ఇందులో 488 పనులు పూర్తి కాగా, 19 పనులు పురోగతిలో, 67 పనులు ఇంకనూ ప్రారంభించలేదని ఆయన తెలిపారు. పూర్తి అయిన పనులకు ఇప్పటి వరకు రూ. 24 కోట్ల 72 లక్షలు చెల్లించినట్లు ఆయన అన్నారు. పురోగతిలో ఉన్న పనుల పూర్తికి చర్యలు వేగం చేయాలన్నారు. సుడా ద్వారా రూ. 45 కోట్ల 7 లక్షలతో 48 పనులు మంజూరుకాగా, 38 పనులు పూర్తి అయినట్లు, రూ. 28 కోట్ల 89 లక్షలు ఖర్చు చేయగా, ఇంకనూ రూ 5 కోట్ల 61 లక్షలు చెల్లించాల్సి ఉందన్నారు. పబ్లిక్ హెల్త్ విభాగం ద్వారా ఈ సంవత్సరం డిఎంఎఫ్టి క్రింద రూ. 10 కోట్లు, 15వ ఆర్థిక సంఘం ద్వారా రూ. 2 కోట్లు, 15వ ఆర్థిక సంఘం టైడ్ ద్వారా రూ. 3.70 కోట్లు 13 పనులకు మంజూరు కాగా, 3 పనులు పూర్తి అయినట్లు, 2 పనులు పురోగతిలో ఉండగా, 8 పనులు ఇంకనూ ప్రారంభించలేదని ఆయన అన్నారు. గత 5 సంవత్సరాల్లో ట్యాక్సుల ద్వారా రూ. 110.53 కోట్లు, అద్దెల ద్వారా రూ. 3.78 కోట్లు, ఇంజనీరింగ్ విభాగం ద్వారా రూ. 5.10 కోట్లు, టౌన్ ప్లానింగ్, బిల్డింగ్ అనుమతుల ద్వారా రూ. 92.56 కోట్లు, ట్రేడ్ లైసెన్స్ ల ద్వారా రూ. 3 కోట్లు, పట్టణ ప్రగతి గ్రాంట్లు రూ. 55 కోట్లు, ఇతర గ్రాంట్ల ద్వారా రూ. 122.84 కోట్లు, నీటి పన్ను ద్వారా రూ. 13.01 కోట్లు, మొత్తంగా రూ. 405.82 కోట్ల రెవిన్యూ వచ్చినట్లు ఆయన అన్నారు. 2023-24సంవత్సరానికి రూ. 3984.07 లక్షల పన్ను వసూలు డిమాండ్ ఉండగా, ఇప్పటి వరకు రూ. 1751 లక్షలు వసూలు అయినట్లు, పక్కా ప్రణాళికతో 100 శాతం వసూళ్లు చేయాలన్నారు. 2020 నుండి 2023 వరకు సుడా ద్వారా 1155 అనుమతులు ఇవ్వగా, రూ 3301.84 లక్షలు వసూలు అయినట్లు ఆయన అన్నారు. నగర పాలక సంస్థ లో 385 రెగ్యులర్ పోస్టులకు గాను 229 మంది పనిచేస్తున్నట్లు, 156 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఆయన తెలిపారు. 1013 మంది వివిధ విభాగాల్లో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనుచేస్తున్నట్లు ఆయన తెలిపారు. అవుట్ సోర్సింగ్ సిబ్బందికి నెలకు రూ. 196.35 లక్షలు చెల్లిస్తున్నట్లు మంత్రి అన్నారు. విలువైన ప్రభుత్వ భూముల రక్షణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ స్థలాలు, ఆక్రమణకు గురైన స్థలాలు, ఎన్ఎస్పి స్థలాలు ఎక్కడ ఎంత మేర ఉన్నాయి నివేదిక సమర్పించాలని, ఆక్రమనలపై వెంటనే చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు. ప్రభుత్వ భూములకు పట్టాలు ఇచ్చిన చోట, పట్టాలు పొందిన వారే వుంటున్నారా, లేక అమ్మడం ఇతరత్రా జరిగిందా విచారణ చేసి, చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎన్ఎస్పీ భూమి ఏ ఏ అవసరాలకు ఎవరెవరికి ఎంత కేటాయించింది నివేదిక సమర్పించాలన్నారు. లకారం, ఖానాపురం, మున్నేరు, ధాంసలాపురంల వద్ద బఫర్ జోన్ డిమార్కు చేసి, నిర్మాణాలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. రోడ్ల విస్తరణతో నగర సుందరీకరణ అవుతుందని, నగరంలో వచ్చే 25 సంవత్సరాల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఏ ఏ ప్రదేశాల్లో రోడ్ల విస్తరణ ఆవశ్యకత వుందో పరిశీలన చేసి, నివేదిక సమర్పించాలన్నారు. సమీక్షలో సుడా డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్ కు మార్పులపై చర్చించారు. ఇల్లందు క్రాస్ రోడ్, ముస్తఫానగర్ ప్రాంతాల్లో కమర్షియల్ కేటగిరీలుగా ఉండగా, రెసిడెన్షియల్ కేటగిరీలుగా, ప్రకాష్ నగర్ నుండి ధాంసలాపురం రోడ్, గోళ్లపాడు ఛానల్ అభివృద్ధి, బొక్కలగడ్డ, వెంకటేశ్వర నగర్ ప్రాంతాల్లో మున్నేరు నది నుండి 50 మీటర్ల బఫర్ జోన్ లకు ఆలోచన చేయాలన్నారు. ప్రాజెక్టులకు ప్రణాళికలు చేసి, నివేదిక సమర్పించాలని, రాష్ట్ర, కేంద్రం నుండి నిధులు తెస్తానని, ప్రాజెక్టుల ద్వారా కల్పించే వినోదానికి ట్యాక్స్ వసూలు చేయాలని, ట్యాక్స్ ద్వారా అట్టి ప్రాజెక్టు అభివృద్ధి చెందేలా చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు. తల్లిదండ్రుల దయవల్ల మంచి పొజిషన్ వచ్చిందని, ఈ పొజిషన్ లో మనం చేసే కష్టం వల్ల మంచి పేరు రావాలని, మనకు సంతృప్తి కలగాలని ప్రజలకు సౌకర్యాలు మెరుగుడాలని మంత్రి అన్నారు. అధికారులు స్వేచ్ఛ గా, స్వతంత్రంగా, ఒత్తిడి లేకుండా పనిచేయాలని, నిబద్ధతతో నగర అభివృద్ధి, ప్రజలకు సౌకర్యాల కల్పనపై దృష్టి పెట్టి ఖమ్మం నగరానికి మంచిపేరు తేవాలని మంత్రి తెలిపారు. ఈ సమీక్ష లో ఖమ్మం ఆర్డీవో జి. గణేష్, ట్రాన్స్కో ఎస్ఇ సురేందర్, ఖమ్మం నగర పాలక సంస్థ సహాయ కమీషనర్ సత్యనారాయణ రెడ్డి, పబ్లిక్ హెల్త్ ఇఇ రంజిత్, మునిసిపల్ ఇఇ కృష్ణ లాల్, వివిధ విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డు భద్రతా నియమాలు తూచా తప్పకుండా పాటించాలి

**- ఆర్టివో ఫారుక్**


**రామగిరి (పెద్దపల్లి జిల్లా) జనవరి 23 అక్షరం న్యూస్::**




రోడ్లపై వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు ఖచ్చితంగా పాటించాలని పెద్దపెల్లి జిల్లా ఆర్ టీ వో ఫారుక్ తెలిపారు.. మంగళవారం జాతీయ రోడ్డు భద్రత మహొత్సవంలో భాగంగా రామగిరి మండలం నాగేపల్లి లోని ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.. ఆటో డ్రైవర్లకు జాతీయ రోడ్డు భద్రత మహొత్సవాల కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్ టీ వో మాట్లాడుతూ ప్రతి ఒక్క వాహనదారునికి తాను, తన కుటుంబం ఎంత ముఖ్యమో మన ఎదురుగా వస్తున్న వ్యక్తులు, వాహదారులు అంతే ముఖ్యమన్న విషయం పదే పదే గుర్తుంచుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని,ఎక్కువ దూరం ప్రయాణించేటపుడు మధ్య మధ్యలో కొద్దిసేపు విశ్రాంతి తీసుకోవడం తప్పనిసరి, రాత్రి వేళల్లో విధిగా డిప్పరు వాడాలని తెలిపారు.హెల్మెట్ ధరించడం, సీటు బెల్టు పెట్టుకోవడం తదితర భద్రతా నియమాలు పాటిస్తే ఎలాంటి ప్రమాదాలు జరగవన్నారు. ఈ కార్యక్రమంలో హోంగార్డ్ నక్క నాగేష్, విగ్నేశ్వర ఆటో యూనియన్ అధ్యక్షులు సట్ల రాజ్ కుమార్, నాదెం ఓదేలు, పొన్నం శ్రీనివాస్, చింత మహేందర్, ఎర్రం శంకర్, నక్క శంకర్, ఊట్ల సత్యనారాయణ, పల్లె లక్ష్మణ్, మాడి పెల్లి మొగిలి, కుమార్, సది, సతీష్ తదితరులు పాల్గొన్నారు...

## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసిన బాధావత్ సైదులు నాయక్..

**ఖమ్మం/ వైరా జనవరి 23 (అక్షరంన్యూస్)**



రాష్ట్ర రెవిన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నేత బాధావత్ సైదులు నాయక్ కలిశారు. మంగళవారం హైదరాబాదులోని సచివాలయంలో ఆయన మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించి, శాలువాలు, పూలమాలలతో సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా సైదులు నాయక్ మాట్లాడుతూ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను కచ్చితంగా అమలు చేస్తుందన్నారు. మంత్రి పొంగులేటి నేతృత్వంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా సస్యశ్యామలం అవుతుందన్నారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# కడిపికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్.

**ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ప్రజలకు అందుబాటులో ఉండాలి.**

**హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు.**



**హనుమకొండ, జనవరి 23, అక్షరం న్యూస్.**

మంగళవారం హనుమకొండ జిల్లా కాజీపేట మండలం కడిపికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సంబంధించిన రికార్డులను, మెడికల్ స్టోర్, ప్రసవాల గది, పేషెంట్ వార్డులను కలెక్టర్ పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బంది వివరాలతో పాటు మాత శిశు సంరక్షణ కార్యక్రమాలు, ఆరోగ్య కేంద్రానికి ఎంతమంది వస్తున్నారని వివరాలను వైద్యులు, సిబ్బందిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు చుట్టుపక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని స్థానిక వైద్యులు, సిబ్బందికి సూచించారు. మందుల గడువు తేదీని గమనించి ఇవ్వాలన్నారు. కడిపికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థితిగతులపై నివేదికను అందజేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సాంబశివరావును కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా కాజీపేట తహశీల్దార్ బావ్ సింగ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**పదో తరగతి ఫలితాల్లో మంచి మార్కులు సాధించేలా చర్యలు చేపట్టాలి.**

పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించేలా చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. మంగళవారం కాజీపేట మండలం కడిపికొండ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఈ పాఠశాల విద్యార్థులకు స్లిప్పు టెస్టులను నిర్వహించగా విద్యార్థుల మార్కుల ప్రగతిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి సిలబస్ పై విద్యార్థులకు ఏ విధంగా పరీక్షలు నిర్వహిస్తున్నారనే వివరాలను స్థానిక ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలకు పూర్తిస్థాయిలో సన్నద్ధమయ్యే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. ప్రతి విద్యార్థి తనకు తానే సొంతంగా చదివి ఉత్తమ మార్కులు సాధించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అన్నారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ అబ్దుల్ హై, స్థానిక ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా తల్లాడ రింగ్ రోడ్డు సెంటర్..







- **లోడుతో వెళ్తున్న వాహనాలు పల్టీలు కొడుతున్న వైనం..**
- **చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్న ఆర్ అండ్ బీ అధికారులు...**

ఖమ్మం/తల్లాడ జనవరి 23 (అక్షరంన్యూస్)

తల్లాడ రింగ్ రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డులో నిత్యం వేలాదిగా వాహనాలు వస్తూ పోతుంటాయి. ఖమ్మం, హైదరాబాద్, భద్రాచలం, రాజమండ్రి నగరాలకు తల్లాడ పట్టణం కూడలిగా ఉంది. ఈ నేపథ్యంలో వాహనాలు ఈ రోడ్డుపై భారీగా వెళ్తుంటాయి. దీంతో లోడ్ తో వస్తున్న వాహనాలు ఈ రింగ్ రోడ్డు సెంటర్లో అనేకసార్లు పల్టీలు కొట్టిన సందర్భాలు అనేకం ఉన్నాయి. కొత్తగూడెం రోడ్డు నుండి ఖమ్మం వైపు వెళ్తున్న వాహనాలు రింగు రోడ్డు మూలమలుపు వద్ద తిప్పుతుండటంతో వాహనాలు పల్టీలు కొడుతున్నాయి. రింగు పెద్దది కావడం వల్ల లోడుతో ఉన్న వాహనాలు తిరగక పల్టీలు కొడుతున్నాయి. ఇటీవల కాలంలో ఈ సంఘటనలు అధికంగా చోటు చేసుకుంటున్నాయి. అనేకసార్లు ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత ఆర్ అండ్ బి అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. అదేవిధంగా కనీసం హెచ్చరిక బోర్డులు కూడా పెట్టటం లేదు. రింగు వెడల్పుగా ఉండటంవల్లే లోడు వాహనాలు తిరగకపోవటంతో పల్టీ కొడుతు న్నాయని స్థానికులు తెలియజేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి రింగు వెడల్పు తగ్గించి వాహనాలు సులువుగా వెళ్ళే విధంగా చర్యలు చేపట్టాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

## ఫర్టిలైజర్ దుకాణాల ఆకస్మిక తనిఖీ



నల్గొండ /అడవిదేవులపల్లి/ జనవరి 23/ అక్షరం టౌన్ న్యూస్:

అడవిదేవులపల్లి మండలంలో మంగళవారం నాడు ముదిమాణిక్యం, బాల్నేపల్లి, అడవిదేవులపల్లి గ్రామాల్లో ఉన్నట్టువంటి ఫర్టిలైజర్ దుకాణాలను మిర్యాలగూడ ఏడిఏ పోరెడ్డి నాగమణి స్థానిక వ్యవసాయ అధికారి బి.కళ్యాణ్ చక్రవర్తి తో కలిసి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు, ఈ కార్యక్రమంలో ఏడిఏ మాట్లాడుతూ డీలర్లు అందరూ కూడా తప్పని సరిగా స్టాక్ రిజిస్టర్స్ నిర్వహణ చేయాలని మరియు ఎరువుల నిల్వలను పొందుపరచాలని తెలియజేసారు లేని యెడల శాఖాపరమైన చర్యలు తీసుకోబడతాయని తెలిపారు ఈ కార్యక్రమంలో ఆమె వెంట ఏఈఓ లు నరేష్, మహేష్ నాయక్ మరియు డీలర్లు కోటి, నాగేశ్వరరావు, కృష్ణ, వెంకట నారాయణ ఉన్నారు

## వరంగల్ జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైన గంట రవికుమార్



వరంగల్ జిల్లా/ బిజెపి పార్టీ ఆఫీస్/ అక్షరం న్యూస్

భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులుగా గంట రవి కుమార్ జిల్లా పార్టీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరరించాడు. సందర్భంగా పార్టీ శ్రేణులు శుభాకాంక్షలు తెలియజేసినారు. ఈ సందర్భంగా గంట రవికుమార్ మాట్లాడుతూ. పార్టీ అధిష్టానం తనపై నమ్మకంతో అప్పచెప్పిన బాధ్యతలను శ్రద్ధ కృషితో నిర్వహిస్తానని, పార్టీ నాయకులను కార్యకర్తలకు ఈ సమయంలోనైనా అవసరము వచ్చినప్పుడు పార్టీ అభివృద్ధికి కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని అన్నాడు. పార్టీ అభిమానులను ఏకం చేసి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నాడు. పార్టీ కార్యకర్తల పైన నాయకుల పైన తారతమ్య భేదాలు లేకుండా కంటికి రెప్పలా చూసుకుంటానని అన్నాడు. తనకు ఈ బాధ్యతను అప్పజెప్పిన పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి, పరకాల నియోజకవర్గ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మహిళ మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్ళిన దొంగలు..పోలీసుల విచారణ ప్రారంభం-కేసు నమోదు



మంచిర్యాలబ్యూరో/రామకృష్ణాపూర్, జనవరి23(అక్షరం న్యూస్): మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోగల రాజీవ్ నగర్ లో నివసిస్తున్నా శంకరమ్మ అనే మహిళ వాళ్ల సొంత ఇంటి ముందు వాకిలి ఉడుస్తుండగా బైక్ పై వచ్చిన ఇద్దరు దొంగలు ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్ళారు.ఆ క్రమంలో చూస్తే..పట్టణంలోని వాళ్ల ఇంటి ముందు మంగళవారం ఉదయం 6గంటల సమయంలో వాకిలి ఊడుస్తుండగా గుర్తు తెలియని ఆ ఇద్దరు దొంగలు అక్కడికి వచ్చి దాదాపు రెండు తులాల గొలుసును అపహరించుకొని పారిపోయారు.ఆ విషయం తెలిసిన వెంటనే మందమర్రి సిఐ మహేందర్ రెడ్డి నేతృత్వంలో పట్టణ ఎస్ఐ రాజశేఖర్ నేతృత్వంలో పోలీసులు డాగ్ స్క్వాడ్ ద్వారా అక్కడికి చేరుకొని వెంటనే విచారణ ప్రారంభించారు.ఆ మేరకు పోలీసు కేసు నమోదు చేసుకొని అన్ని కోణాలలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## కొనసాగుతున్న బూడిద లారీ ఓనర్ల సమ్మె..

గోదావరిఖని ప్రతినిధి/పెద్దపల్లి/జనవరి 23/అక్షరం న్యూస్:

ఎన్టిపిసి యాష్ పాండ్ కుందనపల్లి శివారు లో గత వారం రోజుల నుండి బూడిద లారీ ఓనర్ల సమ్మె కొనసాగుతుంది.పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం లోని కుందనపల్లి శివారులోని ఎన్టిపిసి యాష్ పాండ్ లో బూడిద తరలింపు కోసం టెండర్లు పొందిన కాంట్రాక్టులు దూరప్రాంతాల నుండి లారీలను తీసుకువచ్చి బూడిద రవాణా చేస్తుండగా తమకు ఉపాధి కరువైందని స్థానిక లారీ యజమానులు ఆందోళనకు దిగారు.గతంలో తమ లారీలతో ఇటుక బట్టీలకు బూడిద రవాణా చేయగా ప్రస్తుతం ఒ కాంట్రాక్టర్ ఇటుక బట్టీలకు తన సొంత లారీలతో బూడిద రవాణా చేస్తుండడంతో తమకు ఉపాధి దొరకక తమ లారీల ఫైనాన్స్ డ్రైవర్ల జీతాలు చెల్లించక అప్పుల పాలవుతున్నామని లారీ ఓనర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.బూడిద కాలుష్యంతో సతమతమవుతున్న స్థానిక రామగుండం,బసంత్ నగర్ ఓనర్ల బాధలు ఎన్టిపిసి యాజమాన్యం పట్టించుకోవడంలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్ టి పి సి యాజమాన్యం స్పందించి తమకు ఉపాధి కల్పన జరిగేలా చర్యలు తీసుకోవాలని స్థానిక లారీ ఓనర్లు కోరుతున్నారు.ఆందోళనలో స్థానిక లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు సంపంగి శ్రీనివాస్, శివరాత్రి గంగాధర్,కొమురయ్య,శ్రవణ్,కుమార్ పాల్గొన్నారు.

## ప్రజా ప్రతినిధులు అధికారుల సహకారంతో మండలాన్ని అభివృద్ధి చేస్తా

- **మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి**



నల్గొండ /అడవిదేవులపల్లి/ జనవరి 23/అక్షరం టౌన్ న్యూస్ :

అడవిదేవులపల్లి మండల కేంద్రంలోని రైతు వేదిక లో నిర్వహించిన మండల సర్వ సభ్య సమావేశమునకు ముఖ్యఅతిథిగా మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి హాజరైనారు తదనంతరం వారు అధికారులతో మాట్లాడి మండల పరిధిలోని వివిధ శాఖల వారీగా పెండింగ్ లో ఉన్న పనులపై, పూర్తి చేసిన పనులపై రివ్యూ నిర్వహించడం జరిగింది.. ఈ సందర్భంగా శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ అడవిదేవులపల్లి మండలం పట్టణానికి దూరంగా, ఉన్నందు వలన ఇక్కడి ప్రజలకు విద్య, వైద్యం విషయంలో ఎటువంటి ఇబ్బందీ రాకుండా చూడాలని అన్నారు.. అలాగే ఇక్కడ మంచి నీటి కొరత ఎక్కువగా ఉందని గ్రామస్థులు చెప్తున్నారు, కావున రాబోయే వేసవి కాలంలో మంచి నీటికి సమస్య రాకుండా చూడాలని అన్నారు.. ఈ మండలంలోని అనేక గ్రామాల్లో కరెంట్ కోత కూడా అధికంగా ఉంది .. దానికి కూడా తొందరలో చెక్ పెట్టాలని అన్నారు.. గత ప్రభుత్వం లో అధికారులు ఎలా పనిచేశారో తెలియదు కానీ మా ప్రభుత్వంలో మాత్రం పార్టీలు ముఖ్యం కాదు, ప్రజలే ముఖ్యం.. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజల కోసం అధికారులు కూడా పనిచేయాలని అన్నారు... అదే విధంగా గ్రామస్థులు విన్నపం మేరకు వీలైన త్వరలోనే సంబంధిత మంత్రి గారితో మాట్లాడి దున్నపోతుల గండి లిఫ్ట్ ఇరిగేషన్ను కూడా పూర్తి చేయిస్తానని అన్నారు .. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ధనావత్ బాలాజీ నాయక్ తహసిల్దార్ సురేష్ కుమార్ ఎంపీడీవో షరీఫ్ సర్పంచులుకొత్త మరెడ్డి బాలు నాయక్ కుర్ర పకీర రమావత్ ప్రియాంక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొదిల శ్రీనివాస్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రమావత్ బాలు నాయక్ బండి నాగేశ్వర రావు గోపగాని హనుమంతు బండి నరసింహారావు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అక్షరం దినపత్రిక 2024 క్యాలెండర్ ను ఆవిష్కరించిన ఏడూళ్ల బయ్యారం సీఐ శివప్రసాద్ నూతనఎస్సై టి.వెంకటప్పయ్య...



**భద్రాద్రికొత్తగూడెం, పినపాక, జనవరి 23(అక్షరం న్యూస్)**

2024 ఆంగ్ల సంవత్సర నూతన క్యాలెండర్ ను ఏడూళ్లబయ్యారం సీఐ శివ ప్రసాద్, నూతన ఎస్సై టి. వెంకటప్పయ్య కలిసి తన ఛాంబర్ లో ఆవిష్కరించారు. సిఐ శివప్రసాద్ మాట్లాడుతూ నిరంతరం ప్రజల సమస్యలపై ప్రత్యేక కథనాలు ప్రచురిస్తూ ప్రజలకు అధికారులకు మధ్య వారధిగా అక్షరం దినపత్రిక ప్రజలలో తనదైన ముద్ర వేసుకుంది అన్నారు. నిజాలను నిర్భయంగా వెలికితీస్తూ అక్షరం దినపత్రిక తన వంతు పాత్ర పోషిస్తుందని . డిజిటల్ రంగంలో సరికొత్త కథనాలు అందిస్తూ వార్తాపత్రికల్లో తనదైన ముద్ర వేసుకుందని అక్షరం ప్రతినిధి కొంపల్లి సంతోష్ ని ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు బూర శంకర్, తోట గంగాధర్, బిల్లా నాగేందర్ , శ్రీరామ్ బృహస్పతి,సాక్షి మహేష్, కట్ట శ్రీనివాస్, నిట్ట వెంకటేశ్వర్లు, కీసర సుధాకర్ రెడ్డి, గొడిశాల చంద్రం, కొంపెల్లి నాగేష్, ఫాస్ట్ న్యూస్ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



## ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్‌ను పట్టణంలో ప్రజలకు అనువైన స్థలంలో ఏర్పాటు చేయాలి

- **చొప్పదండి పట్టణంకి దూరం గా ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్**
- **రెండు కిలోమీటర్ల దూరంలో సబ్ స్టేషన్ లో ఫ్యూజ్ ఆఫ్ కాల్ ఫిర్యాదుల స్వీకరణ**
- **విద్యుత్ సమస్య గూర్చి ఫిర్యాదు చేసేందుకు ఇబ్బంది పడుతున్న పట్టణ ప్రజలు**

చొప్పదండీ/ కరీంనగర్, జనవరి 23 (అక్షరం న్యూస్ )

కరీంనగర్ జిల్లా చొప్పదండి పట్టణంలోని ప్రజలు విద్యుత్ సమస్యలు గూర్చి ఫిర్యాదు చేసే ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్ ని పట్టణంలో ప్రజలకు అనువైన స్థలంలో ఏర్పాటు చేయాలి. చొప్పదండి పట్టణంలో విద్యుత్ ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్ ని పట్టణానికి మధ్యలో ప్రజలకు అనువైన స్థలంలో కాకుండా పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద విద్యుత్ ఫిర్యాదులను తీసుకుంటున్నారు. దీనివలన పట్టణంలోని ప్రజలు తమకు ఏదయినా విద్యుత్ సమస్య ఏర్పడితే రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ కి వెళ్లాలంటే పట్టణ ప్రజలకు దూరం గా ఉంటుంది. అంత దూరం వృద్ధులు,మహిళలు వెళ్లాలంటే ఆటోలో వెళ్లాల్సి ఉంటుంది.

చొప్పదండిలో ఉత్తర విద్యుత్ పంపిణీ కార్పొరేషన్ లిమిటెడ్ ఎన్పీడీసీఎల్ వారు పట్టణం మధ్యలో ఉన్న ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్ ( విద్యుత్ కస్టమర్ సర్వీస్ సెంటర్ )ను పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేయడం వల్ల పట్టణ ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కావున ఇప్పటికైనా ఎన్పీడీసీఎల్ అధికారులు స్పందించి ఈ యొక్క ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్ ని పట్టణానికి ప్రజలకు అనువైన స్థలంలో చేరువలో ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు

**కాల్వ శ్రీరాంపూర్, పెద్దపల్లి జిల్లా జనవరి 23 అక్షరం న్యూస్:**

మండల కేంద్రంలో మంగళవారం రోజున ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ 127 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వొడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ యువత నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆదర్శంగా తీసుకోవాలని భారతదేశాన్ని అన్ని రంగాలలో ప్రపంచంలో మొదటి స్థానంలో నిలపాలని ఆశయాలను స్మరించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వొడ్నాల శ్రీనివాస్, తొట్ల రవి, ఉప్పుల కుమార్, రాజేశ్వరరావు, ఆశాడపు సురేష్, ఆశాడపు పురుషోత్తం మరియు యూత్ సభ్యులు వొడ్నాల రాజేష్, తాత సాయి కిరణ్, బూర్ల హరీష్ తదితరులు పాల్గొన్నారు.



# చట్ట వ్యతిరేక, అసాంఘీక కార్యకలాపాల కట్టడికి ప్రత్యేక పోలీసు బృందాలు..

- గంజాయి వంటి వ్యవస్థీకృత నేరాల కట్టడికి ప్రణాళిక..
- విజబుల్ పోలిసింగ్ తో నేరాల నియంత్రణపై దృష్టి..
- ఖమ్మం పోలీస్ కమిషనరేట్ లో పటిష్టంగా సిటీ పోలీసు యాక్టు అమలు..
- నేరసమీక్ష సమావేశంలో పోలీస్ కమిషనర్



ఖమ్మం/ తల్లాడ జనవరి 23 (అక్షరంన్యూస్)

చట్టవ్యతిరేక కార్యకలాపాలను చెక్ పెట్టేందుకు ప్రతేక చర్యలు చేపట్టినట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. పోలీస్ కాన్ఫరెన్స్ హాల్ లో మంగళవారం

జరిగిన నేర సమీక్ష సమావేశంలో పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ...జిల్లాలో శాంతిభద్రతలు చాలా ముఖ్యమని, మత్తుపదార్థాల రవాణా, విక్రయాలు, వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన వైఖరి అవలంబిస్తోందని, దీనిని దృష్టిలో పెట్టుకొని మాధకద్రవ్యాల సరఫరా మూలాలకు సంబంధించిన అన్ని అనుసంధానాలను గుర్తించి కట్టడి చేసేలా నిఘా వ్యవస్థను పటిష్టం చేసినట్లు తెలిపారు. ఖమ్మం పోలీస్ కమిషనరేట్ లో బహిరంగ మద్యపానం, పబ్లిక్ న్యూసెన్స్, రాష్ డ్రైవింగ్, రాత్రి సమయాల్లో సమయానికి మించిషాపులు తెరవడం, పని లేకున్నా రోడ్లపై రావడం, పుట్టినరోజు వేడుకలు రోడ్డుపై వాహనాలు అడ్డం పెట్టి ప్రజలకు అసౌకర్యం కలిగించే వారిపై సిటీ పోలీసు యాక్టు ఖచ్చితంగా అమలు చేసి కోర్టులో హాజరు పరచాలని పోలీస్ అధికారులకు ఆదేశించారు. పాత నేరస్తుల కదలికలను నిఘా పెట్టాలని తరచూ నేరాలు చేసే కరుడుగట్టిన నేరస్తులపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని సూచించారు. చోరి సోత్తు రికవరీపై సెంట్రల్ క్రైమ్ పోలీసులు దృష్టి సారించాలని ఆదేశించారు. దీర్ఘకాలిక పెండింగ్ కేసులు, నాన్ బెయిలబుల్ వారంట్ ఎగ్జిక్యూట్ ,లోక్ అదాలత్ లో కక్షిదారులకు సత్వర న్యాయం, పరిష్కారాని తీసుకొవాల్సిన చోరవపై సమీక్ష నిర్వహించారు.వివిధ కేసుల దర్యాప్తుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని అన్నారు.విచారణలో వున్న గ్రేవ్ కేసుల వివరాలను, ఎస్.సి., ఎస్.టి. కేసుల వివరాలు అడిగి తెలుసుకొన్నారు. విచారణ వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. పోక్సో కేసులు,( %ఖ/×% )అండర్ ఇన్వెస్టిగేషన్ లో ఉన్న కేసుల వివరాలు, పెండింగ్ ఉన్న ఎఫ్ఎస్ఎల్ రిపోర్ట్స్, పోస్టుమార్టం రిపోర్ట్స్, నేరస్తుల అరెస్టు చేయని కేసులలో నేరస్తులను అరెస్టు చేసి త్వరగా ఇన్వెస్టిగేషన్ పూర్తిచేసి చార్జిషీట్ దఖాలు చేయాలని సూచించారు. అడిషనల్ డీసీపీ లా%డ%ఆర్డర్ ప్రసాద్ రావు, ఏఆర్ అడిషనల్ డీసీపీ కుమారస్వామి, ట్రైనీ ఏఎస్పీ మౌనిక, ఏసీపీలు గణేష్, ప్రసన్న కుమార్, హరికృష్ణ,భస్వారెడ్డి, రహెమాన్, రామనుజం, సారంగ పాణి, కృపాకర్, రవి, శివరామయ్య, శంకర్,నర్సయ్య, సుశీల్ సింగ్, సిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

## విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- టిఎస్ఎన్పిడిసిఎల్ సిఎండి వరుణ్ రెడ్డి కి టిఆర్ఎస్వికెఎస్ వినతి..




ఖమ్మం/ తల్లాడ జనవరి 23 (అక్షరంన్యూస్)

జిల్లాలో విద్యుత్ కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని టిఆర్ ఎస్వికెఎస్ నాయకులు కోరారు. ఈమేరకు వారు మంగళవారం రాత్రి ఖమ్మం కు విచ్చేసిన టిఎస్ఎన్పిడిసిఎల్ సి యండి కర్నాటి వరుణ్ రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిల్లా లో ని 33/11కెవి సబ్ స్టేషన్ లలో ఇద్దరు ఆపరేటర్లు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని,దీనివల్ల వారిపై పనిభారం

పెరిగి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.ఈ సమస్య ను పరిష్కరించేందుకు సబ్ స్టేషన్ లలో నలుగురు ఆపరేటర్ లను ఒక వాచ్ మెన్ ను నియమించాలని కోరారు. అదేవిదంగా ఫీల్డ్ కార్మికులకు మిగతా ఉద్యోగుల మాదిరి గా వారాంతపు సెలవు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.అదేవిదంగా ఖాళీగా ఉన్న కింది స్థాయి ఉద్యోగుల పోస్టుల ను నిబంధనల ప్రకారం వెంటనే భర్తీ చేయాలని అన్నారు.బిల్లులు వసూలు చేసే క్రమంలో గదులు లేక రోడ్లపైనే బిల్లులు వసూలు చేస్తున్నారని ఈ సమస్య పరిష్కారానికి గది నిర్మించాలని కోరారు.అలాగే బిల్ కలెక్టర్లను, స్పాట్ బిల్లర్లను,అన్ మెండ్ వర్కర్లను ఆర్టిజన్ లు గా గుర్తించాలని లేదా ఫిక్స్ డ్ సాలరీ అందజేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమస్యలను వెంటనే పరిష్కరించి విద్యుత్ కార్మికుల ఇబ్బందులు తొలగించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష ,కార్యదర్శులు బానోత్ ఉ పేందర్, యు.శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ లు షరీఫ్ మియా, శేషగిరి,ట్రెజర్ కృష్ణ మూర్తి, నాయకులు కోటేశ్వర రావు,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## 25 న గ్రామ పంచాయతీ భవనం ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభోత్సవం.. ప్రేమ్ సాగర్ రెడ్డి



ఓదెల/పెద్దపల్లి 23(అక్షరం న్యూస్) ఓదెల మండలంలోని పెద్ద కొమిర నూతన గ్రామపంచాయతీ భవనాన్ని అదేవిధంగా వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభించడానికి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు 25వ తేదీ న విచ్చేస్తున్నారని ఈ సందర్భంగా కొమిర గ్రామంలో విలేకరుల సమావేశం నిర్వహించిన మండల కాంగ్రెస్ అధ్యక్షులు ప్రేమ్ సాగర్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన గ్రామపంచాయతీ భవనాన్ని అదేవిధంగా గ్రామంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడానికి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు వస్తున్నారని ఈ కార్యక్రమానికి కార్యకర్తలు వివిధ గ్రామాల సర్పంచులు ఎంపిటిసిలు అనుబంధ సంఘాల నాయకులు పార్టీ కార్యకర్తలు హాజరు కావాలని మండల అధ్యక్షులు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి పిలుపునిచ్చారు

## కూతురు జన్మదినం సందర్బంగా నగదు, సరుకులు సహాయం

- మూడు వేల రూపాయలు నగదు, నెలకు సరిపడా సరుకులు అందించిన మచ్చ రమేష్



చొప్పదండి /కరీంనగర్,జనవరి 23 (అక్షరం న్యూస్ )

కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం ఆర్నకొండ గ్రామానికి చెందిన నాయకుడు మచ్చ రమేష్ కూతురు మనీషా పుట్టినరోజు సందర్భంగా కీశే నరిగే విజయ్ కూతురు రాజేశ్వరి కి మంగళవారం రోజు నెలకు సరిపడా నిత్యవసర వస్తువులు, మూడు వేల రూపాయల నగదు ను రమేష్ ఇచ్చినారు.అనాధ అయిన తండ్రి చనిపోయి ఇల్లు లేక గుడిసె లో నివసిస్తున్న నరిగే రాజేశ్వరి ని చూసి చలించి సహాయం చేయడం జరిగిందని రమేష్ అన్నారు.ఇంకా దాతలు ఎవరైనా ఉంటే తండ్రి చనిపోయిన ఆమెకు సహాయం చేయవలసిందిగా కోరినారు.ఈ కార్యక్రమంలో పూసల మహేష్. మొదుంపెల్లి కృష్ణ. గాతం నారాయణ. బాసం కొండయ్య చిలుముల సురేష్. కనుకుట్ల అనిత పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో కొరవడిన పర్యవేక్షణ"

- వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలి....
- ప్రసవాలకు ప్రైవేట్ ఆసుపత్రిలకు వెళ్లకుండా గర్భిణీలకు సేవలందించాలి
- ప్రాథమిక , సామాజిక ఆరోగ్య వైద్యాది కారులతో సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రియాంక అల



భద్రాద్రి జిల్లా/ కొత్తగూడెం/ జనవరి.23/ అక్షరం టౌన్ న్యూస్

ప్రభుత్వ ఆసుపత్రుల్లో గర్భిణీ మహిళలను రిజిస్ట్రేషన్ చేయాలనిజిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల వైద్యాది కారులను ఆదేశించారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో ప్రాథమిక , సామాజిక ఆరోగ్య వైద్యాది కారులతో గర్భిణీలు నమోదు, అనీమియా, మాతా శిశు మరణాలు, వ్యాధి నిరోదక టీకాలు, టిబి వ్యాధి నియంత్రణ చర్యలు తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలని ,అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో బయో మెట్రిక్ హాజరు నమోదు చేయాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్లు తక్కువగా జరుగుతున్నాయంటే అందుకు.పర్యవేక్షణ కొరవడిందని , తక్కువ నమోదులు, ప్రసవాలు జరిగిన ఆరోగ్య కేంద్రాలపై ప్రత్యేకంగా పర్యవేక్షణ చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సమీక్షలు చేయాలని, ప్రసవాలకు ప్రైవేట్ ఆసుపత్రి కి వెళ్లకుండా ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే విధానంగా సేవలు అందించాలని చెప్పారు. ప్రభుత్వ, ప్రయివేటు, పారిశ్రామిక ఆసుపత్రుల్లో జరిగిన ప్రసవాలపై నివేధికలు అందచేయాలని ఆదేశించారు. శస్త్ర చికిత్సలు చేసిన కేస్ షీట్ తో నివేదికలు పంపాలని ,సాధారణ ప్రసవాలు జరిగేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. క్షయ లక్షణాలున్న వ్యక్తుల కు వైద్య పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు. అందించాలని , నమూనా పరీక్షలు కొరకు టి హబ్ కు సాంపిల్స్ పంపాలని చెప్పారు.

ఈ సమీక్ష సమావేశంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జె.వి.ఎల్. శిరీష, డిప్యూటి డియంహెచ్ఓలు కొత్తగూడెం డాక్టర్. సుకృత, భద్రాచలం డాక్టర్ రాజ్ కుమార్, డిసిహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు , సూపరింటెండెంట్ కుమారస్వామి, యంసిహెచ్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య, ఇమ్యూనేషన్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బాలాజీ, మలేరియా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ స్పందన , టీబి ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసరావు, ఎన్ సి డి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మధువరన్, పి. హెచ్ సి వైద్యాధికారులు, సిహెచ్సి సూపరింటెంట్లు ,తెలంగాణ వైద్య విధాన పరిషత్ సూపరింటెండెంట్ లు, డిప్యూటీ డెమోలు ఫైజ్ మోహియుద్దిన్ ,నాగలక్ష్మి, డి పిహెచ్ఎన్ ఓ అన్నా మేరి, సిహెచ్ఓ నాగభూషణం, హెల్త్ ఎడ్యుకేటర్ బేబీ,డిపియు దుర్గ ,రెహమాన్, భాను చందర్, ఎమ్.ఎల్.హెచ్పి లు తదితరులు పాల్గొన్నారు.

## సాంకేతిక వ్యవసాయంద్వారా రైతులు అధిక లాభాలు పొందాలి

- జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్




జనగామ జిల్లా / రఘునాథపల్లి/( అక్షరం న్యూస్ ) జనవరి 23 :

రైతులు అధిక సాంద్రత కలిగిన పత్తి సాగులో నూతన సాంకేతిక విధానంలో పత్తి సాగు చేస్తే అధిక లాభాలు గడించవచ్చని జనగామ జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని నిడిగొండ గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏరువాక కేంద్రం యాదాద్రి భువనగిరి జిల్లా వారి ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ అధికారులకు,వ్యవసాయ విస్తరణ అధికారులకు వర్క్ షాప్ నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా జనగామ జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్ హాజరై మాట్లాడుతూ అధిక సాంద్రత పత్తి సాగులో నూతన మెలకువలను రైతులకు చేరడం వేయడంలో వ్యవసాయ విస్తరణ అధికారులు ముఖ్య భూమిక పోషించాలని అయన అన్నారు. పత్తి సాగులో సమగ్ర తెగుళ్లు, గులాబీ రంగు పురుగు యాజమాన్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.పత్తి సాగులో రైతులు నూతన సాంకేతిక విధానాన్ని అవలంబించి ప్రతి సాగు ద్వారా అధిక లాభాలు పొందాలని అన్నారు. కార్యక్రమం లో ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వీరన్న, ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ బి అనిల్ కుమార్,డాక్టర్ ఓం ప్రకాష్,కే మమత, జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకు లు,నూజివీడు,రాశి,క్రిస్టల్ కావేరి కంపెనీలకు చెందిన యజ మానులు పాల్గొన్నారు.


## ఘనంగా నేతాజీ జయంతి



కరీంనగర్, తిమ్మాపూర్ జనవరి 23 (అక్షరం న్యూస్)

స్వాతంత్ర్య సమరయోధుడు సుభాష్ చంద్రబోస్ 127 వ జయంతి సందర్బంగా తిమ్మాపూర్ మండలం రామక్రిష్ణకాలనీ లో ఘనంగా నివాలులర్పించారు.నేతాజీ అభిమాన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన పోరాట వీరత్వాన్ని స్మరించుకున్నారు. గ్రామ ఉపసర్పంచ్ గుజ్జుల ప్రణీత్ రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి,దావు శ్రీనివాస్ రెడ్డి, పోలం అంజయ్య,ఎడ్ల భూంరెడ్డి,బిజెవైఎం అధ్యక్షులు గడ్డం అరుణ్,కొమ్మెర వెంకట్ రెడ్డి, దూల్గుంటి శ్రీనివాస్ రెడ్డి, ఆవుల ఓదెలు,పబ్బ తిరుపతి, నీలం సతీష్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ప్రవీణ్ చక్రవర్తి, రోహిత్ చౌదరిని కలిసిన డాక్టర్ లోకేష్ యాదవ్...



ఖమ్మం/ తల్లాడ జనవరి 23 (అక్షరంన్యూస్)

అఖిలభారత కాంగ్రెస్ కమిటీ ప్రొఫెషనల్కాంగ్రెస్ చైర్మన్, మేనిఫెస్టో కమిటీ కన్వీనర్ ప్రవీణ్ చక్రవర్తిని, ఏఐసీసీ ఇన్చార్జ్ సెక్రెటరీ రోహిత్ చౌదరిని టీపీసీసీ అధికార ప్రతినిధి, కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ స్ట్రాటజీ కమిటీ మెంబర్ డాక్టర్ల లోకేష్ యాదవ్ కలిశారు. మంగళవారం హైదరాబాదులోని గాంధీభవన్ లో వారిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురికి పుష్పగుచ్ఛం అందించి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. రానున్న రోజుల్లో దేశంలో, తెలంగాణ రాష్ట్రంలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల గురించి కొద్దిసేపు చర్చించారు. ఈ ఎన్నికల్లో ఓబీసీ వర్గాలకు సంబంధించిన సీట్లు తదితర అంశాలపై క్షుణ్ణంగా వివరించారు. ఈ సందర్భంగా లోకేష్ యాదవ్ మాట్లాడుతూ త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికలపై చర్చించినట్లు తెలిపారు. అనంతరం డాక్టర్ లోకేష్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కూడా మెజార్టీ ఎంపీ సీట్లను గెలుపొందుతామని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించిన ఏఐసిసి అగ్ర నేత సోనియా గాంధీ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేస్తుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

# గీతా కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- కల్లుగీత కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎంవి రమణ గౌడ్...
- ఘనంగా కల్లు గీత కార్మికుల సంఘం నూతన క్యాలెండర్లు ఆవిష్కరణ...



మమహబూబాద్/కేసముద్రం/జనవరి 23/అక్షరం న్యూస్:-కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో విడుదల చేసిన మేనిఫెస్టోలో గీత కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎంవి రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మంగళవారం నాడు కేసముద్రం మండల కేంద్రంలోని లక్ష్మీ సాయి గార్డెన్లో కేజికేఎస్ ఆధ్వర్యంలో గౌడ ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం.వి రమణ గౌడ్,మానుకోట ఎమ్మెల్యే సతీమణి భూక్య ఉమ,మాజీ ఎంఎల్సి గండు సావిత్రమ్మ,గోపా డివిజన్ అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్,జిల్లా అధ్యక్షులు యమగాని వెంకన్న, మండలఅధ్యక్ష,కార్యదర్శులు బబ్బూరి ఉప్పలయ్య,మోడెం వెంకటేశ్వర్లు లు పాల్గొన్నారు.ఈ నేపథ్యంలో 5000 క్యాలెండర్ లను గోపా డివిజన్ అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్ ముద్రించి,ప్రతి గ్రామ గ్రామాన పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేయడంతో సమ్మి గౌడ్ ను కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎంవి రమణ అభినందించారు.ఈ సందర్భంగా కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం వి రమణ మాట్లాడుతూ..ప్రమాదానికి గురై చనిపోయిన వారి కుటుంబాలకు,శాశ్వత వికలాంగులకు 10 లక్షలు, తాత్కాలిక వికలాంగులకు లక్ష చొప్పున ఎక్స్ గ్రేషియా నెల రోజుల లోపు ఇవ్వాలని తెలిపారు.మెడికల్ బోర్డు విదానం తొలగించాలని,వృత్తిలో ఎక్కడ ప్రమాదం జరిగినా వర్తింపజేయాలని పేర్కొన్నారు.బెల్టు షాపులను పూర్తిగా నిషేదిం,కల్లులోని పోషకాలను,ఔషద గుణాలను ప్రభుత్వమే ప్రచారం చేసి మార్కెట్ సౌకర్యం కల్పించాలన్నారు.గీత కార్మికులకు ప్రస్తుతం ఇస్తున్న పెన్షన్ ఎలాంటి షరతులు లేకుండా 50 సంవత్సరాలు నిండిన ప్రతి గీత కార్మికునికి చేయూత పథకం ద్వారా 4వేలు ఇవ్వాలని తెలిపారు.కల్లుగీత కార్మికులందరికి ఉపయోగపడే ద్విచక్ర వాహనాలు ఇవ్వాలని చెప్పారు.ఎజెన్సి ఏరియాలో కల్లుగీత సొసైటీలను పునరుద్ధరించి,సంక్షేమ పథకాలను అక్కడి గీత కార్మికులకు వర్తింప చేయాలన్నారు.రాష్ట్ర బడ్జెట్లో గీత కార్మికుల సంక్షేమానికి 5 వేల కోట్లు కేటాయించి టాడి కార్పొరేషన్ ను సమర్ధవంతంగా నిర్వహించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే సతీమణి ఉమా మాట్లాడుతూ...గీత కార్మికుల సమస్యలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందన్నారు.అనంతరం గోపా డివిజన్ అధ్యక్షులు చిలువేరు సమ్మి గౌడ్ మాట్లాడుతూ..నీరా,తాటి ఈత ఉత్పత్తుల పరిశ్రమలు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నెలకొల్పాలన్నారు.గౌడ యువతీ యువకులకు ఉపాది కల్పించాలని,తాటి ఈత చెట్లు నరికిన వారిపై కఠిన చర్యలు తీసుకునే విదంగా కొత్త చట్టం తీసుకరావాలని తెలిపారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించ చేయాలని మెమో నెం.3347 /డి/2023 ప్రకారం సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై ప్రతిష్టించాలని పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ప్రకటించిన విదంగా జనగాం జిల్లాకు సర్వాయి పాపన్న పేరు పెట్టాలన్నారు. జిల్లా,మండల అధ్యక్షులు యమగాని వెంకన్న, ఉప్పలయ్య మాట్లాడుతూ..ప్రతి సొసైటీకి చెట్ల పెంచడానికి 5 ఎకరాలు ప్రభుత్వ భూమి ఇవ్వాలని ఉన్న 560 జివో అమలు చేయాలని తెలిపారు.టిడిపి ప్రభుత్వ హయాంలో ఇచ్చిన 439 సొసైటీల భూములకు పెన్సింగ్ చేయించాలని డిమాండ్ చేశారు.అనంతరం మాజీ ఎమ్మెల్సీ సావిత్ర మాట్లాడుతూ. .తాటి,ఈత,జీనుగు, ఖర్జూర తదితర కల్లునిచ్చే పొట్టి చెట్లు నాటాలని తెలిపారు.కల్లుగీత కార్పోరేషన్ నుండి వృత్తిలో చనిపోయిన వారి కుటుంబాలకు ఇస్తున్న తక్షణ సహాయం పెంచాలన్నారు.దహన సంస్కారాల కొరకు 50 వేల రూపాయలు,గాయాలైన వారికి వైద్య ఖర్చుల కొరకు 25 వేల రూపాయల ఇవ్వాలని తెలిపారు.అనంతరం కల్లు గీత కార్మిక సంఘం 2024 క్యాలెండర్ ఆవిష్కరణ చేశారు.ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ దీకొండ వెంకన్న,గంధసిరి స్వరూప సోమన్న,కదిర ప్రవంతి ప్రకాష్,సమ్మెట వెంకన్న,గోపా మండల అధ్యక్షులు కూటికంటి మధు,పిఎసిఎస్ మాజీ చైర్మేన్లు బండారు వెంకన్న,గడ్డం యాకమూర్తి, గోపా జిల్లా సలహదారులు మోడెమ్ రవీందర్,గోపా జిల్లా ఉపాధ్యక్షులు చిర్ర యాకంతం గౌడ్,చీకటి వేలాద్రి మాజీ సర్పంచులు బండారు గోపమ్మ దయాకర్,గందసరి వెంకన్న మాచర్ల ప్రసాద్, వీరితోపాటు అన్ని గ్రామాల సొసైటీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు..

# ఫర్టీలైజర్, పెష్టిసైడ్ దుకాణంలను తనిఖీ చేసిన వ్యవసాయ అధికారి

- తనిఖీ చేసిన మండల వ్యవసాయ అధికారి వంశీ కృష్ణ



చొప్పదండి /కరీంనగర్, జనవరి 23(అక్షరం న్యూస్ )

చొప్పదండి పట్టణంలోని ఫర్టీలైజర్స్, పెష్టిసైడ్ దుకాణాలను చొప్పదండి మండల వ్యవసాయ అధికారి వంశీకృష్ణ తనిఖీ చేసారు.యూరియా, కాంప్లెక్స్ ఎరువులు స్టాక్స్ ఫెర్టిలిజెర్ షాపులో ని ఈ పోస్ మెషీన్, ఎరువుల బస్తాల నిల్వలు సమానంగా ఉండేలా తనిఖీ చేశారు.

# విద్యార్థులు వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలి

- ప్రకృతి వ్యవసాయంతో పోషక విలువలు కలిగిన పంటలు
- జాతీయ ఉత్తమ రైతు మల్లికార్జున్ రెడ్డి



చొప్పదండి /కరీంనగర్,జనవరి 23 (అక్షరం న్యూస్ )

నేటి నవీన నాగరికత యుగములో ప్రతి విద్యార్థి వ్యవసాయంపై అవగాహన కలిగి ఉండాలని జాతీయస్థాయి ఉత్తమ రైతు అవార్డు గ్రహీత మల్లికార్జున్ రెడ్డి అన్నారు.ఈ మేరకు చొప్పదండి పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల కళాశాలలో పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులు వ్యవసాయం అనే అంశంపై నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు.ప్రతి ఒక్కరు ఉద్యోగ రంగంలో స్థిరపడాలని వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు ప్రతి విద్యార్థి వ్యవసాయ రంగంపై అవగాహన కలిగి ఉంటే మంచి పంటలను పండించవచ్చని అన్నారు.రసాయనిక ఎరువుల బదలు సేంద్రియ ఎరువులను వాడితే పంటల దిగుబడి రావడంతో పాటు పోషక విలువలు కలిగిన పంటలు వస్తాయని అన్నారు.ప్రతి రైతు భూసార పరీక్షలను చేసుకున్న తర్వాతనే పంటలను వేయాలని సూచించారు.వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించేవారు తగ్గుతున్నారని నేటితనం విద్యార్థులు వ్యవసాయంపై మక్కువ చూపితే ఆహార పంటలను పండించి లాభాలను గడించవచ్చని అన్నారు.ఆహార పద్ధతులు నేడున్న పరిస్థితులలో మారుతున్నాయని అన్నారు. చిరుధాన్యాలను పండించాలని సూచించారు చిరుధాన్యాలతో జావ చేసి విద్యార్థులకు అందిస్తే మంచి పోషక విలువలు ఉంటాయని అన్నారు.తాను సాఫ్ట్వేర్ రంగంలో 2003 నుండి 2014 వరకు సేవలను అందించానని ఆ తర్వాత ప్రకృతి వ్యవసాయం చేయాలని సంకల్పంతో 2014 నుండి వ్యవసాయం చేశానని అన్నారు.ఈ నేపథ్యంలో తాను చేసిన వ్యవసాయ పద్ధతులకు కేంద్ర ప్రభుత్వం గుర్తింపునిచ్చి జాతీయస్థాయి ఉత్తమ రైతుగా ఎంపిక చేసిందని అన్నారు.ఇప్పటివరకు వ్యవసాయ రంగంలో 20 అవార్డులను అందుకున్నానని విద్యార్థులకు సూచించారు.ఇక్కడ గురుకుల కళాశాలలో నేర్చుకున్న వ్యవసాయ విషయాలను విద్యార్థులు వారి తల్లిదండ్రులతో పరిచయం చేసుకుంటే బాగుంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో గురుకుల ప్రిన్సిపాల్ ఎల్ స్వాతి,వైస్ ప్రిన్సిపాల్ అలివేలు,ఉపాధ్యాయ బృందం పేరెంట్స్ కమిటీ చైర్మన్ ప్రధాన కార్యదర్శి ఎస్ వెంకటేష్, కోశాధికారి బి శంకర్,నాయకులు అజయ్ కుమార్, శంకర్ రెడ్డి, సదానందం తదితరులు పాల్గొన్నారు

# హర్కర వేణుగోపాల్ రావుకు అరుదైన గౌరవం

- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియామకం.
- క్యాబినెట్ హెూదా రావడంతో రామగుండం నియోజకవర్గం లోని ప్రజల్లో ఆనందం.



గోదావరిఖని ప్రతినిధి /పెద్దపల్లి/ జనవరి 23/అక్షరం న్యూస్:

రామగుండం నియోజకవర్గం లోని ఆబాది రామగుండం ప్రాంతానికి చెందిన హర్కరా వేణుగోపాలరావుకు అరుదైన గౌరవం దక్కింది. కాంగ్రెస్ అధిష్టానం ఆయన చేసిన సేవలను గుర్తించి క్యాబినెట్ హెూదాను కల్పిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారుగా నియమించడం పట్ల నియోజకవర్గంలోని ప్రజలు ఆనందోత్సవాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.రామగుండం పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త హర్కర వేణుగోపాలరావు కాంగ్రెస్ పార్టీలో నాలుగు దశాబ్దాలుగా క్రియాశీల పాత్ర పోషిస్తూ తనదైన శైలిలో అధిష్టానం మెప్పుపొందుతూ అభ్యర్థుల గెలుపుల విషయంలో ఆచితూచి అడుగు వేస్తూ తనదైన మార్కు ను అధిష్టానం దగ్గర మెప్పు పొందారు.ప్రస్తుతం పీసీసీ వైస్ ప్రెసిడెంట్ గా రాష్ట్ర ప్రోటోకాల్ కన్వీనర్ గా కొనసాగారు.తాజాగా కాంగ్రెస్ అధిష్టానం కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం ముఖ్య సలహాదారుగా క్యాబినెట్ హెూదాను కల్పిస్తూ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేస్తూ నియమించింది.

వేణుగోపాలరావు తండ్రి దివంగత సత్యనారాయణ రావు మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నరసింహారావు కు ఆప్తమిత్రుడు ఆ సమయంలోనే సత్యనారాయణ రావు,అలియాస్ సత్యనారాయణ పంతులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల్లో క్రియాశ్రీలక పాత్ర పోషించారు. హర్కర సత్యనారాయణ రావు మైతిలిబాయి దంపతులకు ఐదుగురు మగ సంతానంలో మూడో వ్యక్తి వేణుగోపాలరావు. ఆయన భార్య రాధా మాధవి లకు ఇద్దరు పిల్లలు కూతురు పేరు రిషిత,కుమారుడి పేరు వీరిశంక,అతని అన్నలు హర్కర రామారావు రిటైర్డ్ ఏజీఎం ఎన్టిపిసి హెచ్ఆర్, శ్రీనివాసరావు ప్రముఖ హైకోర్టు అడ్వకేట్,అక్క స్వరాజ లక్ష్మి యూఎస్ఏ,తమ్ముళ్లు ప్రసాద్ రావు యూఎస్ఏ, మాధవరావు యూఎస్ఏ ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారు కుటుంబం.వేణుగోపాలరావు చిన్ననాటి నుండే కాంగ్రెస్ వాదిగా కాంగ్రెస్ పార్టీలో నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతూ అంచలంచలుగా ఎదుగుతూ ఏఐసిసి కార్యదర్శిగా టి పి సి సి ప్రోటోకాల్ చైర్మన్గా కర్ణాటక ఎన్నికల్లో పరిశీలకుని ప్రభుత్వ విప్పుగా లోక్ సభ వ్యవహారాలలో ఉన్నత పదవిలో కొనసాగిన వేణుగోపాలరావుకు ముఖ్యమంత్రి ప్రభుత్వ ముఖ్య సలహాదారుగా ఉత్తర్వులను జారీ చేస్తూ నియమించడం పట్ల రామగుండం నియోజకవర్గంలో ప్రజానీకం హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నాయి.హర్కర వేణు గోపాలరావుకు అత్యంత సన్నిహితుడు వాజిద్ ఖాన్ వేణుగోపాల్ రావు ప్రభుత్వ సలహాదారు నియామకం పట్ల రామగుండం హైదరాబాద్ కరీంనగర్ ప్రాంతాల్లో బాణాసంచా పేలుస్తూ అందరికి స్వీట్లు పంపిణీ చేసి ఆనందోత్సవాల మధ్య ఘనంగా సంబరాలు నిర్వహించారు.రామగుండం ప్రాంతానికి చెందిన వేణుగోపాలరావు ప్రభుత్వ సలహాదారుగా నియామకం పట్ల అన్ని వర్గాలు ఆనందాలు వ్యక్తం చేస్తున్నాయి.

# ఫిబ్రవరి 16న నిర్మాణ రంగ కార్మికుల దేశవ్యాప్త సమ్మె



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ కొత్తగూడెం/ జనవరి 23/ అక్షరం న్యూస్ :**

ఫిబ్రవరి 16వ తేదీన కేంద్ర కార్మిక సంఘాల పిలుపుమేరకు దేశవ్యాప్తంగా జరుగుతున్న నిర్మాణ రంగ కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కనస్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ సిఐటియు జిల్లా కార్యదర్శి ఉప్పుతల నరసింహారావు మంగళవారం పిలుపునిచ్చారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు కే బ్రహ్మాచారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో నరసింహారావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 1996 నిర్మాణ రంగ కార్మికుల చట్టాన్ని రద్దుచేసి నిర్మాణరంగ కార్మికులకు తీవ్ర నష్టం కలిగిస్తుందని విమర్శించారు. కార్మిక చట్టాల రద్దు వల్ల కార్పొరేట్లకు పెట్టుబడిదారులకు లాభాలు సమకూర్చటం కోసం కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్మిక సంక్షేమంపై కార్మిక హక్కులపై దాడి చేస్తుందని విమర్శించారు. కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా కార్మిక సమ్మె గ్రామీణ భారత్ బంద్ జరుగుతుందని తెలిపారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్మికులు కర్షకుల హక్కుల పైన చేస్తున్న దాడి దేశ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం చేస్తుందని పేర్కొన్నారు. దేశంలో వ్యవసాయ రంగం తర్వాత అత్యధిక మందికి ఉపాధి కల్పిస్తున్న నిర్మాణ రంగానికి తగిన సహకారాన్ని కేంద్ర ప్రభుత్వం ఇవ్వడం లేదని పేర్కొన్నారు. నిర్మాణరంగ కార్మికుల్లో సంక్షేమ పథకాల అమలుకు ఏర్పాటు చేయబడిన సంక్షేమ బోర్డులను కేంద్ర బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని సిఐటియు పేర్కొన్నది. 1996 కేంద్ర చట్టాన్ని రక్షించుకోవాల్సిన అవసరం నిర్మాణంగా కార్మికులపై ఉందని గుర్తు చేశారు. రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరల చట్టం చేయాలని ఉపాధి హామీ కూలీలకు 200 రోజుల పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ బోర్డు ద్వారా మోటార్ సైకిల్ పంపిణీ చేపడతామని వాగ్దానం చేసి అమలు చేయలేదని నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం అయినా మోటారు సైకిళ్ళు పంపిణీ పథకాన్ని ప్రారంభించాలని సిఐటియు డిమాండ్ చేసింది. వెల్ఫేర్ బోర్డులో ఉన్న డబ్బును కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు పెట్టాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 16వ తేదీన అన్ని మండల కేంద్రాల్లో పెద్ద ఎత్తున సంస్థలు పాల్గొనాలాన్నారు. నిర్మాణరంగ కార్మికులు పని కేంద్రాలతో పాటు నివాస ప్రాంతాల్లో సైతం కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఇంటింటి ప్రచారం నిర్వహించాలని పిలుపునచ్చారు. సమావేశంలో తెలంగాణ బిల్డింగ్, అధర్ కనస్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ సిఐటియు నాయకులు గుర్రం.రాములు అశోక్, కృష్ణయ్య, ఉపేందర్, మురళి తదితరులు పాల్గొన్నారు.


# ట్రాఫిక్ నియమాలపై విద్యార్థులకు అవగాహన



రాజన్న సిరిసిల్ల/ స్టాపర్/ జనవరి -22 (అక్షరం న్యూస్):

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబికా నగర్ లో గల శ్రీ శబరి విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ స్కూల్ విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ట్రాఫిక్ ఎస్ఐ సముద్రాల రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్, రోడ్డు భద్రత సూచనలు ఎలా పాటించాలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎల్ల శ్రీనివాస్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులు కలిగించే విధంగా రోడ్లపై పుట్టినరోజు వేడుకలు జరుపుకుంటే కఠిన చర్యలు :



**డిఎస్పీ రెహమాన్...**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ కొత్తగూడెం/ జనవరి 23/ అక్షరం న్యూస్: కొత్తగూడెం సబ్ డివిజన్ పరిధిలోని ప్రజలు,యువత ఎవరైనా సరే సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులు కలిగే విధంగా రోడ్లపై పుట్టిన రోజు వేడుకలు జరుపుకుంటే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకొని బడతాయని కొత్తగూడెం డిఎస్పి రెహమాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. వాహనదారులకు ఇబ్బందులు కలిగించే విధంగా రోడ్లకు అడ్డంగా, డివైడర్లపై పుట్టినరోజులు, యూత్ ల పేరుతొ ప్లెక్సీలు ఏర్పాటు చేసిన వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పోలీస్ శాఖ ఈ చర్యలు చేపడుతుందని వెల్లడించారు.

# ఆగి ఉన్న ట్రాక్టర్ను ఢీకొని యువకుడు మృతి

రాజన్న సిరిసిల్ల/గంభీరావుపేట/జనవరి 23 (అక్షరం న్యూస్) గంభీరావుపేట మండలం లక్ష్మి పూర్ తండా కు చెందిన రాములు కుమారుడు ధరావత్ నవీన్ స్థానికంగా ఉంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. సోమవారం రాత్రి గొల్లపల్లి నుండి వస్తుండగా మార్గ మధ్యలో లక్ష్మి పూర్ కు రాగానే కుక్కలు వెంబడించడంతో ప్రమాధవశాత్తు బైక్ అదుపుతప్పి ఆగి ఉన్న గ్రామపంచాయతీ వాటర్ ట్యాంకర్ ని ఢీ కొట్టగా అధిక గాయాలవ్వడంతో చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తీసుకుంటుండగా మార్గమధ్యలో మృతి వాతపడ్డాడు.సమాచారం అందుకున్న పోలీసుల వివరాలు సేకరించి మృతదేహం పోస్ట్ మార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



# ఫలించబోతున్న షాడో కౌన్సిలర్ల వ్యూహం...?

- **కొత్తగూడెం మున్సిపల్ చైర్ పర్సన్ పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన 22మంది కౌన్సిలర్లు**
- **ప్రభుత్వం మారినా వెంటనే మారుతున్న సమీకరణాలు**

భద్రాద్రి జిల్లా /కొత్తగూడెం/ జనవరి. 23/ అక్షరం టౌన్ న్యూస్

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి వేగంగా మారుతున్న రాజకీయ సమీకరణాలు .కొత్తగూడెం సంత టెండర్ల నుంచి ప్రారంభమైన గొడవ గతంలో అవిశ్వాస తీర్మానానికి దారి తీసింది. అంతే కాకుండా గతంలో జరిగిన పెద్ద గొడవ కూడా నియోజవర్గంలో చర్చనీయాంశంగా మారింది. గొడవల కారణంగా గతంలో కూడా మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి పై ఏడుగురు కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానానికి దారులు వేతకడంతో మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు కలుగ జేసుకుని పరిస్థితి ని శాంతిపజేశారు. కొత్తగూడెం పట్టణంలో 2018లో జరిగిన శాసనసభ ఎన్నికల అనంతరం జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లోనూ టీఆర్ఎస్ హవా నడిచింది. అయితే ఎమ్మెల్యే వనమా వెంట మొదట్నుంచీ ఉన్న నాయకులకు చైర్ పర్సన్ పదవి ఇవ్వాలని కొంత మంది స్థానిక నాయకులు సూచించినా ,అప్పటికే చైర్ పర్సన్ గా కాపు సీతాలక్ష్మి పేరు అగ్ర నాయకుల నుంచి ఆదేశాలు రావడంతో అప్పటికే చైర్ పర్సన్ పీఠాన్ని ఆశించిన ఒకరిద్దరికి నిరాశే ఎదురైంది. టిఆర్ ఎస్ గెలుపుకు సింగరేణి కార్మిక సంఘం లో కీలక పాత్ర పోషించిన కాపు కృష్ణ భార్య కాపు సీతాలక్ష్మి కి అవకాశం దక్కింది. ఎవరి వాదనలు ఎలా ఉన్నా మున్సిపాలిటీలో షాడో కౌన్సిలర్ల అసంతృప్తి ,అభివృద్ధి పనుల కేటాయింపు, పంపకాల్లో తేడా రావడం ప్రధాన కారణంగా తెలుస్తోంది. దీనికి తోడు కౌన్సిలర్లను పట్టించుకోకపోవడం, ఒంటెద్దు



నిర్ణయాలతోనే తీవ్ర అసంతృప్తికి గురవుతున్నట్లు గతంలో బాహాటంగానే కౌన్సిలర్లు చర్చించడం తెలిసిందే. ఇప్పటికే రెండు సార్లు బీఆర్ఎస్ కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టాలని చర్చలు చేసిన మాజీ ఎమ్మెల్యే చొరవ తీసుకుని సద్దుమణిగేలా చేయడం జరిగింది. కానీ డిసెంబర్ లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో బీఆర్ ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వనమా ఓటమి పాలు కావడం బీఆర్ఎస్ క్యాడర్ కి మింగుడు పడని విధంగా మారింది. ఈ నేపథ్యంలో అప్పటి వరకు చాపకింద నీరులా ఉన్న అసంతృప్తి కౌన్సిలర్లు ఒక్కసారిగా బాహాటంగా చైర్ పర్సన్ పై అవిశ్వాస తీర్మానం చేయాలని ఒక్కటయ్యారు. ఇదిలా ఉండగా సొంత పార్టీ చైర్ పర్సన్ పై కొంతమంది షాడో కౌన్సిలర్ల వ్యూహం ఫలించిందని పలువురు రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

### కొత్తగూడెం మున్సిపాలిటీ చైర్ పర్సన్ పై కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం

భద్రాద్రి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అవిశ్వాస తీర్మాన పత్రాన్ని స్థానిక కౌన్సిలర్లు కలెక్టర్ కు అందజేశారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన 22 మంది కౌన్సిలర్లు చైర్ పర్సన్ కి వ్యతిరేకంగా తీర్మానం చేశారు. లేఖలో మున్సిపాలిటీ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి విశ్వాసం కోల్పోవడంతో అవిశ్వాస తీర్మానానికి మొగ్గు చూపినట్టు స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే కొత్తగూడెం మున్సిపాలిటీ చైర్ పర్సన్ పై అవిశ్వాస తీర్మానం పెట్టాలని కలెక్టర్ ని కలిసి సంతకాలతో కూడిన అవిశ్వాస పత్రాన్ని కలెక్టర్ కు అందించారు. ఇదిలా ఉండగా కొత్తగూడెం మున్సిపల్ చైర్ పర్సన్ పీఠం ఎవరికి దక్కుతుందో నని అంత టెన్షన్ వాతావరణం నెలకొంది. ఇక అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు కానీ చైర్ పర్సన్ పీఠం కోసం వాళ్లకు వాళ్లే విబేధాలు సృష్టించుకుంటారని పలువురు రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

## తమ్మినేనిని పరామర్శించిన ఎంపీ వద్దిరాజు..



ఖమ్మం/ తల్లాడ జనవరి 23 (అక్షరంన్యూస్)

హైదరాబాద్ గచ్చిబౌలి లోని ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంను రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర పరామర్శించారు తమ్మినేని ఇటీవల అనారోగ్యానికి గురయ్యి ఏఐజీ ఆస్పత్రిలో చేరిన విషయం తెలిసిందే .. ఎంపీ రవిచంద్ర మంగళవారం రాత్రి ఏఐజీ ఆస్పత్రికి వెళ్ళి తమ్మినేని ని పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు, వైద్యులతో మాట్లాడి ఆయన ఆరోగ్య పరిస్థితిని గురించి తెలుసుకున్నారు.

## వట్టినాగులపల్లిలో రోడ్డు సమస్యకు పరిష్కారం చూపడంతో ఆనందం వ్యక్తం చేసిన స్థానికులు




రంగారెడ్డి / రాజేంద్రనగర్ / గండిపేట్ / జనవరి 23/ అక్షరం న్యూస్ : గత కొన్ని సంవత్సరాల నుంచి రోడ్డు కోసం ఎన్నో ఇబ్బందులు పడ్డం అన్ని రోడ్డు సమస్య పరిష్కారం కావడంతో ఇబ్బందులు కాస్త తొలగిపోయే కాలం ఆసన్నమైందన్నారు. సమస్య పరిష్కారం కావడంతో తమకు ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. అందులో భాగంగా వట్టినాగులపల్లి గ్రామ ప్రజలు చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, లకు వట్టినాగులపల్లిలో రోడ్డు వేయడం తో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇకపై తమకు రోడ్డు సమస్యలు ఉండవని తెలుపుతున్నారు. ఈ మేరకు ప్రజా ప్రతినిధులు ఎంతో చొరవ చూపారని తెలిపారు.ఈ కార్యక్రమంలో వట్టినాగులపల్లి కంటెస్టెడ్ కౌన్సిలర్ విష్ణువర్ధన్, రాజు, బక్కని సాయి, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## మణికొండ మున్సిపల్ బడ్జెట్‌పై రివ్యూ సమాశం నిర్వహించిన అదనపు కలెక్టర్ ప్రతిమసింగ్



రంగారెడ్డి / రాజేంద్రనగర్ / గండిపేట్ / జనవరి 23/ అక్షరం న్యూస్ : మణికొండ పురపాలక సంఘ కార్యాలయంలో అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ బడ్జెట్ రివ్యూ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా అంచనా బడ్జెట్ లో పద్దుల వారీగా పరిశీలించారు. అదేవిధంగా కమిషనర్‌కు పలు సూచనలు జారీ చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.ఫాల్గుణ్ కుమార్, డీఈ దివ్య జ్యోతి, మేనేజర్ బీఎన్‌కే రమేష్ , టీపీఎస్ మణిహారిక, జేఏఓ వీరాస్వామి, ఈఈ సంపత్ హాజరయ్యారు.

## అయోధ్య శ్రీరాముని దర్శించుకున్న గండిపేట్ మండల్ బీజేపీ నాయకులు



రంగారెడ్డి / రాజేంద్రనగర్ / గండిపేట్ / జనవరి 23/ అక్షరం న్యూస్ : 500 సంవత్సరాలుగా పోరాడి విజయం సాధించిన అయోధ్య రామ మందిరం నిర్మాణ విగ్రహ ప్రతిష్టాపనకు షేక్‌పేట్, గండిపేట్ మండల నాయకులు వినేష్ బాబు, దీపక్, శశాంక్, శివరాజ్, శివకుమార్, సుమిత్ సింగ్ ఉప్పల్ స్వామి మహేందర్ తదితరులు పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకున్నారు.

## హైకోర్టును ఆశ్రయించిన మార్కెట్ పాలకవర్గ కమిటీ సభ్యులు...



మహబూబాబాద్/కేసముద్రం/జనవరి 23/అక్షరం న్యూస్:-తమ పదవీకాలం పూర్తి కాకముందే నూతన ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్ పాలక వర్గాన్ని రద్దు చేయడం పట్ల కేసముద్రం వ్యవసాయ మార్కెట్ పాలకవర్గ కమిటీ సభ్యులు మంగళవారం నాడు హైకోర్టుని ఆశ్రయించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీని రద్దు చేయడం సరైన పద్ధతి కాదన్నారు.తమ పదవీ కాలం మరో రెండు సంవత్సరాలు ఉండగనే రద్దు చేయడం తగదన్నారు.దీంతో తాము హైకోర్టును ఆశ్రయించామని తమకు అనుకూలంగానే న్యాయం జరుగుతుందని ఈ సందర్భంగా వారు ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కేసముద్రం వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్లు జాటోత్ హరినాయక్,కూన బద్రాద్రి తదితరులు పాల్గొన్నారు...

# గెలుపు కోసం కష్టపడ్డ కార్యకర్తలకు అండగా ఉంటా : ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



రంగారెడ్డి / రాజేంద్రనగర్ / గండిపేట్ / జనవరి 23/ అక్షరం న్యూస్ : రాజేంద్రనగర్ నియోజకవర్గంలో టి ప్రకాష్ గౌడ్ నాల్గవ సారి ఎమ్మెల్యేగా ఎన్నిక కావడం సంతోషంగా ఉందని రంగారెడ్డి జిల్లా టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పడమటి శ్రీధర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం కుల్కల్ మైసమ్మ దేవాలయంలో అన్నదాన కార్యక్రమము చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఉండాలని గెలుపు కోసం కష్టపడ్డ కార్యకర్తలకు ఎప్పుడు అండగా ఉంటానని ఎప్పుడు ఏ అవసరం వచ్చినా తాను ఉంటానని తెలిపారు. కార్యకర్తలకు మనోధైర్యాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అర్చన జయప్రకాష్, సీనియర్ నాయకులు కేజీవన్ దాస్, ఎం ప్రభాకర్ రెడ్డి, ఎస్ సత్యనారాయణ రెడ్డి, కే రాజశేఖర్ రెడ్డి, రామకృష్ణ, మోహన్ రావు, బి శ్రీధర్ రెడ్డి, ఎస్ శ్రీధర్ రెడ్డి, కే వెంకట్ రెడ్డి, ఎస్ వెంకట్ రెడ్డి, వినోద్ గౌడ్, శ్రీధర్ గౌడ్, ధర్మారెడ్డి, బి కుమార్, నర్సింగరావు, మాచర్ల సత్యనారాయణ గౌడ్, డి రమేష్, ఆనంద్, నాగని సురేష్, బుట్ట కరుణాకర్, విజయ్ కుమార్, పిట్టల వినోద్, పి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సుభాష్‌చంద్రబోస్ జయంతి



రంగారెడ్డి / రాజేంద్రనగర్ / గండిపేట్ / జనవరి 23/ అక్షరం న్యూస్ : నేతాజీ సుభాష్ చంద్రబోస్ జీవిత చరిత్రను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని నవ యువ యూత్ క్లబ్ అద్యక్షుడు ఏర్వ కుమార స్వామి పేర్కొన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బాబుల్‌రెడ్డి నగర్ నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను నవ యువ యూత్ క్లబ్ ఆద్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రమేష్ రెడ్డి, క్లబ్ సభ్యులు మురళి, యువకులు పాల్గొన్నారు.

## వేం నరేందర్ రెడ్డిని కలిసిన కేసముద్రం మండల కాంగ్రెస్ నాయకులు...



మహబూబాబాద్/కేసముద్రం/జనవరి 23/అక్షరం న్యూస్:-మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్ రెడ్డిని తన స్వగృహంలో కేసముద్రం కాంగ్రెస్ మండల నాయకులు మంగళవారం నాడు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.ఈ సందర్భంగా వేం నరేందర్ రెడ్డి ప్రభుత్వ సలహాదారుడిగా నియామకం కావడం పట్ల కాంగ్రెస్ మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.అనంతరం వేం నరేందర్ రెడ్డిని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డిసిసి వైస్ ప్రెసిడెంట్ అంబటి మహేందర్ రెడ్డి,ఇనుగుర్తి కాంగ్రెస్ మండల అధ్యక్షులు కురెళ్ళి సతీష్,మండల యువజన నాయకులు తరాల వీరేష్ యాదవ్,చందు,యాకూబ్ తదితరులు పాల్గొన్నారు...

## లక్ష్మమ్మ దేవాలయంలో స్వచ్ఛ తీర్థం క్యాంపెయిన్‌కు ఏర్పాట్లు పూర్తి : కౌన్సిలర్ ఉషారాణి



రంగారెడ్డి / రాజేంద్రనగర్ / గండిపేట్ / జనవరి 23/ అక్షరం న్యూస్ : నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని 17 వ వార్డులో లక్ష్మమ్మ దేవాలయంలో స్వచ్ఛ తీర్థం క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పారిశుధ్య కార్మికులతో శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ఉషారాణి మాట్లాడుతూ ప్రజలందరూ తమ చుట్టూ ఉన్న దేవాలయాలలో పరిశుభ్రత కొరకు సహకరించాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛ తీర్థం కార్యక్రమం విజయవంతం చేయడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ జనార్దన్ రెడ్డి, శ్రీకాంత్, రాజేష్ పారిశుద్ధ కార్మికులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఓట్లకు అర్హులైన పట్టభద్రులు దరఖాస్తులు చేసుకోవాలి...



- తల్లాడ తహాశీల్దార్ రవికుమార్

**ఖమ్మం/ తల్లాడ జనవరి 23 (అక్షరంన్యూస్):** ఖమ్మం, నల్గొండ, వరంగల్ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో ఓట్లకు మండలంలో అర్హులైన పట్టభద్రులందరు దరఖాస్తులు చేసుకోవాలని తల్లాడ తహాశీల్దార్ వి. రవికుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన తల్లాడలో మాట్లాడుతూ నవంబర్ 1, 2020 సంవత్సరానికి ముందు డిగ్రీ పాసైన ప్రతి ఒక్కరు ఓటుకు నమోదు చేసుకోవాలన్నారు. గతంలో ఓటు హక్కు ఉన్నప్పటికీ ఈసారి కొత్తగా ఆన్లైన్ చేసుకోవాలన్నారు. స్థానికంగా ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు ఆధార్ కార్డు, డిగ్రీ సర్టిఫికెట్, ఫోటో జత చేసి ఆన్లైన్ లేదా తహాశీల్దార్ కార్యాలయంలో అందించాలని సూచించారు. ఫిబ్రవరి 6వ తేదీ లోపు చివరి తేదీ అని, ఈలోగా ఆన్ లైన్ చేసుకోవాలన్నారు. మండల వ్యాప్తంగా సుమారు 2700 మంది పట్టభద్రులు ఉంటారని వెల్లడించారు. తల్లాడ మండలంలో రెండు పోలింగ్ కేంద్రాలు ఉంటాయన్నారు. ప్రతి ఒక్క పట్టభద్రుడు ఈలోగా ఆన్ లైన్ నమోదు చేసుకొని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## పరామర్శ..



**రాజన్న సిరిసిల్ల / ముస్తాబాద్/జనవరి-23(అక్షరం న్యూస్):** ముస్తా బాద్ మండలం బంధనకల్ గ్రామంలో మాజీ ఏఎంసీ డైరెక్టర్ చిగురు నరేష్ తండ్రి చిగురు రాములు 4 రోజుల క్రితం మృతి చెందడంతో వారి కుటుంబాన్ని జిల్లా బీ ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు తోట అగయ్య మాజీ రైతుబంధు అధ్యక్షులు కల్వకుంట్ల గోపాల్ రావు లు పరామర్శించారు వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వీరి తో పాటు బీ ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు భోంపెల్లి సురేందర్ రావు మాజీ సెస్ డైరెక్టర్ కొమ్ము బాలయ్య ముస్తాబాద్ బీ ఆర్ ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎద్దండి నర్సింహారెడ్డి , ఉప సర్పంచ్ కార్తీక్ రెడ్డి,వార్డు మెంబర్ కొమ్మట వెంకటయ్య , బీ ఆర్ ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు నర్సింలు, గుర్రం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామునికి బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రత్యేక పూజలు...



**ఖమ్మం/ వైరా జనవరి 23 (అక్షరంన్యూస్):** అయోధ్య బాల రాముడు విగ్రహ ప్రతిష్ట మహోత్సవ సందర్భంగా సోమవారం వైరా కూరగాయల మార్కెట్ లో కారుకొండ బోసు ఆధ్వర్యంలోశ్రీరాముని మహోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వైరా మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు పెరుగు ప్రసాద్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## మిషన్ భగీరథ నీరు లేక ఇబ్బందులు రోడ్డెక్కిన మహిళలు

**పెద్దపల్లి టౌన్ జనవరి 23 అక్షరం న్యూస్:** మిషన్ భగీరథ మంచి నీళ్లు రావడం లేదని మహిళలు కాలనీవాసులు రోడ్డెక్కిన ఘటన పెద్దపల్లి పట్టణంలోని చీకురాయి రోడ్డు తొమ్మిదో వార్డులో చోటుచేసుకుంది పెద్దపెల్లి జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పరిధిలోని మిషన్ భగీరథ నీళ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని 9వ వార్డులో మంగళవారం రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేశారు పెద్దపల్లి పట్టణంలోని మున్సిపల్ పరిధిలో చైతన్య కాలనీ1 చైతన్య కాలనీ 2 ఇస్లాంపుర కాలనీలో మిషన్ భగీరథ పైప్ లైన్ వేసినప్పటి నుండి ఇంతవరకు నీళ్లు రావడం లేదని రోడ్డెక్కి నిరసన తెలిపారు మున్సిపల్ వార్డు మహిళలు ప్రజలు ఈసందర్భంగా మహిళ మస్తానీ ఎండీ జుబేర్ మాట్లాడుతూ మిషన్ భగీరథ మొదలుకొని ఇప్పటివరకు నీళ్లు రావడంలేదని స్థానిక ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు వార్డు యొక్క సమస్యలు పరిష్కరించాలని కోరిన పట్టించుకోవడం లేదని అన్నారు రానున్న వేసవికాలం దృష్టి సారించి తమ యొక్క వార్డుకు స్వచ్ఛమైన నీరు అందించి సమస్య లేకుండా పరిష్కరించాలని కోరుతూ పెద్దపల్లి మున్సిపల్ శాఖను డిమాండ్ చేశారు ఈ యొక్క కార్యక్రమంలో మస్తానీ భారతమ్మ సాజియా ఫర్జానా కనకమ్మ సయ్యద్ జుబేర్ ఎండి రావుఫ్ ముజ్జు సాగర్ కిరణ్ సత్తయ్య సురేష్ రాజేశం శంకరయ్య తదితరులు పాల్గొన్నారు

## నేడు ఖమ్మంకు ఎంపీ నామ నాగేశ్వరరావు రాక..

- రేపు భద్రాద్రి జిల్లా దిశ కమిటీ సమావేశంలో పాల్గొననున్న ఎంపీ నామ

**ఖమ్మం/ తల్లాడ జనవరి 23 (అక్షరంన్యూస్):** బి.ఆర్.ఎస్ లోక్ సభాపక్ష నాయకులు , ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు బుధవారం నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో విస్తృతంగా పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని ఎంపీ క్యాంప్ కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా ఉదయం 9 గంటల నుంచి ఖమ్మం జూబ్లీపురలోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, నాయకులకు అందుబాటులో ఉంటారు.

**రేవు జరిగే భద్రాద్రి జిల్లా దిశ కమిటీ సమావేశానికి ఎంపీ నామ**

గురువారం జరిగే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దిశ కమిటీ సమావేశంలో కమిటీ చైర్మన్ మాలోత్ కవిత తో కలిసి కమిటీ వైస్ చైర్మన్ అయిన ఎంపీ నామ నాగేశ్వరరావు కూడా పాల్గొని, వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలు తీరుపై శాఖల వారీగా సమీక్షిస్తారు. ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగే ఈ సమావేశానికి నామినేటెడ్ సభ్యులు, ఎంపీపీ లు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు ఆయా శాఖలకు సంబంధించిన సమగ్ర వివరాలతో సకాలంలో సమావేశానికి హాజరు కావాలని ఎంపీ నామ నాగేశ్వరరావు కోరారు.



# బాల కార్మిక వ్యవస్థని పూర్తిగా నిర్మూలించాలి

- అనాధ పిల్లల సంరక్షణ పై ప్రత్యేక ద్రుష్టి సారించాలి
: ఎంపీపీ చిలుక రవీందర్



**చొప్పదండి/ కరీంనగర్,జనవరి 23 (అక్షరం న్యూస్ ):** కరీంనగర్ జిల్లా చొప్పదండి మండల ప్రజా పరిషత్ కార్యాలయం లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సమావేశ మందిరంలో "మండల సమగ్ర బాలల పరిరక్షణ కెమిటి" ఛైర్మెన్ ఎంపీపీచిలుక రవిందర్ అధ్యక్షతన నిర్వహించారు . ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ బాలల యొక్క హక్కులు, రక్షనా, సంరక్షన, ఆధార్ లు, బాల్యవివాహాలు నివారించడం, బాల కార్మిక వ్యవస్థ. ఇటుక బట్టికాలలో పని చేసే వారిని స్కూల్ లో జాయిన్ చేయడం, పిల్లలపై లైంగిక వేధింపులు గాని వారి పట్ల ఏమైనా అగాయిత్యాలు గాని కమిటీ దృష్టికి వచ్చిన ఎడల బాధ్యులపై కఠిన చర్యలు తీసుకో బడును అని హెచ్చరిస్తూ అనాథ పిల్లల సంరక్షణ పై ప్రత్యేక దృష్టి సారించాలి అన్నారు. పిల్లలు బడి బయట కాకుండా బడిలో వుండేలా చొరవ చూపాలని, పోస్కో చట్టం, 1098 టోల్ ఫ్రీ నెంబర్ వాటిపై కమిటీ సభ్యులు అందరు చర్చించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నరేందర్ , ఎంపిడిఓ స్వరూప , సిడిపిఓ కస్తూరి , లేబర్ ఆఫీసర్ నజీర్ , ఎస్ఐ ఉపేంద్ర చారీ , ఐసీడీఎస్ సూపర్వైజర్ రమాదేవి , కమిటీ సభ్యులు ప్రభాకర్ ఆచార్యులు , నరేష్ , సిపిఎస్ మోజేష్ , పాల్ వెల్సన్ పాస్టర్స్, ఎండి ఖాజమియ, ఎస్ఏడీ గోపాల్ రావు, ప్రభాకర్ మణిరులు, ఐసీపీ సౌమ్య సాయికిరణ్,చిల్డ్ లైన్ ఏడబ్ల్యుటిఎస్ హాజరయ్యారు..

# స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ..





**ఖమ్మం/ వైరా జనవరి 23 (అక్షరంన్యూస్):** వైరా మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ చేతుల మీదుగా స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లి త్వరగా పరిష్కారం అయ్యే దిశగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. వైరా శాసనసభ్యులు మాలోత్ రామదాసు నాయక్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి దృష్టికి ఉపాధ్యాయుల సమస్యలను తీసుకొని వెళ్లి త్వరితగతిన పరిష్కరించే దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్టిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్కే. మన్సూర్ మండల అధ్యక్షుడు పెనుగొండ ఉపేంద్ర రావు, కార్యదర్శి చవల ప్రకాశం, జిల్లా బాధ్యులు ఆర్. అచ్యుతు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ దుర్గాప్రసాద్, కాంగ్రెస్ యువజన నాయకులు జవ్వాజి నాగరాజు, జిల్లా కాంగ్రెస్ నాయకులు దాసరి దానియేలు, ఆది ఆనందరావు, శీలం నర్సిరెడ్డి పాల్గొన్నారు.


# మిషన్ భగీరథ నీరు లేక ఇబ్బందులు రోడ్డెక్కిన మహిళలు

**పెద్దపల్లి టౌన్ జనవరి 23 అక్షరం న్యూస్:** మిషన్ భగీరథ మంచి నీళు రావడం లేదని మహిళలు కాలనీవాసులు రోడ్డెక్కిన ఘటన పెద్దపల్లి పట్టణంలోని చీకురాయి రోడ్డు తొమ్మిదో వార్డులో చోటుచేసుకుంది పెద్దపెల్లి జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పరిధిలోని మిషన్ భగీరథ నీళు లేక ఇబ్బందులు పడుతున్నామని 9వ వార్డులో మంగళవారం రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేశారు పెద్దపల్లి పట్టణంలోని మున్సిపల్ పరిధిలో చైతన్య కాలనీ1 చైతన్య కాలనీ 2 ఇస్లాంపుర కాలనీలో మిషన్ భగీరథ పైప్ లైన్ వేసినప్పటి నుండి ఇంతవరకు నీళ్లు రావడం లేదని రోడ్డెక్కి నిరసన తెలిపారు మున్సిపల్ వార్డు మహిళలు ప్రజలు ఈసందర్భంగా మహిళ మస్తానీ ఎండీ జుబేర్ మాట్లాడుతూ మిషన్ భగీరథ మొదలుకొని ఇప్పటివరకు నీళ్లు రావడంలేదని స్థానిక ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు వార్డు యొక్క సమస్యలు పరిష్కరించాలని కోరిన పట్టించుకోవడం లేదని అన్నారు రానున్న వేసవికాలం దృష్టి సారించి తమ యొక్క వార్డుకు స్వచ్ఛమైన నీరు అందించి సమస్య లేకుండా పరిష్కరించాలని కోరుతూ పెద్దపల్లి మున్సిపల్ శాఖను డిమాండ్ చేశారు ఈ యొక్క కార్యక్రమంలో మస్తానీ భారతమ్మ సాజియా ఫర్జానా కనకమ్మ సయ్యద్ జుబేర్ ఎండి రావుఫ్ ముజ్జు సాగర్ కిరణ్ సత్తయ్య సురేష్ రాజేశం శంకరయ్య తదితరులు పాల్గొన్నారు




# నిండు మనస్సుతో "అక్షరాల తోవ"కు ఆర్థిక చేయూత




- సాహితీ కథల పుస్తక ముద్రణకు వైవి ఆర్థిక సహాయం..
- తెలుగు రాష్ట్రాలలో సుప్రసిద్ధ సాహితీ సంస్థగా మన్ననలను అందుకుంటున్న "అక్షరాల తోవ"..

**ఖమ్మం/ తల్లాడ జనవరి 23 (అక్షరంన్యూస్):** తెలుగు రాష్ట్రాలలో సుప్రసిద్ధ సాహితీ సంస్థగా మన్ననలను అందుకుంటున్న "అక్షరాల తోవ" ఆరవ వార్షికోత్సవం సందర్భంగా అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన కథలు, వారం వారం నిర్వహించిన కవితల పోటీలలో ఉత్తమంగా ఎంపికైన కథలు, కవితల పుస్తక ముద్రణకు ప్రముఖ సేవా తత్పరులు, ఉపాధ్యాయులు యలమద్ది వెంకటేశ్వర్లు(వై.వి) ఆర్థిక సాయం అందించారు. అడగగానే సహృదయంతో స్పందించి 15 వేల రూపాయలను చెక్కును మంగళవారం సాహితీ సంస్థ బాధ్యులు నామా పురుషోత్తం, దాసరోజు శ్రీనివాస్, రాచమళ్ళ ఉపేందర్ లకు అందించారు. ఈ సందర్భంగా "అక్షరాల తోవ" బాధ్యులు నామా పురుషోత్తం మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు వైవి దాతృత్వాన్ని అనేకసార్లు విన్నామని, నేడు మాకు చేసిన సహాయంతో స్వయంగా చూశామన్నారు. వారికి సాహిత్యం మీద ఉన్న అభిలాష, ప్రోత్సాహాన్ని తమ సంస్థ ఎన్నటికీ మర్చిపోదన్నారు. వారికి తమ సంస్థతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సాహితీవేత్తలు అందరి తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. అనంతరం వై.వి మాట్లాడుతూ... తాను కథలు, కవితలు రాయలేనని, రాసేవాళ్లంటే ఎనలేని ఇష్టమని అన్నారు. 'అక్షరాల తోవ' చేస్తున్న సాహితీ సేవ గురించి తెలుసుకుని వారు అడగగానే నిండు మనసుతో ఆర్థిక సహాయం చేయాలనిపించి చేయూతని అందించగలిగినందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్సి పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర్ రావు, సయ్యద్ షఫీ, ఉరిమళ్ళ సునంద, పునాటి వెంకటేశ్వర్లు, హెచ్. నారాయణరావు, సోలా శ్రీనివాసరావు, ఉస్మాన్ అలీ, రమేష్, బ్రహ్మం, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## రండి... దీవించండి.

- మంత్రి పొంగులేటి సోదరుని తనయుడి వివాహానికి రేవంత్ రెడ్డి దంపతులకు ఆహ్వానం
- కుటుంబ సమేతంగా ఇంటికి వెళ్లి శుభలేఖ అందజేత



**ఖమ్మం జిల్లా /ఖమ్మం రూరల్ / జనవరి 23 /అక్షరం న్యూస్ :** తెలంగాణ రెవెన్యూ గృహనిర్మాణ సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సోదరుడు ఖమ్మంజిల్లా కాంగ్రెస్ నాయకులు పొంగులేటి ప్రసాద రెడ్డి తనయుడు లోహిత్ రెడ్డి వివాహానికి రిసెప్షన్ కు తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి దంపతులను ఆహ్వానించారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాధురి దంపతులు పొంగులేటి ప్రసాద్ రెడ్డి శ్రీలక్ష్మి దంపతులు కుటుంబ సమేతంగా మంగళవారం సీఎం నివాసానికి వెళ్లి శుభలేఖను అందజేశారు. తప్పకుండా వివాహ వేడుకకు విచ్చేసి నూతన వధూవరులకు ఆశీర్వాదాన్ని అందజేయాలని సీఎం దంపతులను వారు కోరారు.

## పాకాల పూర్తి స్థాయి ఆయకట్టుకు సాగునీరు అందిస్తాం

- ఎమ్మెల్యే దొంతి ఆదేశాలతో ఇరిగేషన్ సి ఈ,ఎస్ ఈ అధికారికంగా వెల్లడి



**వరంగల్ జిల్లా/ నర్సంపేట డివిజన్/ జనవరి 23 అక్షరం న్యూస్:** పాకాల నీటిపారుదల ప్రాజెక్టు కింద గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా 18193 ఎకరాలకు నీటిని సరఫరా చేసేందుకు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి సూచనల మేరకు ప్రతిపాదనలు జరిగినాయి ఇట్టి ప్రతిపాదనల ప్రకారం ఈ యాసంగి కూడా పాకాల ప్రాజెక్టు కింద ఉండబడే ఆయకట్టు మొత్తానికి నీటిని సరఫరా చేయడానికి నిర్ణయించడమైనది ప్రస్తుతం పాకాల ప్రాజెక్టు నందు 1.685 టీఎంసీ నీటి నిల్వ కలదు పూర్తిస్థాయి ఆయకట్టుకు నీటిని అందించడం కొరకై 1.65 టీఎంసీ నీరు అవసరం ఉందని లినర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి తో రాష్ట్ర నీటిపారుదల శాఖ కార్యదర్శి తో దగ్గరుండి చర్చించి అవసరమైన 1.65 టీఎంసీ నీటిని అవసరమైతే నాలుగు మోటార్ల ద్వారా నిరాటంకంగా ఏప్రిల్ వరకు అందిస్తామని ములుగు సి ఈ విజయ భాస్కర్ లిఖిత పూర్వకంగా పేర్కొనగా నర్సంపేట ఎస్ ఈ వెంకటేశ్వర రావు మంగళవారం సాయంత్రం తన కార్యాలయంలో మీడియా ప్రతినిధులకు వెల్లడి చేశారు. పాకాల ఆయకట్టు రైతులందరికీ నీటినందించే కొరకు కృషి చేయడం జరిగింది ఇందులో భాగంగానే ప్రస్తుతం రామప్ప నుండి పాకాల ప్రాజెక్టుకు గత మూడు రోజుల నుండి మూడు మోటార్ల ద్వారా నీటిని ఎత్తిపోయడం జరుగుతుంది పాకాల ఆయకట్టు రైతాంగం ఎలాంటి ఆందోళనలకు అయోమయానికి గురికావొద్దని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో పూర్తి ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని ఎస్ ఈ విశ్వాసం వ్యక్తం చేశారు. విలేకరుల సమావేశంలో దేవాదుల డి ఈ లు రవీందర్ రెడ్డి, యస్వంత్, మాజీ ఎంపీపీ తక్కలపల్లి రవీందర్ రావు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభ కుటుంబాన్ని పరామర్శించిన మందకృష్ణ మాదిగ



**కరీంనగర్/సైదాపూర్,జనవరి23(అక్షరం న్యూస్):** మండలంలోని వెంకటేశ్వరపల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ మాజీ రాష్ట్ర నాయకులు కీర్తిశేషులు బొడిగ గాలన్న మాదిగ అనారోగ్యంతో మరణించిన విషయాన్ని తెలుసుకొని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ మంగళవారం ఉదయం స్వగృహానికి వెళ్లి గాలన్న సతీమణి మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కృష్ణ మాదిగ మాట్లాడుతూ.. గాలన్న మాదిగ దండోరా ఉద్యమంలో మొదటి తరానికి చెందిన నాయకుడని , సైదాపూర్ మండలంలో ప్రతి గ్రామంలో దండోరా ఉద్యమాన్ని నిర్మించి ఉద్యమం లో చురుగ్గా పనిచేసి,అనేక పోరాటాల్లో పాల్గొని ఉద్యమాన్ని కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా విస్తరించడంలో కృషి చేశారని ఆయన మరణం మాదిగ జాతికి తీరనిలోటని ఆయన సేవలను కొనియాడారు. కుటుంబ సభ్యులకు ఎమ్మార్పీఎస్ ఎల్లప్పుడు తోడుగా ఉండి సహకారం అందిస్తుందని,ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయనతో పాటు పరామర్శించిన వారిలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు రుద్రారపు రామచంద్రం,ఇంజ%శీ% వెంకట స్వామి,రేణిగుంట్ల సాగర్, ఎమ్మార్పీఎస్ జిల్లా అద్యక్షుడు బెజ్జంకి అనిల్,ప్రధాన కార్యదర్శి దేవునూరి రవీందర్, ఎమ్మార్పీఎస్ సైదాపూర్ మండల మాజీ అధ్యక్షులు రుద్రారపు రవితేజ,వెంకటేశ్వర పల్లి సర్పంచ్ పద్మజ కోమరయ్య,పెర్కపల్లి గ్రామ సర్పంచ్ బత్తుల కొమరయ్య, ఎంఎస్పి జిల్లా అధ్యక్షుడు తునికి వసంత్,బత్తుల లక్ష్మీనారాయణ,మట్టెల రవీందర్ తదితరులు ఉన్నారు.

## సమాచార హక్కు చట్టం ద్వారా ఈ జి ఎస్ పనుల్లో నాటిన మొక్కలపై దరఖాస్తు



**రాజన్న సిరిసిల్ల/ముస్తాబాద్/జనవరి-23(అక్షరం న్యూస్):** ముస్తాబాద్ మండలం మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పథకం కింద 2019 సంవత్సరం నుండి నేటి వరకు హరితహారంలో నాటిన చెట్లకు పోసిన ట్యాంకర్ ద్వారా పోసిన నీటి ట్రిప్పుల వివరాలతో పాటు ఎఫ్ టి ఓ జిరాక్స్ లు ఇవ్వాలని కాంగ్రెస్ నాయకులు దీటి నర్సింలు స్థానిక ఎంపీడీఓ కార్యలయంలో సమాచార హక్కు చట్టం కింద తెలయ చేయాలని ధరకస్తూ అందచేసారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలకు పోసిన నీటి ట్యాంక్ ట్రిప్పులకు ఎన్ని నిధులు గ్రామ పంచాయతీ కి వచ్చాయి,వాటి తో పాటు వచ్చిన చాలన్ జీరాక్స్ ప్రతులు కోరినట్లు తెలిపారు. అంతే కాకుండా ఈ జి ఎస్ కింద ఎన్ని మొక్కలు నాటారు.ఎన్ని ట్రీ గార్డులు కొనుగోలు చేశారు.ప్రస్తుతం ఉన్న మొక్కల వివరాలు కోరినట్టు తెలిపారు.

## అప్పు అడిగారని అవమానంతో ఆత్మహత్య



**గోదావరిఖని ప్రతినిధి/పెద్దపల్లి/జనవరి 23/అక్షరం న్యూస్:** జంగా మనమ్మ భర్త భాస్కర్ రెడ్డి 39 సంవత్సరాలు కులము రెడ్డి తిలక్ నగర్ గోదావరిఖని అనునామే తన చిన్న కూతురు జంగా అపర్ణ వివాహ సమయంలో రూపాయలు 10 లక్షలు లను కొమురయ్య గౌతమి నగర్ అన్న అతని దగ్గర అప్పుగా తీసుకొని అప్పటినుండి ప్రతినెల డబ్బులు వడ్డీ రూపం లో చెల్లించుచున్నది.విషయం గురించి తేదీ 22 1 2024 రోజున ఉదయం 9 గంటల 30 నిమిషాల ప్రాంతంలో కొమురయ్య,అతని కుటుంబ సభ్యులు వచ్చి మొత్తం డబ్బులు కావాలని అడగగా కొద్ది రోజులలో ఇస్తానని చెప్పింది దాంతో వారు వెళ్లిపోయారు.అనంతరం డబ్బుల గురించి జరిగిన గొడవను మనసులో పెట్టుకొని ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగి ఆత్మహత్య ప్రయత్నం చేయగా వెంటనే చికిత్స గురించి గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆసుపత్రిలో చనిపోయిందని మృతురాలి పెద్ద కూతురు జంగా అశ్విత భర్త శశాంక్ 21 సంవత్సరంలో ఎస్సీ మాదిగ గృహిణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించడం జరిగిందని గోదావరిఖని వన్ టౌన్ ఎస్ఐ ఆర్ స్వామి తెలిపారు.

# ఆడపిల్లలను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది..





- జిల్లా కలెక్టర్ వి.పి గౌతమ్

**ఖమ్మం /తల్లాడ జనవరి 23 (అక్షరంన్యూస్):** ఆడపిల్లలను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. ఈ నెల 24న జాతీయ బాలికా దినోత్సవం పురస్కరించుకుని వైద్య ఆరోగ్య, స్త్రీ శిశు సంక్షేమ శాఖల అధికారులతో నూతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శిశు మరణాలు తగ్గించడానికి చట్టాలు పటిష్టంగా అమలుచేయాలన్నారు. జిల్లాలో నమోదైన గర్భిణులలో ఏప్రిల్, 2023 నుండి ఇప్పటి వరకు ఒక అమ్మాయి ఉన్న గర్భిణులు 519 మంది, ఇద్దరు అమ్మాయిలు ఉన్న గర్భిణులు 123 మందికి ఆబార్షన్ లు అయినట్లు, ఇట్టి ఆబార్షన్ లపై సీరియస్ గా విచారణ చేసి, కారణాలు కనుక్కోవాలని, కావాలని, ఆడ పిల్ల అని తెలుసుకొని ఆబార్షన్ చేయిస్తే, అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి 1000 మంది అబ్బాయిలకు 1050 మంది అమ్మాయిలు రేషియోగా వుండాల్సి వుండగా, జిల్లాలో 905 మంది అమ్మాయిలు మాత్రమే ఉన్నారన్నారు. దత్తత పై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో 2546 మంది వివాహం అయి, 5 సంవత్సరాలు దాటి, పిల్లలు లేనివారు ఉన్నట్లు, ఇట్టివారికి దత్తతపై కౌన్సిలింగ్ ఇచ్చి చైతన్యం తేవాలన్నారు. దత్తతకు దరఖాస్తు చేసుకున్న తర్వాత పిల్లలు కలిగితే, దత్తత రద్దు చెడుకోవచని తెలియజేయాలన్నారు. కారా (సెంట్రల్ ఆడప్షన్ రెగ్యులేషన్ అథారిటీ) ఆమోదం లేకుండా చట్టపరంగా దత్తత చెల్లదన్నారు. బంధువుల పిల్లల దత్తతలో కూడా కారా ద్వారా జరగాలని ఆయన తెలిపారు. ప్రతి సూపర్వైజర్ తమ పరిధిలో కనీసం 5 గురిని దత్తతకు సిద్ధం చేయాలన్నారు. సామ్, మామ్ పిల్లలను గుర్తించి వారికి పౌష్టికాహారం, చికిత్సను అందించి ఆరోగ్యవంతులను చేయాలన్నారు. ఆరోగ్యలక్ష్మి ద్వారా గర్భిణులు, బాలింతలకు ఇచ్చే న్యూట్రిషన్ ఆహారం, కేంద్రానికి వచ్చి తినేలాగా ప్రోత్సహించాలన్నారు. అనీమియా కేసులు గుర్తించిన చోట సరైన పర్యవేక్షణ చేసి, మందులు వేసుకునేలా చూడాలన్నారు. అనీమియా విముక్తి భారత్ క్రింద జిల్లాలోని 22837 మంది 8వ తరగతి నుండి ఇంటర్ అమ్మాయిలకు ఆర్బీఎస్కె బృందం ద్వారా పరీక్షలు నిర్వహించి, తదనుగుణంగా చికిత్స అందించనున్నట్లు ఆయన అన్నారు. ఆరోగ్యలక్ష్మి, ఎస్ఎన్సి క్రింద నమోదులు జరిగేలా చూడాలన్నారు. గర్భిణుల ఏఎన్సి నమోదులు చేపట్టాలన్నారు. బాల్య వివాహాలు జరగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని అన్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో క్రియాశీలకంగా పనిచేయాలని కలెక్టర్ అన్నారు.

ఈ సందర్భంగా చేపట్టిన సంతకాల సేకరణ లో కలెక్టర్ సంతకం చేశారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డా. బి. మాలతి, జిల్లా సంక్షేమ అధికారిణి సుమ, జిల్లా విద్యాధికారి ఇ. సోమశేఖరశర్మ, వైద్య ఆరోగ్య, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# వయోవృద్ధులను అందరూ ప్రేమగా బాధ్యతగా ఆదరించాలి



**హన్మకొండ జిల్లా /సుబే దారి /అక్షరం న్యూస్ :** హనుమకొండ సుబేదారిలోని ఎఫ్. ఎమ్. ఎమ్ సాంఘిక సేవా సంస్థ, వనం మహిళా సంఘం సంయుక్తంగా నిర్వహించిన సంఘీభావ దినోత్సవం ముఖ్య అతిథులుగా విచ్చేసిన హన్మకొండ శాసనసభ్యులు నాయిని రాజేంద్ర రెడ్డి, వృద్ధుల ట్రిబ్యునల్ కోర్టు సభ్యులు డాక్టర్ అనితా రెడ్డి పాల్గున్నారు.ఈ యొక్క కార్యక్రమానికి సిస్టర్ రెజీనా చిన్నప్ప అధ్యక్షత వహించారు. ఈ సందర్భంన్ని ఉద్దేశించి ముఖ్య అతిధులు నాయన రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో వృద్ధులను, దివ్యాంగులను సంకుచిత భావంతో చూస్తున్నారని వారి సంక్షేమం, రక్షణ అనేది అందరి బాధ్యత అని తెలిపారు ఈ యొక్క సంఘీభావన దినోత్సవం నిర్వహించి వారికి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి వారి ఆరోగ్య సంరక్షణకు వారి సంక్షేమానికి కృషి చేస్తున్న ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ, వనం మహిళా సంఘాన్ని వారు అభినందించారు . మీకు ఎటువంటి సమస్య వచ్చిన అటువంటి సమస్యను పరిష్కరించడానికి మీకు అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు, వృద్ధుల కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించడం జరిగింది.అలాగే వయో వృద్ధులకు దివ్యాంగులకు అతిధుల చేతుల 300 మందికి దుప్పట్ల పంపిణీ చేయడం జరిగింది మరో ముఖ్య అతిధి వయోవృద్ధుల ట్రిబ్యునల్ కోర్టు సభ్యులు, అనురాగ్ సొసైటీ ప్రెసిడెంట్ డాక్టర్ అనితా రెడ్డి హాజరై మాట్లాడుతూ ఇంకా వయ వృద్ధుల పట్ల వారి హక్కుల పట్ల సమాజం నిర్లక్ష్యంగా వ్యవహ రిస్తుందని వారిని ఆదరించాల్సిన కుటుంబ సభ్యులు వారి ఆదరణకు, పోషణకు సహకరించడం లేదని ఎవరైనా వారి కుటుంబ సభ్యులు వృద్ధులను దివ్యాంగులను హింసించిన వారి హక్కులకు భంగం కలిగించిన చట్ట ప్రకారం వారి పైన చర్యలు తీసుకోబడతాయని తెలిపారు. వృద్ధులకు ట్రిబ్యునల్ కోర్టు ఒక వరంలాంటిదని అన్నారు ఈ కార్యక్రమం లో మెడికేర్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ చిన్నపరెడ్డి ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వ హించడం జరిగింది, ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొన్నవారు ఎం. ఎల్. ఏ నాయిని రాజేంద్ర రెడ్డి,డాక్టర్ అనితా రెడ్డి, సిస్టర్ రెజినా వనం మహిళా సంఘం కార్యని ర్వహాక అధికారి సిస్టర్ నిర్మల, అధ్యక్షులు లూర్దు మేరీ ,కోఆర్డినేటర్లు ఏం అజయ్ కుమార్, కే రవికుమార్ సుందరమ్మ, రాజేశ్వరి ,శ్రీకళ , ఎర్ర శ్రీకాంత్, బి. కరుణ వివిధ ప్రాంతం నుంచి వచ్చిన సుమారు 300 మంది వయోవృద్ధులు వికలాంగులు పాల్గొన్నారు.

# గంగుల మల్లయ్యకి ఘన నివాళులర్పించిన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



**ఖమ్మం/ తల్లాడ జనవరి 23 (అక్షరంన్యూస్):** మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తండ్రి స్వర్గీయ మల్లయ్య ప్రథమ వర్థంతి (మొదటి సంవత్సరీకం) మంగళవారం జరిగింది.కరీంనగర్ క్రిస్టియన్ కాలనీ సమీపాన ఉన్న గంగుల వారి నివాస ప్రాంగణంలో జరిగిన ఈ కార్యానికి కుటుంబ సభ్యులతో పాటు బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు, అభిమానులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా మల్లయ్య చిత్రపటానికి సమీప బంధువులు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, వారి అన్నలు వద్దిరాజు కిషన్, వద్దిరాజు దేవేందర్, తమ్ముడు వద్దిరాజు వెంకటేశ్వర్లు,బావ శీలం సత్యనారాయణలు తమ కుటుంబ సభ్యులతో కలిసి పూలుజల్లి ఘనంగా నివాళులర్పించారు. వద్దిరాజు సోదరులు మల్లయ్య కుమారులు గంగుల సుధాకర్,గంగుల వెంకన్న, గంగుల కమలాకర్,వారి కుటుంబ సభ్యులు గంగుల అశోక్, గంగుల సందీప్ తదితరులను పరామర్శించి, దివంగత మల్లయ్య గత స్మృతులను గుర్తు చేసుకున్నారు.వారంతా మల్లయ్య పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు.

# వికసిత్ భారత్ కార్యక్రమంలో ప్రజలకు అవగాహన...






**ఖమ్మం/ తల్లాడ జనవరి 23 (అక్షరంన్యూస్):** ప్రత్యక్ష ప్రయోజనాల బదిలీ లేదా విద్యుత్,
నీరు, పేదవారికి మరుగుదొడ్లు వంటి సదుపాయాలు... ఇవన్నీ అట్టడుగు స్థాయిలో విప్లవాన్ని తీసుకువచ్చాయి. ఈ పథకాలు దేశంలోని నిరుపేదలలో భద్రత, ఆత్మగౌరవ భావాన్ని పెంపొందించాయి. భారత ప్రధాని శ్రీ నరేంద్ర మోడి వికసిత్ భారత యాత్ర కార్యక్రమంలో మంగళవారం తల్లాడ మండల పరిధిలోని బాలంపేట గోపాలపేట గ్రామాల్లో ప్రజలకు కేంద్ర ప్రభుత్వం యొక్క పథకాలు వివరించారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ గత తొమ్మిదిన్నర సంవత్సరాల కాలంలో పేద ప్రజలను ఉద్దేశించి చేసినటువంటి పథకాలలో క్రింది స్తాయి లబ్ధిదారులకు అందించాలనే సదుద్దేశంతో ప్రవేశపెట్టిన పథకాలను మరియు అభివృద్ధి కార్యక్రమాలను వాటి ఆవశ్యకతను వివరిస్తూ ఆ పథకాలకు అమలు కానటువంటి లబ్ధిదారులందరినీ కూడా ఈ పథకాలలో ఈ పథకాల యొక్క లబ్ధిని పొందాలని వివరిస్తూ గ్రామాలలో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా

శాఖల అధికారులు పాల్గొని పథకాల ఆవశ్యకతను వివరించారు.ఈ కార్యక్రమాలలో ఏపీజీవీబీ మేనేజర్ శివ సతీష్, వైద్యాధికారి

డాక్టర్ శ్రీకాంత్, బాలపేట గ్రామ సర్పంచ్ కోసూరి వెంకట నరసింహారావు, గోపాలపేట సర్పంచ్ నల్లమోతు మోహన్ రావు, వ్యవసాయ అధికారి హసీనా, భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు ఆపతి వెంకట రామారావు, యువమోర్చాఅధ్యక్షులు ఎల్లంకి సుధాకర్, బాలపేట గ్రామ సెక్రెటరీ మహేష్, గోపాలపేట గ్రామ సెక్రెటరీ పవన్ కుమార్, ఏఎన్ఎంలు రాంబాయి, జ్యోతి, త్రివేణి, కోఆర్డినేటర్ శ్రీనివాసరావు,

గ్యాస్ ప్రతినిధులు శరత్ బాబు, పోస్ట్ ఐబీఎం రావూరి అప్పారావు, వైద్య సిబ్బంది రైతులు గ్రామ ప్రజలు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# నరసింహకు ఘనంగా వీడ్కోలు సమావేశం



**గద్వాల్ జిల్లా/అయిజ మండలం/జనవరి23/అక్షరం న్యూస్:** మండల పరిధిలో శాంతినగర్ లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పనిచేసి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రామాపురం కుఇటీవల బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయులు మరియు మండల విద్యాధికారైన బి నరసింహ ఘనంగా వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసుకోవడం జరిగినది. ఈ సమావేశానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్యామ్యూల్ అధ్యక్షత వహించి పాఠశాలకు నరసింహ చేసిన సేవలు కొనియాడుతూ పాఠశాల అభివృద్ధిలో తన వంతు భాగస్వామ్యం నెలకొల్పి విద్యార్థిని విద్యార్థులకు చక్కటి స్నేహపూర్వక వాతావరణం కల్పించి పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంలో వారి పాత్ర ఎనలేనిదని అలాగే మండల విద్యాధికారి అయినప్పటికీ ఎన్నో సమస్యలు ఉన్నప్పటికీ వృత్తిపరమైన ఇబ్బందులు ఉన్నప్పటికీ సమయస్ఫూర్తితో వాటిని పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్లడం జరిగిందని తెలిపారు. అనంతరం వడ్డేపల్లి మున్సిపల్ చైర్మన్ కరుణ సూరి మాట్లాడుతూ ఈ పాఠశాల పట్ల మాకు ప్రత్యేకమైన అనుబంధం ఏర్పడిందని పాఠశాల అభివృద్ధిలో మమ్మల్ని భాగస్వాములను చేయడం మాకు ఆనందం కలిగి ఉంటుందని విద్యార్థిని విద్యార్థులు క్రమశిక్షణతో సహనంతో ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఇక్కడ ఉన్నప్పటికీ చదువు చెప్పిన గురువులను మరవరాదని తెలిపారు. సన్మాన గ్రహీత నరసింహ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు చక్కటి ప్రణాళికతో చక్కటి క్రమశిక్షణతో కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి మీపై తల్లిదండ్రులు ఉంచుకున్నటువంటి లక్ష్యాలను చేరుకోవాలని భవిష్యత్తులో మాకంటే ఉన్నత స్థాయిలో నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం ఏర్పాటుచేసిన ఉపాధ్యాయ బృందానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందము చాలా చాలా ఘన సత్కార్యంతో సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం నాగ శేషన్ సురేష్ కుమార్ అజయ కుమారి జనార్ధన్ దావీదు శేషమ్మ అబ్దుల్ జావిద్ చెన్నారెడ్డి,రూప బాయి కళ్యాణి నాగజ్యోతి సరిత బాబు మరియు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికుల సొంతింటి పథకంపై దృష్టి సారించండి

**- నూతన భూగర్భ గనుల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలి ఎమ్మెల్యే: కూనంనేని సాంబశివరావు**
**- సింగరేణి సిఎండి బలరాం నాయక్ ను కలిసిన సిపిఐ, ఏఐటీయూసీ బృందం**



భద్రాద్రి జిల్లా/ కొత్తగూడెం/ జనవరి.23/ అక్షరం సింగరేణి న్యూస్ : సింగరేణి కోల్బెల్ట్ ప్రాంతాల్లో ప్రతిపాదనలో ఉన్న నూతన ప్రాజెక్టులతోపాటు, కొత్త భూగర్భ గనుల ఏర్పాటుపై సింగరేణి యాజమాన్యం దృష్టి సారించాలని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. సింగరేణి ప్రధాన కార్యాలయంలో ఏఐటీయూసీ గుర్తింపు సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషాతో కలిసి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాంను కలిసి చర్చించారు. అనంతరం కూనంనేని మాట్లాడుతూ గడిచిన దశాబ్ద కాలంగా ఒక్క నూతన భూగర్భగనిని ప్రారంభించలేదని, గత ప్రభుత్వం నూతన గనులు ఏర్పాటు చేస్తామన్న హామీ అమలు చేయలేదన్నారు. సింగరేణి ప్రాంతాల్లో ఎంతోమంది యువకులు ఉపాధిలేక వలసబాట పట్టాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు, బొగ్గు ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలను మెరుగుపర్చాలని కోరారు. కార్మికుల సొంతింటి పథకంపై యాజమాన్యం దృష్టి సారించాలని, పదవి విరమణ అనంతరం అద్దె ఇండ్లలో ఉండాల్సిన దుస్థితి ఏర్పడుతోందన్నారు. గతంలో ఏఐటీయూసీ గుర్తింపు సంఘంతో చేసుకున్న ఒప్పందంమేరకు కార్మికులకు సొంతింటి పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలనీ, సంస్థకు నిరుపయోగంగా ఉన్న ఖాళీ క్వారటర్లను మాజీ కార్మికుల కుటుంబాలకు కేటాయించాలని, సింగరేణి స్థలాల్లో ఇండ్లు నిర్మించుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. సీఎస్ఆర్ నిధులతో ప్రాజెక్టు ప్రభావిత ప్రాంతాలల్లో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, సింగరేణి ఆస్పత్రులను బలోపేతం చేసి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. నిలుపుదల చేసిన జూనియర్ అసిస్టెంట్లకు ఉద్యోగాల్లో చేర్చుకోవాలని కోరారు..

# విద్యుత్ బిల్లులు కట్టద్దు అని కేటీఆర్ అనడం అప్రజాస్వామికం



**- మండల కాంగ్రెస్ అధ్యక్షుడు యెల్ల బాల్ రెడ్డి**

**రాజన్న సిరిసిల్ల/ముస్తాబాద్/జనవరి-23(అక్షరం న్యూస్):** 200 యూనిట్లలోపు విద్యుత్ బిల్లులు కట్టొద్దని.. ఆ బిల్లులు సోనియాగాంధీనే కడుతుందని కాంగ్రెస్ నేతలు చెప్పారని.. కరెంటు బిల్లులు ఆమెకే పంపాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు పిలుపు నివ్వడం సిగ్గుచేటు అని ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యెల్ల బాల్ రెడ్డి మండిపడ్డారు మంగళవారం ముస్తాబాద్ మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏళ్ల బాల్ రెడ్డి ఆధ్వర్యంలో పత్రిక సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమవారం అస్సాంలో రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్ర లో భాగంగా శాంతియుతంగా యాత్రను కొనసాగిస్తుంటే కొందరు బిజెపి అల్లరి ముఖ రాహుల్ గాంధీ యాత్రపై దాడి చేయడం ప్రజాస్వామ్యానికి చీకటి రోజు అన్నారు దీన్ని మండల కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుంది అన్నారు బీ ఆర్ ఎస్ అధికారం పోయిన వెంటనే మతిస్థిమితం కోల్పోయి అడ్డగోలుగా మాట్లాడుతున్నారు ప్రజలే స్వచ్ఛందంగా చెబుతున్నారని ఎద్దేవా చేశారు. నూతన ప్రభుత్వం సర్దుబాటు కావడానికి కొన్ని రోజుల సమయం పడుతుందిఅని, కాంగ్రెస్ పార్టీ అన్ని గ్యారెంటీలను అమలు చేస్తుంది అని వాళ్లే ధీమా వ్యక్తం చేస్తున్నారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో విద్యుత్ ప్రాజెక్టుల లో కమీషన్ లకు కక్కుర్తి పడి ఒక్క బ్యారేజీని కూడా సరిగా కట్టలేక అందులో వేలకోట్ల స్కామ్ చేసిన వారు మాట్లాడడం హాస్యాస్పదం అన్నారు. మీరు చేసిన అవినీతిని బయటపెడతాం అని అన్నారు. మేడిగడ్డ నిర్మాణంలో అడ్డగోలు స్కామ్ చేసి పిల్లర్లు కుంగి పోయాక అందులో ఉన్న నీటిని దిగువకు విడుదల చేయడంతో అప్పర్ మానేరు నింపుదామంటే నీళ్లు లేకుండా చేసింది మీరు కాదా అని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గజ్జల రాజు జిల్లా ఉపాధ్యక్షులు బుర్ర రాములు గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు మిర్యాల్కార్ శ్రీనివాస్, పెద్దిగారి శ్రీనివాస్, ఎంపిటిసి గుండెల్లి శ్రీనివాస్ గౌడ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు తలారి నర్సింలు బీసీ సెల్ మండల అధ్యక్షులు శీల ప్రశాంత్, పాక్స్ డైరెక్టర్ కరెడ్ల కొండల్ రెడ్డి మద్దికుంట రామలక్ష్మణ పల్లె మోర్రయిపల్లె గ్రామ శాఖ అధ్యక్షులు దోనుకుల కొండయ్య, చంద్ర మౌళి, కొమురయ్య సీనియర్ నాయకులు వెల్ముల రాంరెడ్డి ఉచ్చిడి బాల్ రెడ్డి ఓరుగంటి తిరుపతి, లక్ష్మ రెడ్డి రాజమల్లయ్య యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు రంజాన్ నరేష్, సద్ది మధు, కదిరే సత్యం గౌడ్, మహేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ శాఖలో క్రమశిక్షణ చాలా కీలకం

**- క్రమశిక్షణతో విధులు నిర్వర్తించే ప్రతి ఒక్కరికీ పోలీసు శాఖలో ప్రత్యేక గుర్తింపు....**
**- జిల్లా ఏఆర్ సిబ్బంది మొబలైజేషన్ ప్రారంభ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ : రోహిత్ రాజు**



**భద్రాద్రి జిల్లా /కొత్తగూడెం/ జనవరి.23/ అక్షరం న్యూస్:** క్రమశిక్షణతో విధులు నిర్వర్తించే ప్రతి ఒక్కరికీ పోలీసు శాఖలో ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు . హేమచంద్రాపురం నందు గల జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ లోని పోలీస్ పరేడ్ గ్రౌండ్లో జిల్లా ఏఆర్ సిబ్బందికి మొబైలైజేషన్ పరేడ్ కార్యక్రమం ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ముందుగా జిల్లా సాయుధ బలగాల చేత గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం 05 ప్లాటూన్లతో ఏర్పాటు చేసిన ఈ పెరేడ్ నకు ప్లాటూన్ కమాండర్ గా ఆర్ఐ రవి వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ పోలీసు శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరూ మానసికంగా, శారీరకంగా దృఢత్వం కలిగి ఉన్నప్పుడే బాధ్యతాయతమైన విధులను క్రమశిక్షణతో నిర్వర్తించగలుగుతామని అన్నారు. 15 రోజుల పాటు జరిగే ఈ మొబలైజేషన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుంటూ పోలీసు శాఖలో కాలానుగుణంగా అనుసరిస్తున్న శిక్షణను పొందాలని సూచించారు. పోలీస్ శాఖలో క్రమశిక్షణ అనేది చాలా కీలకమని అందుకు అనుగుణంగా అందరూ భాధ్యతగా పనిచేయాలని కోరారు. రిఫ్రెష్ కోర్స్ లాంటి మొబలైజేషన్ ఆర్మడ్ రిజర్వ్ సిబ్బందికి చాలా కీలకమని అన్నారు. శిక్షణా కాలంలో నేర్చుకున్న అంశాలను మర్చిపోకుండా ఉండటంతో పాటు శారీరకంగా దృడత్వంతో పాటు మానసిక ఉల్లాసం కూడా లభిస్తుందని తెలిపారు. పదిహేను రోజుల పాటు ఉత్సాహంగా పాల్గొని గతంలో శిక్షణ పొందిన మెళుకువలను నివృత్తి చేసుకుంటూ ఇండోర్, ఔట్ డోర్ ,ఫైరింగ్ ప్రాక్టీస్ లో ఉత్తమ ప్రతిభ చూపాలన్నారు. నిరంతరం విధులలో ఉండే పోలీసు అధికారులు, సిబ్బందికి వ్యక్తిగత, కుటుంబపరమైన, శాఖాపరమైన సమస్యలను పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ ముందుంటామని వివరించారు. ఈ శిక్షణాకాలంలో ఎటువంటి అంతరాయం లేకుండా విజయవంతంగా పూర్తి చేయాలని అందులో భాగంగానే సెర్మోనియల్ పరేడ్ లో అద్భుతంగా ప్రదర్శించారని కొనియాడారు.
ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ విజయ్ బాబు, అడ్మిన్ ఆర్ఐ రవి, ఎంటిఓ సుధాకర్, హెూంగార్డ్స్ ఆర్ఐ నరసింహారావు, వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు మరియు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉద్యోగులు పదవి విరమణ తర్వాత ప్రజాసేవ చేయాలి: కొత్వాల



**భద్రాద్రి జిల్లా /పాల్వంచ/ జనవరి.23/ అక్షరం న్యూస్:** ఉద్యోగులు తమ విధుల నుంచి పదవి విరమణ అనంతరం కూడా ప్రజాసేవ చేయాలని డీసీఎంఎస్ వైస్ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ నాయకులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ అర్బన్ పిహెచ్ సి గుడిపాడులో వుండేటి రాహేలు 23 సంవత్సరాలు ఏ.ఎన్. ఎం గా పనిచేసి పదవి విరమణ పొందారు. మంగళవారం పాల్వంచ మండలం పరిధిలోని జగన్నాథపురం ఫంక్షన్ హాల్ లో ఆమెకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కొత్వాల కుమారి రాహేలు వైద్య వృత్తిలో వుండి, వేలాదిమంది పేద రోగులకు వైద్యం అందించారన్నారు. పదవి విరమణ తర్వాత కూడా ఆమె రోగులకు వైద్య సహాయం చేయాలని కొత్వాల కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి యర్రంశెట్టి ముత్తయ్య, ఫాస్టర్ పి. ప్రశాంత్ పాల్, కాంగ్రెస్ నాయకులు కందుకూరి రాము, ఉండేటి శాంతివర్ధన్, గండు భరత్, ఉండేటి దానియేల్, దామెర్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## సైదాపూర్ మోడల్ స్కూల్ విద్యార్థి రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపిక



**కరీంనగర్/సైదాపూర్,జనవరి 23(అక్షరం న్యూస్):** కరీంనగర్ జిల్లా అంబేద్కర్ స్టేడియం లో ఈనెల 21న జరిగినటువంటి ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎస్జిఎఫ్ అండర్ 17 బాయ్స్ విభాగంలో స్కేటింగ్ పోటీల్లో సైదాపూర్ మండలం సోమారం మోడల్ స్కూల్ విద్యార్థి పి మణికంఠ మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపిక అయ్యారు. ఈ నెల23 నుండి25 హైదరాబాద్ జరిగే రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీల్లో పి మణికంఠ ఎంపిక అయ్యారు. విద్యార్థి మణికంఠను మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఫర్హానా,వైస్ ప్రిన్సిపాల్ మోయిస్,ఫిజికల్ డైరెక్టర్ ఉయ్యాల విష్ణు వర్ధన్, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.
శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి... పురపాలక చైర్మన్ వైద్యులు పాల్వాయి రామ్మోహన్ రెడ్డి మహబూబాబాద్, బ్యూరో అక్షరం న్యూస్ జనవరి 23. మంచినీటి సరఫరా సమస్యలకు శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పురపాలక సంఘ చైర్మన్ వైద్యులు పాల్వాయి రామ్మోహన్ రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం పురపాలక సంఘ పరిధిలోని కొత్తబజారు మెయిన్ రోడ్డులో జరుగుతున్న మంచినీటి పైపులైన్ లీకేజీ మరమ్మతులను చైర్మన్ వైద్యులు పాల్వాయి రామ్మోహన్ రెడ్డి పరిశీలించి సమస్యలు లేకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచనలు చేశారు. వచ్చే వేసవి కాల దృష్ట్యా పురపాలక సంఘ పరిధిలో ఇలాంటి సమస్య లేకుండా ముందస్తు చీరలు చేపట్టాలని ఆదేశించారు.
చైర్మన్ వెంట నీటి సరఫరా సిబ్బంది జగన్, తదితరులు ఉన్నారు.

## ముస్తాబాద్ మండల గౌడ సంఘం అధ్యక్షుడిగా కొండ యాదగిరి గౌడ్ ఎన్నిక



రాజన్న సిరిసిల్ల/ ముస్తాబాద్/ జనవరి -23 (అక్షరం న్యూస్) ముస్తాబాద్ మండల గౌడ సంఘం అధ్యక్షులుగా కొండ యాదగిరి గౌడ్ ను అన్ని గ్రామాల సంఘాల సభ్యులు కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఉపాధ్యక్షులుగా తుపాకుల శ్రీనివాస్ గౌడ్ గున్నాల వెంకటస్వామి గౌడ్ ప్రధాన కార్యదర్శిగా గడ్డమీద రామచంద్రం, కార్యదర్శిగా నాగరాజు, కోశాధికారిగా కదిరే బాలగౌడ్ ,అధికార ప్రతినిధిగా కోడూరు అంజయ్య, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా యాదగిరి గౌడ్ మాట్లాడుతూ గీతా కార్మికుల సోదరుల ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తానని ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తానని తన ఎన్నికకు సహకరించిన గౌడ సోదరులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గౌడ సంఘాల సభ్యులు నూతనంగా ఎన్నికైన కొండ యాదగిరి కి తీపి మిఠాయిలు తినిపించి అభినందనలు తెలిపారు.

## 25న హైదరబాద్ ఎల్.బి స్టేడియంలో జరిగే టిపిసిసి రాష్ట్ర స్థాయి సదస్సును విజయవంతం చేయాలి. నాయిని రాజేందర్ రెడ్డి



**హన్మకొండ జిల్లా /క్యాంప్ కార్యాలయం /అక్షరం న్యూస్ :** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 25 వ తేదిన హైదరాబాద్ ఏల్ బి. స్టేడియంలో మధ్యాహ్నం 2 గంటలకు టిపిసిసి రాష్ట్ర స్థాయి సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. టిపిసిసి అద్యక్షులు రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగే సదస్సుకు ముఖ్య అతిథిగా ఏఐసిసి అద్యక్షులు మల్లి కార్జున్ ఖార్గే టిపిసిసి నాయకులు పాల్గొననున్నారు. ఈ సదస్సులో ప్రతి నియోజకవర్గం నుండి కార్పోరేటర్లు, మండల పార్టీ అద్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అద్యక్షులు డివిజన్ అద్యక్షులు అనుబంధ సంఘాల అధ్యక్షులు, బూత్ అద్యక్షులు మరియు జిల్లా నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న టిపిసిసి నాయకులు ఈ సదస్సులో పాల్గొని విజయవంతం చేయాలని హన్మకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అద్యక్షులు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపాడు.

## శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి...

**- పురపాలక చైర్మన్ వైద్యులు పాల్వాయి రామ్మోహన్ రెడ్డి**

**మహబూబాబాద్, బ్యూరో అక్షరం న్యూస్ జనవరి 23:** మంచినీటి సరఫరా సమస్యలకు శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పురపాలక సంఘ చైర్మన్ వైద్యులు పాల్వాయి రామ్మోహన్ రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం పురపాలక సంఘ పరిధిలోని కొత్తబజారు మెయిన్ రోడ్డులో జరుగుతున్న మంచినీటి పైపులైన్ లీకేజీ మరమ్మతులను చైర్మన్ వైద్యులు పాల్వాయి రామ్మోహన్ రెడ్డి పరిశీలించి సమస్యలు లేకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచనలు చేశారు. వచ్చే వేసవి కాల దృష్ట్యా పురపాలక సంఘ పరిధిలో ఇలాంటి సమస్య లేకుండా ముందస్తు చీరలు చేపట్టాలని ఆదేశించారు. చైర్మన్ వెంట నీటి సరఫరా సిబ్బంది జగన్, తదితరులు ఉన్నారు.



## గౌడ సంఘాలు నూతన కమిటీలను ఎన్నుకోవాలి

- మోకుదెబ్బ క్యాలెండరును ఆవిష్కరించిన ఎక్సైజ్ సీ ఐ. నరేష్ రెడ్డి



**వరంగల్ జిల్లా/నర్సంపేట డివిజన్/జనవరి 23 అక్షరం న్యూస్:** పట్టణంలో గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ నూతన సంవత్సరం క్యాలెండరు ను నర్సంపేట అబ్కారీ శాఖ కార్యాలయంలో సీఐ నరేష్ రెడ్డి బుధవారం ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సీ ఐ నరేష్ రెడ్డి మాట్లాడుతూ నర్సంపేట డివిజన్ పరిధిలోని ఆరు మండలాల పరిధిలోని లిగౌడ సంఘాల సభ్యులు నూతన కమిటీ లు వేసుకోవాలన్నారు. తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం పాత కమిటీల స్థానంలో కొత్తగా గుర్తింపు కార్డు గలవారి ఓటర్ లిస్ట్ ప్రకటించిన అనంతరం అధ్యక్ష, ఉపాధ్యక్ష, ఇతరకార్యవర్గ కమిటీ ని అబ్కారీ శాఖ నిబంధనల ప్రకారం ఎన్నుకోవాలని సూచించారు.నూతన కమిటీ లకు మాత్రమే ప్రభుత్వ పథకాలు , ఎక్స్ గ్రేషియా వర్తిస్తుందని సిఐ నరేష్ రెడ్డి తెలిపారు. మోకుదెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ మట్లాడుతూ గత ఆరు నెలలుగా తాటి చెట్లపై నుండి పడి గాయపడిన, చనిపోయిన వారికీ ఎక్స్ గ్రేషియా రావడం లేదన్నారు.డివిజన్ లో పెండింగ్ లో ఉన్న గీత కార్మికులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ ఐ రాజేశ్వరి, మోకుదెబ్బ జిల్లా అధ్యక్షులు గోపగాని వెంకట్ గౌడ్, సలహా దారు రామగోని సుధాకర్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు దొంతి సంతోష్ గౌడ్, బుడిగె మల్లేష్ గౌడ్ ,ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అక్షరం దినపత్రిక ప్రచురించే కథనాలు ప్రజావాక్కు,కార్మికుల గళం

- అక్షరం దినపత్రిక యాజమాన్యానికి అక్షరం కుటుంభ సభ్యులకు శుభాకాంక్షలు : చారుగుండ్ల రమేష్...



**భద్రాద్రి జిల్లా/ పాల్వంచ/ జనవరి.23/ అక్షరం న్యూస్:** అక్షరం దినపత్రికలో ప్రతి రోజు ప్రచురించే కథనాలు ప్రజావాక్కు , కార్మికుల గళం అని టిఆర్.వీకే.ఎస్ రాష్ట్ర సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు జెన్కో కార్యదర్శి చారు గుండ్ల రమేష్ అన్నారు. అక్షరం దినపత్రిక మరియు అక్షరం టివి నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించిన టిఆర్.వీకే. ఎస్ రాష్ట్ర సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు జెన్కో కార్యదర్శి చారు గుండ్ల రమేష్ మాట్లాడుతూ అక్షరం దినపత్రిక కార్మికుల పక్షాన నిలబడి వారి హక్కుల కోసం పోరాడే యూనియన్లకు అండగా నిలిచి కార్మికుల హక్కుల సాధనలో కీలక పాత్ర పోషించిందని ,అక్షరం దినపత్రిక ప్రారంభం నాటి నుంచి తన విలక్షణ వార్త కథనాలతో పాఠకులను అభిమానులను పెంచుకుందని ,అక్షరం దినపత్రిక ప్రయాణంలో మేము భాగస్వామిగా ఉన్నందున మాకు చాలా గర్వంగా ఉందని అన్నారు. అక్షరం దినపత్రిక ఒక అడుగు ముందుకు వేసి వెబ్ న్యూస్ ను ప్రారంభించడమే కాకుండా ఇప్పుడు అక్షరం టివి ని కూడా ప్రారంభించిందని ,అక్షరం టివి ని కూడా ప్రజలు ఎంతో ఆదరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అక్షరం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఎస్.కే.సాదిక్ పాస్టర్, ఎండి అమీన్, ఆర్ శ్రీనివాసరావు , ముత్యాల రాంబాబు , తోట కోటేశ్వరావు , దంచిన రాంబాబు , బరిగాన్ రామారావు , రవికుమార్ ,ఎం.డి సాజిత్ ,విజయ పప్పు, శంకర్ , మహేందర్ ,సుభాని , మహమ్మద్ పటాన్ ఖాన్, ధర్మపురి నాగేశ్వరరావు, చల్లా పరమేష్ , కోటిలింగం , కాలే కాంతయ్య, ఎస్.కె. మల్సూర్, ఏంసిఎస్ వెంకటేశ్వర్లు, పాశం రవిబాబు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పదవి విరమణ అనంతరం శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో అనందంగా గడపాలి

- పదవీ విరమణ పొందిన హెూంగార్డ్ ప్రభాకర్ రావును ఘనంగా సన్మానించిన జిల్లా ఎస్పీ : రోహిత్ రాజు



**భద్రాద్రి జిల్లా/ కొత్తగూడెం /జనవరి.23/ అక్షరం క్రైమ్ న్యూస్:** కొత్తగూడెం యూనిట్ నందు విధులు నిర్వర్తిస్తు పోలీస్ శాఖలో 37 సంవత్సరాల సర్వీస్ ను పూర్తి చేసుకుని పదవీ విరమణ పొందిన హెూంగార్డ్ ఆఫీసర్ సిహెచ్ ప్రభాకర్ రావు ను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తన కార్యాలయంలో కుటుంభ సభ్యుల సమక్షంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో పని చేసి పదవి విరమణ పొందిన ఉద్యోగులు తమ శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడపాలని సూచించారు. తమ ఆరోగ్యాల పట్ల తగు జాగ్రత్తలను తీసుకోవాలని కోరారు. పదవీ విరమణ పొందిన సిబ్బందికి ఎలాంటి సమస్యలు తలెత్తినా పోలీసు శాఖ తరపున ఎల్లప్పుడూ ముందుంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ హెూంగార్డ్స్ నరసింహారావు, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు, హెూంగాడ్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నియమాలపై విద్యార్థులకు అవగాహన



**రాజన్న సిరిసిల్ల/ స్టాపర్/ జనవరి -22 (అక్షరం న్యూస్):**(జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని ప్రగతి విద్యాలయం పాఠశాలలో ట్రాఫిక్ నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ చంద్ర కిషోర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడప రాదని, రోడ్డు నియమాలను పాటించి సురక్షిత ప్రయాణం సాగించాలన్నారు. ట్రాఫిక్ నియమాలపై గుర్తులను సూచిస్తూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఇంగ్లీష్ పరిజ్ఞానాన్ని నేర్చుకోవాలి



- వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్...

**ఖమ్మం/ వైరా జనవరి 23 (అక్షరంన్యూస్):** వైరా ఎమ్మెల్యే మాలోతు రామదాసు నాయక్ జడ్పీహెచ్ఎస్ ఏన్కూర్ పాఠశాలకు విచ్చేసి స్పెల్ విజార్డ్ అనే ఇంగ్లీష్ స్కూల్ లెవెల్ కాంపిటీషన్ ని ప్రారంభించారని ప్రధానోపాధ్యాయులు కే సైదయ్య తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు ఇంగ్లీష్ పరిజ్ఞానాన్ని నేర్చుకొని ప్రతి ఒక్కరూ ఇంగ్లీషులో మాట్లాడవలసిందిగా కోరారు. ఆ తర్వాత మంగళవారం అల్పాహారం రాగి జావ తీసుకొని సంతృప్తి వ్యక్తపరిచారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు అందరూ కలిసి ఎమ్మెల్యే ని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరు ఓటు హక్కు కలిగి ఉండాలి..






- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే. నాయిని..

**హన్మకొండ జిల్లా /ములుగు రోడ్డు /అక్షరం న్యూస్ :** జాతీయ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ రోజు NCC 10 (T) Bn LBC వరంగల్ ఆధ్వర్యంలో లాల్ బహదూర్ కాలేజీలో ఏర్పాటు చేసిన ఎం.ఎల్.సి పట్టభద్రుల ఓటరు నమోదు అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హాజరైనాడు. ఈ సందర్భంగా నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ఓటు మన హక్కు అని, ప్రతి ఒక్కరు ఓటు హక్కు కలిగి ఉండాలని, అన్నాడు.

# నేత్రదాత శ్రీనివాస్‌కు జోహార్లు...

**ఓదెల/ పెద్దపల్లి జనవరి 23(అక్షరం న్యూస్):** ఓదెల గ్రామానికి చెందిన గొర్ల శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మృతి మృతి చెందారు మృతుడి నేత్రాలను సదా ఆశయ ఫౌండేషన్ ద్వారా దానం చేశారు 11వ రోజు సందర్భంగా మృతుడి స్వగృహంలో నేత్రదాతకు సదా ఆశయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ భీష్మ చారి ఆధ్వర్యంలో సంస్మరణ సభ ఏర్పాటు చేసి నేత్రదాతకు ఘనంగా జోహార్లు అర్పించారు నేత్రదాత కుటుంబ సభ్యులకు సదాసయ్య ఫౌండేషన్ జ్ఞాపికను మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్ చేతుల మీదుగా అందించారు ఈ సందర్భంగా భీష్మచారి మాట్లాడుతూ మానవ శరీరం చాలా విలువైనదని అది తెలవక మనం చనిపోయిన విలువైన శరీరాన్ని మంటల్లో కాల్చి మట్టిలో కలిపెస్తున్నామని మనిషి చనిపోయిన తర్వాత నేత్రాలు అవయవ దానం తప్పకుండా చేయాలని అవయవ శరీర దానం వల్ల ఎంతో మందికి పునర్జన్మ ఇచ్చిన వారం అవుతామని అదేవిధంగా ఒక మనిషి చనిపోతే వారి నేత్రాలను ఇద్దరి హందులకు చూపును ప్రసాదించేందుకు తోడ్పడతాయని మనం నేత్రదానం చేయడం వల్ల అందులకు చూపును కలిగించడం వల్ల వారు ప్రతి రోజు ఉదయం లేవగానే నాకి చూపును ప్రసాదించిన వారి కుటుంబ సభ్యులు కలకాలం చల్లగా ఉండాలని ఆ దేవుడిని ప్రార్థిస్తారు తను మృతి చెందిన తన నేత్రాలతోటి మళ్లీ ప్రపంచాన్ని చూడగలిగే అవకాశం ఉందని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకొని ముందుకొచ్చి శరీర అవయవ దానాలు నేత్రదానం చేయాలని తెలియజేశారు దీనికి సహకరించిన బుద్ధి మొగిలి గొర్ల శ్రీనివాస్ కు ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో పృథ్విరాజ్ వాసు సారంగం ఈ వెంకటేశ్వర్లు డాక్టర్ వేణు క్యాతం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.




# సింగరేణి సంస్థలో మరింత పకడ్బందీగా మెడికల్ బోర్డు ప్రక్రియ

- మోసగాళ్లను ఆటకట్టించేందుకు రంగంలోకి అవినీతి నిరోధక శాఖ
- అక్రమాలు చేసే ఉద్యోగులను డిస్మిస్ చేస్తామని హెచ్చరికలు
- మోసగాళ్లపై క్రిమినల్ కేసులకు వెనకాడబోమని స్పష్టీకరణ
- ఏసీబీ ఉన్నతాధికారులతో సీఎండీ ఎన్.బలరాం సమీక్ష



**మంచిర్యాలబ్యూరో,జనవరి23,(అక్షరం న్యూస్):** అనారోగ్యంతో బాధపడుతున్నా సింగరేణి కార్మికులను వైద్య పరంగా పరీక్షించి ఇన్వాలిడేషన్ చేసే మెడికల్ బోర్డు ప్రక్రియను మరింత కట్టుదిట్టంగా,పారదర్శకంగా నిర్వహించేందుకు ఆ సంస్థ ఛైర్మన్ ఎండీ ఎన్.బలరామ్ కీలక చర్యలు చేపట్టారు.అందులో భాగంగానే కార్మికులను మాయమాటలతో మోసగిస్తున్నా వాళ్ళ ఆటకట్టించేందుకు అవినీతి నిరోధక శాఖ సహకారం తీసుకోవాలని నిర్ణయించారు.ఆ మేరకు ఇటీవలనే ఏసీబీ డీజీపీ సి.వి.ఆనంద్ ను కలిసి విజ్ఞప్తి చేశారు.ఆ మెడికల్ బోర్డుపై ఏసీబీ కూడా ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.ఆ నేపథ్యంలోనే ఏసీబీ డీజీపీ ఆదేశాల మేరకు ఉమ్మడి ఖమ్మం జిల్లా ఏసీబీ డీఎస్పీ శ్రీ రమేష్ నేతృత్వంలో అధికారుల బృందం సోమవారం సాయంత్రం సీఎండీ ఎన్.బలరామ్ ను కొత్తగూడెంలో కలిసింది.ఆ తరుణంలో మెడికల్ బోర్డు ప్రక్రియపై ఏసీబీ అధికారులు, సింగరేణి అధికారులతో సమగ్రంగా సమీక్షించారు.ఆ సందర్భంగా ఎన్.బలరామ్ మాట్లాడుతూ..మెడికల్ బోర్డు విషయంలో పైరవీలు చేయిస్తామని డబ్బు తీసుకున్న కొందరు ఉద్యోగులను ఇప్పటికే డిస్మిస్ చేసిన విషయాన్ని ఆ ఏసీబీ అధికారులకు వివరించారు.అలాగే ఇతరులు ఎవరైనా సరే కార్మికుల నుంచి డబ్బు వసూలు చేసినట్లు తమ దృష్టికి వస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.కాగా సంస్థ విజిలెన్స్ విభాగం కూడా మెడికల్ బోర్డుపై నిఘా పెడుతోందని చెప్పారు.అయితే మరింత పటిష్టమైన నిఘా ఉండాలన్న ఉద్దేశంతో ఏసీబీ సహకారాన్ని కోరుతున్నట్లు వెల్లడించారు.అనంతరం ఏసీబీ ఉన్నతాధికారులు మాట్లాడుతూ..సంస్థలో అనుమానాస్పదంగా ఉన్న ఉద్యోగుల కదలికలపై ఇకపై ప్రత్యేక నిఘా పెడతామని తెలిపారు.కార్మికులను అన్ ఫిట్ చేయిస్తామని ఎవరైనా డబ్బులు అడిగితే అలాంటి వారి సమాచారాన్ని ఏసీబీ దృష్టికి తీసుకురావాలని కోరారు.పారదర్శకంగా సింగరేణి మెడికల్ బోర్డు ప్రక్రియ జరగాలనే యాజమాన్యం ఆలోచనను సాకారం చేసేందుకు పూర్తిగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, at Sri Venkateshwara Printers. Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Districrt : Khammam Editor: Shaik Yacoob Pasha, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609

# ప్రజాధారణ పొందుతున్న అక్షరం దినపత్రిక...మంత్రి తుమ్మల..



ఖమ్మం జిల్లా /ఖమ్మం రూరల్ జనవరి 23 /అక్షర న్యూస్ :/

నిత్యం ప్రజల ఆకాంక్షలకు అక్షరం పత్రిక అద్దం పడుతోందని రాష్ట్ర వ్యవసాయ సహకార మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు మంగళవారం మంత్రి క్యాంప్ కార్యాలయంలో అక్షరం దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా గొంతుకై పనిచేసే పత్రికలకు ప్రజల్లో ఎప్పుడూ ఆదరణ ఉంటుందని అన్నారు. అంతేకాకుండా ఎప్పటికప్పుడు వాస్తవాలను ప్రజల ముందుంచి కొత్త ట్రెండును అక్షరం పత్రిక సృష్టించిందన్నారు. అలాగే ప్రభుత్వ పథకాలను కూడా ప్రజలోకి తీసుకెళ్లేలా పత్రికలు పని చేయాలని సూచించారు. ప్రతిపక్షాల పాత్ర పోషించేది పత్రికలే అని అటువంటి పత్రికలు సమాజంలోని సమస్యలతో పాటు అణగారిన వర్గాల బ్రతుకులను కూడా సమాజానికి పరిచయం చేయాలని ఆ వైపుగా పత్రికలు పనిచేయాలని అన్నారు. అలాంటప్పుడే ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలు ప్రజల వద్దకు చేరుతాయని అన్నారు. సంక్షేమ కార్యక్రమాలు పత్రికల ద్వారానే ప్రజలకు త్వరగా చేరవ వుతాయని అలాగే సానుభూతితో కానీ పక్షపాతంతో కానీ వార్తలు రాయకుండా వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని ఆ వైపుగా ప్రయాణం చేస్తున్న అక్షరం దినపత్రిక ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.అక్షరం పేపర్ భవిష్యత్తులో కూడా మంచి పేరు తెచ్చుకోవాలని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు సాదు రమేష్ రెడ్డి కార్పొరేటర్లు మలీదు జగన్ దుద్దుకూరు వెంకటేశ్వరరావు మందడపు మనోహర్ చావా నారాయణరావు ముస్తఫా కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి తుమ్మలను సత్కరించిన కాంగ్రెస్ నాయకులు పొదిల..



ఖమ్మం జిల్లా /ఖమ్మం రూరల్ / జనవరి 23 /అక్షరం న్యూస్ :/

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం ఖమ్మం నగరంలోని కాంగ్రెస్ జిల్లా నాయకులు పొదిల రవికుమార్ నివాసాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మలను పొదిల శాలువాతో సత్కరించారు.రవికుమార్ ఆయన తండ్రి దేవేందర్ కుమారుడు రాజేష్ లతో మంత్రి నాగేశ్వరరావు కొద్దిసేపు ముచ్చటించారు వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.ఈ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ సాధు రమేష్ రెడ్డి మహ్మద్ జావీద్ మానుకొండ రాధాకిశోర్ వడ్డెబోయిన నర్సింహారావు శెట్టి రంగారావు కొత్త సీతారాములు తాళ్లూరి హన్మంతరావు సముద్రాల శ్రీనివాసరావు నల్లమల వేణు,తదితరులు ఉన్నారు.

# నగరపాలక సంస్థ సమీక్ష సమావేశంలో మంత్రి తుమ్మల గరంగరం...

## అక్రమార్కులకు అంట గాగిన అధికారులకు చివాట్లు.



ఖమ్మం జిల్లా /ఖమ్మం రూరల్ / జనవరి 23/ అక్షరం న్యూస్ :/

నగరపాలక సంస్థ కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఆ పార్టీకి చెందిన కొంతమంది అక్రమార్కులకు కార్పొరేషన్ అధికారులతో సహా వివిధ శాఖల అధికారులు కూడా అంట గాగినట్లుగా మంత్రి నిఘా సంస్థల ద్వారా దర్యాప్తు చేయించి అధికారులపై మండిపడ్డారు. ప్రభుత్వ భూములను గత ప్రభుత్వంలో నాయకులకు అనుకూలంగా అంటగట్టారని మండిప డ్డారు. కాజేసిన భూములను ప్రభుత్వం తిరిగి తీసుకు నేందుకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ టీంను ఏర్పాటు చేసింద న్నారు. మొదలుపెట్టిన అభివృద్ధి పనులు వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రధానంగా ఖమ్మం నగరంలోని రమణ గుట్ట ప్రాంతంలోని 57 58 డివిజన్లో మరిన్ని భూములు అక్రమార్కుల చేతిలో ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందని తెలిపారు. వాటిపై కూడా ప్రభుత్వం అధికారులు చొరవ చూపాలని కోరారు. ఖమ్మం నగరాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలని కోరారు. ఖమ్మం నగరాన్ని శానిటేషన్ ప్లానింగ్ టౌన్ ప్లానింగ్ తదితర అన్ని విభాగాల్లో మోడల్ గా ఉండేలా అధికారులు కృషి చేయాలి అన్నారు. వేసవిలో నగరంలో ఏ ప్రాంతంలోనూ నీటి సమస్య తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. పరిశుభ్ర నగరంగా ఖమ్మం కు పేరు రావాలని ఆ దిశగా కార్పొరేషన్ ప్రతి విభాగ సిబ్బంది బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. పారిశుద్ధ్య సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ సమీక్షలో ఖమ్మం ఆర్డీవో గణేష్ ట్రాన్స్కో ఎస్ఈ సురేందర్ ఖమ్మం నగర పాలక సంస్థ సహాయ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# రండి... దీవించండి...

- మంత్రి పొంగులేటి సోదరుని తనయుడి వివాహానికి రేవంత్ రెడ్డి దంపతులకు ఆహ్వానం..
- కుటుంబ సమేతంగా ఇంటికి వెళ్లి శుభలేఖ అందజేత...



ఖమ్మం/తల్లాడ జనవరి 23 (అక్షరంన్యూస్)

హైదరాబాద్ : తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సోదరుడు, ఖమ్మంజిల్లా కాంగ్రెస్ నాయకులు పొంగులేటి ప్రసాద రెడ్డి తనయుడు లోహిత్ రెడ్డి వివాహానికి, రిసెప్షన్ కు తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి దంపతులను ఆహ్వానించారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, మాధురి దంపతులు, పొంగులేటి ప్రసాద్ రెడ్డి, శ్రీలక్ష్మి దంపతులు కుటుంబ సమేతంగా మంగళవారం సీఎం నివాసానికి వెళ్లి శుభలేఖను అందజేశారు. తప్పకుండా వివాహ వేడుకకు విచ్చేసి నూతన వధూవరులకు ఆశీర్వాదాన్ని అందజేయాలని సీఎం దంపతులను వారు కోరారు.

# బీజేఎంసీలో అవిశ్వాస తీర్మానం పెట్టడం పట్ల మండిపడ్డ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

- మేయర్ తప్పు చేసి వుంటే తమ దృష్టికి తీసుకురావాల్సింది : ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్
- అవిశ్వస తీర్మాణం పెట్టినప్పుడు ఇక్కడే ఉండి సాదించాలి కానీ గోవా ముంబై వెళ్లడం ఏంటని ప్రశ్నించారు.
- స్వార్థ రాజకీయాల కోసమే అవిశ్వాసం పెట్టారు. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్
- డబ్బులకు ఆశపడి ఇలా చేయడం సరైనది కాదు. : ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



రంగారెడ్డి / రాజేంద్రనగర్ / గండిపేట్ / జనవరి 23/ అక్షరం న్యూస్ : బండ్లగూడ జాగీర్ మేయర్ పై వచ్చిన అవిశ్వస తీర్మాణం పెట్టడం సరైంది కాదని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు. బీజేఎంసీలో అవిశ్వాస తీర్మాణం పెట్టడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబ్బులకు ఆశపడి 16 మంది కార్పొరేటర్లు మేయర్ పై అవిశ్వాస తీర్మానం పెట్టారని ఆరోపించారు. 16 మంది కార్పొరేటర్లు వసూళ్లకు పాల్పడుతున్నారని మందలించినందుకు మేయర్ పై అవిశ్వాస తీర్మానం పెట్టారని మండిపడ్డారు. తనను ఏ మాత్రం సంప్రదించకుండా ఎలా అవిశ్వాస తీర్మానం పెట్టారని ప్రశ్నించారు. ఒక సంవత్సరం లో జరిగే ఎన్నికల కోసం ఇంత తాపత్రయం ఎందుకని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ఓట్లతో గెలిచి ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన 16 మంది కార్పొరేటర్లు గోవాలో బొంబాయిలో జల్సాలు చేస్తున్నారని తెలిపారు. ప్రజలకు సమాధానం చెప్పకుండా అవిశ్వాస తీర్మానం పెట్టడం ఎంతవరకు సమంజసమన్నారు. డబ్బులకు ఆశపడి అవిశ్వాస తీర్మానం పెట్టడం వల్ల ప్రజలకు అన్యాయం చేసిన వారమవుతామని తెలిపారు. ఇప్పటికైనా 16మంది కార్పొరేటర్లు మనసు మార్చుకొని తిరిగి రాకపోతే వారిపై పార్టీ పరంగా క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. రాబోయే ఎన్నికలలో వాళ్లకు స్థానం దక్కకుండా చేస్తామన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో మేయర్ మహేందర్ గౌడ్, కార్పొరేటర్ సాగర్ గౌడ్, పద్మావతి పాపయ్య యాదవ్, బీజేఎంసీ అధ్యక్షులు సురేష్ గౌడ్, గండిపేట్ మండల అధ్యక్షుడు రామేశ్వరం నరసింహ, రాందాస్, సుమన్ గౌడ్, మల్లేష్, అంతరం నరేష్,

# ఫిబ్రవరి 23 నుంచి మహిళల క్రికెట్ టోర్నీ ప్రారంభం

**ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ సీజన్-2 షెడ్యూల్ వచ్చేసింది ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మహిళల క్రికెట్ టోర్నీ ఫిబ్రవరి 23 నుంచి ప్రారంభం కానుండగా, మార్చి 17న ఫైనల్ మ్యాచ్ జరగనుంది.**

జనవరి 23 /అక్షరం న్యూస్ :/



ఈసారి రెండు నగరాల్లో టోర్నీ జరగబోతోంది. దీని ప్రకారం బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం తొలి దశ మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వనుంది. అలాగే ఫైనల్‌తో సహా రెండో దశ మ్యాచ్‌లు ఢిల్లీలోని అరుణ్ జైట్లీ గ్రౌండ్‌లో జరగనున్నాయి. మహిళల ప్రీమియర్ లీగ్ సీజన్-2 తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ముంబై ఇండియన్స్, ఢిల్లీ క్యాపిటల్స్ తలపడనున్నాయి. ఈ మ్యాచ్ బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరగనుంది. అలాగే, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫిబ్రవరి 24 నుండి తమ %పొూ% సమరాన్ని ప్రారంభించనుంది. వారి మొదటి మ్యాచ్‌లో %ఖూ% వారియర్స్‌తో తలపడుతుంది. 2023లో జరిగిన ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ ప్రారంభ ఎడిషన్‌లో ముంబై ఇండియన్స్ టైటిల్ గెలుచుకుంది. ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ 7 వికెట్ల తేడాతో గెలిచి తొలి మహిళల ప్రీమియర్ లీగ్ ట్రోఫీని గెలుచుకుంది.

WPL 2024 పూర్తి షెడ్యూల్:

ఫిబ్రవరి 23- ముంబై ఇండియన్స్ %జం% ఢిల్లీ క్యాపిటల్స్ (బెంగళూరు)

ఫిబ్రవరి 24- రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు %జం ఖూ% వారియర్స్ (బెంగళూరు)

ఫిబ్రవరి 25- గుజరాత్ జెయింట్స్ %జం% ముంబై ఇండియన్స్ (బెంగళూరు) ఫిబ్రవరి 26 - %ఖూ% వారియర్స్ %జం% ఢిల్లీ క్యాపిటల్స్ (బెంగళూరు) ఫిబ్రవరి 27 - రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు %జం% గుజరాత్ జెయింట్స్ (బెంగళూరు) ఫిబ్రవరి 28 - ముంబై ఇండియన్స్ %జం ఖూ% వారియర్స్ (బెంగళూరు) ఫిబ్రవరి 29 - రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు %జం% ఢిల్లీ క్యాపిటల్స్ (బెంగళూరు)మార్చి 1 - %ఖూ% వారియర్స్ %జం% గుజరాత్ జెయింట్స్ (బెంగళూరు)మార్చి 2 - రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు %జం% ముంబై ఇండియన్స్ (బెంగళూరు)మార్చి 3 - గుజరాత్ జెయింట్స్ %జం% ఢిల్లీ క్యాపిటల్స్ (బెంగళూరు) మార్చి 4 - %ఖూ% వారియర్స్ %జం% రాయల్ ఛాలెంజర్స్ (బెంగళూరు) మార్చి 5 - ఢిల్లీ క్యాపిటల్స్ %జం% ముంబై ఇండియన్స్ (ఢిల్లీ)మార్చి 6 - గుజరాత్ జెయింట్స్ %జం% రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఢిల్లీ)మార్చి 7 - %ఖూ% వారియర్స్ %జం% ముంబై ఇండియన్స్ (ఢిల్లీ)మార్చి 8 - ఢిల్లీ క్యాపిటల్స్ %జం ఖూ% వారియర్స్ (ఢిల్లీ)మార్చి 9 - ముంబై ఇండియన్స్ %జం% గుజరాత్ జెయింట్స్ (ఢిల్లీ) మార్చి 10 - ఢిల్లీ క్యాపిటల్స్ %జం% రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఢిల్లీ)మార్చి 11 - గుజరాత్ జెయింట్స్ %జం ఖూ% వారియర్స్ (ఢిల్లీ)మార్చి 12 - ముంబై ఇండియన్స్ %జం% రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఢిల్లీ)మార్చి 13 - ఢిల్లీ క్యాపిటల్స్ %జం% గుజరాత్ జెయింట్స్ (ఢిల్లీ)మార్చి 15 - ఎలిమినేటర్ (ఢిల్లీ) మార్చి 17 - ఫైనల్ (ఢిల్లీ)..

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, at Sri Venkateshwara Printers. Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Districrt : Khammam Editor: Shaik Yacoob Pasha, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609